ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి


# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY

గురువారం 11-12 -2025 | సంపుటి: 27 సంచిక: 229 | Thursday 11- 12- 2025 | Vol.No 27 Issue No .229 | హైదరాబాద్ Hyderabad | పేజీలు: 12+12 | వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA | www.visionandhra.in



అక్రిడేషన్ లు కలవు
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
తెలుగుదిన పత్రికలో రిపోర్టర్లు కావలెను
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యం
కొత్త వారికి కూడా అవకాశం
సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్ :
9440897445, 8074636674

## నేడే తొలివిడత పంచాయితీ పోరు

- ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం
- తొలి విడతలో మొత్తం 189 మండలాలు
- 4,236 గ్రామ పంచాయతీలు, 37,440 వార్డులు
- రాష్ట్రవ్యాప్తంగా 37,562 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు
- తొలి విడతలో ఓటేయనున్న 56,19,430 మంది ఓటర్లు
- గ్రామాల్లో భారీగా బందోబస్తు ఏర్పాటు
- ఉదయం 7 నుంచి 1 గంటవరకు పోలింగ్
- మధ్యాహ్నమే ఓట్ల లెక్కింపు...ఫలితం ప్రకటన
- వివరాలు వెల్లడించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని




హైదరాబాద్,డిసెంబర్10 : తెలంగాణ రాష్ట్రంలో తొలి విడత గ్రామపంచాయతీ ఎన్నికలకు రంగం సిద్ధం అయ్యింది. ఇప్పటికే జోరుగా ప్రచారం నిర్వహించిన అభ్యర్థులు నేటి ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. గతంలో ఎప్పుడూ లేనంతగా పంచాయితీ ఎన్నికల్లో పోటీ పెరిగింది. తెలంగాణలో తొలి దశ గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ గురువారం జరగనున్నాయి. హైదరాబాద్‌లో ఎస్ఈసీ రాణి కుముదిని విలేకర్లతో మాట్లాడు తూ.. తొలి దశ పల్లె పోరుకు సర్వం సిద్ధం చేసినట్లు తెలిపారు. గురువారం ఉదయం 7.00 గంటల నుంచి ఈ పోలింగ్ ప్రారంభమవుతుందన్నారు. ఈ తొలి దశలో 56,19,430 మంది ఓటర్లు.. తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని చెప్పారు. ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని వెల్లడించారు. గురువారం జరగనున్న మిగతా2లో..



## 'మీ డబ్బు.. మీ హక్కు'

- అన్‌క్లెయిమ్డ్ మనీ సొంతం చేసుకోండి
- ప్రధాని మోడీ మరోమారు పిలుపు

న్యూఢిల్లీ, డిసెంబర్10 : అన్ క్లెయిమ్డ్ ఆస్తు విషయంలో ఆర్‌బిఐ ఇటీవలే మార్గదర్శకాలను జారీ చేసింది. దీంతో ప్రజల్లో కొంత చైతన్యం వచ్చింది. ఇప్పుడు ప్రధాని మోడీ కూడా తనవంతుగా ప్రచారం మొదలు పెట్టారు. ఇది ప్రజలకు మేలు చేస్తుందన్న భావనలో ఆయన ప్రకటన చేశారు. క్లెయిమ్ చేయని ఆస్తుల గురించి ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం 'లింక్డిన్' ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. మరిచిపోయిన, క్లెయిమ్ చేయని నగదును దక్కించుకునేందుకు ఇది మంచి అవకాశమని పేర్కొన్నారు అందుకోసం 'మీ డబ్బు.. మీ హక్కు' మూమెంట్‌లో పాల్గొనాలని సూచించారు. భారతీయ బ్యాంకుల్లో రూ.78 వేల కోట్లు, ఇన్సూరెన్స్ కంపెనీల్లో రూ.14 వేల కోట్లు, మ్యూచువల్ ఫండ్ కంపెనీల్లో రూ.3వేల కోట్లు, డివిడెండ్లు రూ.9వేల కోట్లు క్లెయిమ్ చేయకుండా ఉన్నాయని చెప్పారు. ఇటువంటి ఆస్తుల గురించి తెలుసుకునేందుకు సంబంధిత వెబ్‌సైట్లను ఆయన పంచుకున్నారు. ప్రతి పౌరుడు తనకు చెందిన సొమ్మును తిరిగి పొందేందుకే ఈ మూమెంట్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. మర్చిపోయిన ఆస్తులను కొత్త అవకాశంగా మార్చుకోండి. ఈ మూమెంట్‌లో భాగం కండి. ఈ ఆస్తుల వివరాలు ప్రజలను ఆశ్చర్యపరుస్తున్నాయి. ఏదిఏమైనప్పటికీ.. ఇవన్నీ ఎన్నో కుటుంబాలు కష్టపడి కూడబెట్టిన పొదుపు, పెట్టుబడులను సూచిస్తున్నాయని ప్రధాని తన పోస్టులో మిగతా2లో..

## ఆర్టీసికి 65 కొత్త ఎలక్ట్రిక్ బస్సులు

- కాలుష్య నివారణ లక్ష్యంగా కృషి
- బస్సులను ప్రారంభించిన మంత్రి పొన్నం




హైదరాబాద్,డిసెంబర్10 : తెలంగాణ రాష్ట్రంలో ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్యను గణనీయంగా పెంచుతూ, ఆర్టీసీని కాలుష్య రహిత ప్రజా రవాణా వ్యవస్థగా మార్చడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను కూడా త్వరలోనే పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. రాణిగంజ్ ఆర్టీసీ డిపోలో 65 కొత్త ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించిన సందర్భంగా మంత్రి ఈ వివరాలను వెల్లడించారు. ప్రస్తుతం తెలంగాణ ఆర్టీసీలో 810 ఎలక్ట్రిక్ బస్సులు పరుగులు పెడుతున్నాయి. ఇందులో జంట నగరాల పరిధిలో 300కు పైగా బస్సులు మిగతా2లో..

## ఉస్మానియా వర్సిటీకి మహర్దశ



- వెయ్యికోట్లు విడుదలకు సీఎం రేవంత్ అంగీకారం
- వెంటనే విడుదలకు విద్యాశాఖ ఉత్తర్వులు
- అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధికి కంకణం
- తెలంగాణ ఉద్యమంలో ఉస్మానియాదే కీలకం
- ధైర్యంతో కాదు...గుండెనిండా ప్రేమతో ఇక్కడికి వచ్చా
- చదువు రాకున్నా..చదువు విలువ తెలిసినోడిని
- ఉస్మానియా సభలో సిఎం రేవంత్ భావోద్వేగ ప్రసంగం

హైదరాబాద్,డిసెంబర్10 : ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దాలనే సంకల్పంతో వచ్చానని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. తెలంగాణ తొలి,మలి దశ ఉద్యమాలకు ఉస్మానియానే కేంద్రమని అన్నారు. ఎన్నో ఉద్యమాలకు ఇది వేదికగా నిలిచిందన్నారు. ఆధిపత్యానికి వ్యతిరేకంగా తెలంగాణలో అనేక పోరాటాలు వచ్చాయి. నిజాం, రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం జరిగింది. సామాన్యులైన చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య.. దొరలపై పోరాడారు. ఉమ్మడి రాష్ట్రంలో న్యాయం జరగలేదని తెలంగాణ ఉద్యమం వచ్చింది. ఉద్యమాన్ని ఉస్మానియా నుంచే విద్యార్థులు ప్రారంభించారు. గతంలో ఈ వేదిక నుంచే స్వరాష్ట్ర ఆకాంక్షను విద్యార్థులు బలంగా వినిపించారు. పోరాడి సాధించిన రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలు నెరవేరాయా.. లేదా.. అని ఇక్కడే తెలుసుకోవాలని అనుకున్నానని అన్నారు. బుధవారం ఉస్మానియా వర్సిటీని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఓయూకు రూ.1000 కోట్ల నిధులను సీఎం విడుదల చేశారు. ఈ నిధులను విద్యార్థులకు అంకితం చేశారు. మిగతా2లో..




## అగ్రస్థాయి స్టార్టప్స్‌లో గూగుల్ ఒకటి

- గూగులేది.. నేడు ప్రపంచ స్థాయిలో అగ్రస్థానం
- సమిష్టి కృషికి ఇదో పెద్ద నిదర్శనం
- స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు వేల కోట్లు
- గూగుల్ ఫర్ స్టార్టప్ కేంద్రాన్ని ప్రారంభించిన సిఎం రేవంత్



హైదరాబాద్,డిసెంబర్10 : హైదరాబాద్‌లో ఉన్న అగ్రస్థాయి స్టార్టప్స్‌లో గూగుల్ ఒకటని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మీరు యువకులు, శక్తివంతులు.. సాధారణంగా మీరు మీ కలలను సాకారం చేసుకోవాలనుకుంటారని పేర్కొన్నారు. బుధవారం టీ మిగతా2లో..

## ఫస్ట్రేషన్‌లో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం

- అన్ని ఆరోపణలకు ఆధారాలతో సమాధానమిస్తా..
- మీడియా సమావేశంలో జాగృతి అధ్యక్షురాలు కవిత



హైదరాబాద్,డిసెంబరు10 : కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తనను వ్యక్తిగతంగా టార్గెట్ చేయటం ఆయన ఫస్ట్రేషన్‌ను బయట పెడుతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ఆయన చేసిన అన్ని ఆరోపణలకు ఆధారాలతో మిగతా2లో..

## గ్లోబల్ సమ్మిట్‌తో ఊహించని విధంగా పెట్టుబడులు

- పేరెన్నిక గన్న కంపెనీలతో పలు ఒప్పందాలు
- ముందస్తు కార్యక్రమాలతోనే రాహుల్, ఖర్గేలు రాలేదు
- త్వరలోనే పార్టీ పదవుల భర్తీని పూర్తి చేస్తాం
- మీడియా సమావేశంలో పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



హైదరాబాద్,డిసెంబర్10 : గ్లోబల్ సమ్మిట్‌తో ఊహించని స్థాయిలో తెలంగాణకు పెట్టుబడులు వచ్చాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చెప్పుకొచ్చారు. పేరుగాంచిన కంపెనీలతోనే తమ ప్రభుత్వానికి ఒప్పందాలు జరిగాయని వివరించారు. ముందు కొన్ని కార్యక్రమాలు ఫిక్స్ కావడంతో ఏఐసీసీ అగ్రనేతలు మిగతా2లో..



## పల్లెలే దేశానికి వెన్నెముక

- అధికారుల పనితీరుతో గ్రామాలు పటిష్టం
- ఏపీలో అనేక సంస్కరణలు తీసుకువస్తున్నా
- ప్రతిభ ఆధారంగా పంచాయితీరాజ్ ఉద్యోగుల ప్రమోషన్లు
- ఆదాయ వనరులు పెంచడంలోనూ ఉద్యోగులే కీలకం
- పంచాయితీరాజ్ ఉద్యోగుల సమావేశంలో డిప్యూటి సిఎం పవన్

అమరావతి,డిసెంబర్10 : పల్లెలే దేశానికి వెన్నెముక అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. పల్లెల కోసమే పంచాయతీరాజ్ శాఖ తీసుకున్నా. పదేపదే మిగతా2లో..

## అమెరికాలో బిజీగా లోకేశ్ పర్యటన

- గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్
- అడోబ్ సీఈవో శంతను నారాయణన్‌లతో భేటీ



మిగతా2లో..

## ప్రజల ఆకాంక్షల మేరకు పథకాల్లో మార్పులు

- అప్పల రీ షెడ్యూల్‌తో వడ్డీ భారం తగ్గే ఛాన్స్
- వృద్ధిరేటు పెంచేందుకు అవసరమైన చర్యలు
- గతేడాదితో పోలిస్తే 32 శాతం మేర పెరిగిన ధాన్యం కొనుగోళ్లు
- ఉన్నతాధికారులతో సమీక్షలో సిఎం చంద్రబాబు

అమరావతి,డిసెంబర్10 : ప్రజల ఆకాంక్షల మేరకు పథకాల్లో మార్పులు, చేర్పులు జరగాలని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ప్రతి శాఖ చేసిన పనులన్నీ తన వద్ద రికార్డు రూపంలో ఉన్నాయని చెప్పారు. సచివాలయంలో సీఎం అధ్యక్షతన మంత్రులు, కార్యదర్శులు, హెచ్‌వోడీల సదస్సు నిర్వహించారు. వృద్ధిరేటు పెంపునకు తీసుకోవాల్సిన అంశాలు, అమలు ప్రణాళికపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని దిశానిర్దేశర చేశారు. అధిక వడ్డీలతో ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని.. అప్పులు రీ షెడ్యూల్ అయితే వడ్డీ భారత తగ్గుందని ఉన్నతాధికారులకు సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఏడాదికి రూ. 7 వేల కోట్లు ఆదా అవుతుందని ఆయన వివరించారు. కేంద్ర నిధులను ఖర్చు పెట్టండి.. యూసీలు ఇవ్వండని వారిని కోరారు. ఫైళ్లను పెండింగులో పెట్టొద్దని మంత్రులు, ఉన్నతాధికారులకు సూచించారు. పని తీరు మెరుగు పరచుకోవాలంటూ వారికి సీఎం చంద్రబాబు దిశా నిర్దేశంచేశారు. అనంతపురం వేరుశనగ రైతులకు దేశంలోనే తొలిసారి ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చాం. ఆ జిల్లాలో కరవు తీర్చేందుకు ఇజ్రాయెల్ సాంకేతికతను పరిశీలించాం. మిగతా2లో..



## 'మీ డబ్బు.. మీ హక్కు'

రాసుకొచ్చారు. ఇప్పటికే రూ.2వేల కోట్ల విలువైన ఆర్థిక ఆస్తులను ఈ ఏడాది అక్టోబరు, నవంబరుల్లో అర్హులైన హక్కుదారులకు అందించామని చెప్పారు. అనేక కారణాల వల్ల క్లెయిమ్ చేసుకోకుండా ఉన్న బ్యాంకు డిపాజిట్లు, బీమా, డివిడెండ్లు, షేర్లు, మ్యూచువల్ ఫండ్లు, పింఛన్ లాంటి ఆర్థిక ఆస్తులను సంబంధిత హక్కుదారులకు, చట్టబద్ధ వారసులకు అందించాలన్న లక్ష్యంతో 'యువర్ మనీ, యువర్ రైట్' కార్యక్రమాన్ని అక్టోబరు 4న దేశవ్యాప్తంగా ప్రభుత్వం ప్రారంభించింది. ఇందులోభాగంగా ప్రజాప్రతినిధులు, జిల్లా పాలనా అధికారులు, ఆర్థిక సేవల అధికారులతో అక్టోబరు నుంచి డిసెంబరు 5 వరకు 477 జిల్లాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేసి.. ప్రజలకు అవగాహన కల్పించినట్లు రాజ్యసభలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి ఇప్పటికే వెల్లడించారు. ఆర్థిక సంస్థల్లో ఉండిపోయిన తమ ఆర్థిక ఆస్తులను పొందేందుకు అనుసరించాల్సిన విధివిధానాలను తెలిపి, సందేహాలను పరిష్కరించడంతో పాటు పలు అంశాలపై అవగాహన కల్పించే విషయాలను ప్రధాన ప్రాంతీయభాషల్లోనే అందించామని వెల్లడించారు. తక్కువ సమయం నిడివితో వీడియో సందేశాల ద్వారా విస్తృతంగా ప్రచారం కల్పించామని మంత్రి తెలిపారు. ఆర్‌బీఐ, సెబీ, ఐఆర్‌డీఏఐ, పీఎఫ్‌ఆర్‌డీఏ, ఐఈపీఎఫ్ఏ లాంటి ఆర్థిక రంగ నియంత్రణ సంస్థల ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నాయని వివరించారు. ప్రజలు తమ అన్‌-లెకియిమ్డ్ ఆర్థిక ఆస్తులను కనుగొనడంలో ఆర్‌బీఐ 'ఉద్గమ్', ఐఆర్‌డీఏఐ 'బీమా భరోసా', సెబీ 'మిత్రా' సమర్థంగా ఉపయోగపడుతున్నాయని మంత్రి తెలిపారు.

## ఆర్టీసికి 65 కొత్త ఎలక్ట్రిక్ బస్సులు

తిరుగుతున్నాయి.జనవరి చివరి నాటికి మరో 175 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి రానున్నాయి. అత్యాధునిక 'పీఎం ఈ-డ్రైవ్' పథకం కింద అతి త్వరలో ఏకంగా 2,800 కొత్త ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రక్రియ దశలవారీగా ఒకటి లేదా రెండు సంవత్సరాలలో పూర్తవుతుందని మంత్రి తెలిపారు. ఆర్టీసీ రవాణా వ్యవస్థను ఈవీ బస్సుల ద్వారా ముందుకు తీసుకువెళ్లి, హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఆర్టీసీ సేవలను విస్తరించడంలో భాగంగా త్వరలో 373 కొత్త ప్రాంతాలకు బస్ కనెక్టివిటీని అందిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇంటర్ సిటీ ట్రాన్స్‌పోర్టేషన్ కింద వరంగల్, ఖమ్మం, నల్గొండ వంటి చుట్టుపక్కల జిల్లాల నుండి హైదరాబాద్‌కు ఈవీ బస్సులను ప్రారంభం చేసినట్లు ఆయన వివరించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ బస్సుల విస్తరణ జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, మహాలక్ష్మి పథకం అమలు ద్వారా ఆర్టీసీ వ్యవస్థ లాభాల బాట పట్టిందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆర్టీసీ కార్మికులకు భరోసా ఇస్తూ, వారి సమస్యలన్నీ అతి త్వరలో పరిష్కారమవుతాయని హామీ ఇచ్చారు. ప్రజా పాలన ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మహాలక్ష్మి పథకం ప్రారంభించి రెండేళ్లు పూర్తి చేసుకున్నామన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే ఆర్టీసీలో ఉచిత ప్రయాణం ప్రారంభించినట్లు తెలిపారు. ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్, శ్రామిక్, ఇతర సిబ్బంది ఎంతో శ్రమిస్తున్నారని.. వారందరికీ అభినందనలు చెప్పారు. ఇప్పటికే 251 కోట్ల మంది మహిళలు.. రూ.8,500 కోట్ల విలువైన ప్రయాణాలు చేశారన్నారు. హాస్పిటల్స్, దేవాలయాలు, ఉద్యోగాలు, బంధువుల ఇంటికి, స్కూళ్లకు రాకపోకలు సాగించారన్నారు. దేవాదాయ శాఖ ఆదాయం మహాలక్ష్మి పథకం ద్వారా పెరిగిందన్నారు. రెండేళ్లలో ప్రస్తుతమున్న 40శాతం బస్సులను కొనుగోలు చేయడం జరిగిందని.. ఆర్టీసీలో కొత్త రక్తం వస్తుందన్నారు. కొత్తగా డ్రైవర్లు, కండక్టర్లు, శ్రామిక్ వస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆర్టీసీ బస్సులకు మహిళలను యజమానులు చేసిందన్నారు. ఢిల్లీ లో నివాస యోగ్యం లేకుండా కాలుష్యం ఉన్న పరిస్థితి ఉందని.. ఇక్కడ అలాంటి పరిస్థితి రాకుండా రవాణా శాఖ ఈవీ పాలసీ, స్క్రాప్ పాలసీ తీసుకొచ్చిందన్నారు. ఆర్టీసీ సంస్థ పరిరక్షణ, ఉద్యోగుల సంక్షేమం, ప్రయాణికుల భద్రత దృష్టిలో పెట్టుకుంటున్నాం. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న అనేక అంశాలు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రయాణికులకు సౌకర్యంగా ఈవీ బస్సులు సమ్మక్క సారలమ్మ జాతర, శ్రీశైలం, యాదాద్రికి రాకపోకలు సాగిస్తాయన్నారు. ప్రత్యేక బస్సులు బస్సులు, నూతన బస్ డిపోల ఏర్పాటు, బస్ స్టేషన్లను అభివృద్ధి చేసుకుంటున్నామన్నారు. 1932లో ప్రారంభించిన అల్బియన్ బస్సు, మధ్యలో వచ్చిన ఎర్రబస్సు, ప్రస్తుతం నడుస్తున్న ఎలక్ట్రిక్ బస్సు అక్కడ ఎగ్జిబిషన్ పెట్టినట్లు చెప్పారు. ఎయిర్‌పోర్ట్‌లో ఇబ్బందులు వచ్చినా దగ్గరలో ఉన్న ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు నడిపినట్లు చెప్పారు. ప్రజావాణిలో మరిన్ని నిర్ణయాలు తీసుకుంటామని.. ఈవీ బస్సుల ప్రారంభోత్సవంతో నగరంలో మరింత మెరుగ్గా బస్సులు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. ఈవీ పాలసీని తీసుకువచ్చామని.. నగరంలో కాలుష్యాన్ని తగ్గించేందుకు ఈవీ, సీఎన్‌జీ, ఎల్‌పీజీ ఆటోలకు అనుమతి ఇచ్చినట్లు చెప్పారు. బస్సుల ప్రారంభోత్సవం సందర్భంగా నగర ప్రజలకు మంత్రి పొన్నం శుభాకాంక్షలు తెలిపారు.

## గ్లోబల్ సమ్మిట్‌తో ఊహించని విధంగా పెట్టుబడులు

మల్లికార్జున ఖర్గే ,రాహుల్ గాంధీ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు రాలేకపోయారని తెలిపారు. బుధవారం గాంధీభవన్‌లో మీడియాతో మహేశ్ కుమార్ గౌడ్ చిట్‌చాట్ చేశారు.తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై శ్వేతపత్రం విడుదల చేసే దమ్ము తమకు మాత్రమే ఉందని పేర్కొన్నారు. శ్వేతపత్రం అంటే బీఆర్ఎస్‌కు భయమని ఎద్దేవా చేశారు మహేశ్ కుమార్ గౌడ్. ఫ్యూచర్ సిటీ భవిష్యత్‌లో గొప్పగా ఉండబోతుందని తెలిపారు. త్వరలో వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్ట్‌లు భర్తీ చేస్తామని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. టీపీసీసీ నియామకం జరిగిన రోజే డీసీసీతో మినహా అన్ని పోస్టులు రద్దు అవుతాయని తెలిపారు. ఈనెల చివరి నాటికి కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్ పోస్టులు భర్తీ చేస్తామని చెప్పుకొచ్చారు. లంబాడాలకు నాలుగు జిల్లాలకు అధ్యక్షులను నియమించామని తెలిపారు. ఎస్టీలకు కాంగ్రెస్ పార్టీలో తగిన ప్రాధాన్యం ఉంటుందని వివరించారు. గ్లోబల్ సమ్మిట్ సక్సెస్ చూడలేక మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. లావాదేవీలలో భాగంగానే కవిత - బీఆర్ఎస్ నేతల మధ్య విమర్శలు చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కవిత కారణంగా బీఆర్ఎస్ కబ్జాలు అన్ని బయటకు వస్తున్నాయని విమర్శించారు. కవిత ఆరోపణలపై విచారణ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. తాను టీపీసీసీగా చాలా సంతృప్తిగా ఉన్నానని స్పష్టం చేశారు. ఆర్గనైజేషన్ అంటే తనకు ఇష్టమని చెప్పుకొచ్చారు. మీడియాలోనే తనకు డిప్యూటీ సీఎం పదవి ఇస్తున్నారని చెబుతున్నారని.. అప్పుడే మంత్రి పదవి ఇస్తున్నారంటూ కూడా ఊహాగానాలు వస్తున్నాయని తెలిపారు. లోక్‌సభలో ప్రియాంక గాంధీ చాలా బాగా మాట్లాడారని ప్రశంసించారు మహేశ్ కుమార్ గౌడ్. పశ్చిమ బెంగాల్ ఎలక్షన్ కోసం వందేమాతరాన్ని బీజేపీ తెరపైకి తెచ్చిందని విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జవాహర్ లాల్ నెహ్రూను విమర్శిస్తూ జీవితంలో అతిపెద్ద పొరపాటు చేశారని మండిపడ్డారు. నెహ్రూ వల్లే దేశం వెనకబడిందని బీజేపీ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఉస్మానియా విశ్వవిద్యాలయానికి వెళ్లాలంటే బయపడ్డారని ఎద్దేవా చేశారు. 1965లో ఇందిరాగాంధీ ఆర్ట్స్ కాలేజీకి వచ్చారని... 60 సంవత్సరాల తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి ఆర్ట్స్ కాలేజీకి వెళ్లడం చరిత్రగా నిలిచిందని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## నేడే తొలివిడత పంచాయితీ పోరు

రాయలసీమలో పశువులకు గడ్డి కూడా దొరకని పరిస్థితి ఉండేది. అనంతపురం జిల్లాలో నాణ్యమైన వేరుశనగ పండేలా చర్యలు చేపట్టాం. అన్నా హజారే, రాజేంద్రసింగ్ స్ఫూర్తితో జలసంరక్షణ చేపట్టాం. రాయలసీమలో ఇప్పుడు భూగర్భజలాలు పైకి వచ్చాయి. భూగర్భజలాలు 3 మీటర్లకు చేరితే ఖర్చుపెట్టే బ్జడెట్ తగ్గుతుంది. సౌరశక్తి వినియోగించుకుంటే విద్యుత్ డిమాండ్ బాగా తగ్గుతుంది. ఈ ఏడాది కరెంట్ ఛార్జీలు పెంచం. దేశంలో ఇండస్ట్రియల్ పార్కులు ఎక్కువగా ఉన్న రాష్ట్రం మనదే' అని చంద్రబాబు అన్నారు.మరోవైపు ధాన్యం కొనుగోళ్లపై సీఎం చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. 23 జిల్లాల్లో ఇప్పటి వరకూ 18.32 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు అధికారులు వివరించారు. గతేడాదితో పోలిస్తే 32 శాతం మేర ధాన్యం కొనుగోళ్లు పెరిగాయని ఈ సందర్భంగా తెలిపారు. మొత్తం 2,606 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రొక్యూర్‌మెంట్ పక్రియ జరుగుతున్నదని వెల్లడించారు. కొనుగోలు కేంద్రాల వద్ద 7.89 కోట్ల గోనె సంచులను రైతులకు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు.ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటలోనే రూ.4,085 కోట్ల మేర చెల్లింపులు జరిపినట్లు పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు వివరించారు. ఈ ఏడాది మొత్తంగా 50.75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకున్న ఈ సమీక్షా సమావేశంలో వివరించారు. ఈ సమీక్షకు వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌తోపాటు వ్యవసాయ, పౌరసరఫరాలు, ఆర్థిక శాఖలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు.ఈ సమావేశంలో వివిధ శాఖలపై ఉన్నతాధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సమావేశంలో మంత్రులు, కార్యదర్శులు, పలు విభాగాల అధిపతుల పాల్గొన్నారు.

## ఉస్మానియా వర్సిటీకి మహర్దశ

అలాగే, ఓయూ అభివృద్ధికి రూ.45 లక్షల చెక్కు పూర్వ విద్యార్థులు అందజేశారు. అనంతరం ఆర్ట్స్ కాలేజీ భవనం దగ్గర 'సర్వం సిద్ధం' పేరుతో నిర్వహించిన సభలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. స్వరాష్ట్ర ఆకాంక్షను బలంగా ఉస్మానియా యూనివర్సిటీ వినిపించిందని తెలిపారు. భవిష్యత్తు ప్రణాళికలపై చర్చించడానికి ఓయూకు వచ్చానని వివరించారు. గతంలో ముఖ్యమంత్రులను అడ్డుకున్న చరిత్ర ఉందని ప్రస్తావించారు. మీరు ఎందుకు ఓయూకు వెళ్లే ధైర్యం చేస్తున్నారని కొంతమంది తనతో అన్నారని గుర్తుచేశారు. మీరిచ్చే సూచనలు, మేధావులు ఇచ్చే సలహాలతో ఓయూను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దుతానని స్పష్టం చేశారు. విద్యార్థులకు తమ ప్రభుత్వం అండగా ఉండాలనే ఓ ఆలోచనతో ఇక్కడకు వచ్చానని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ధైర్యంతో కాదని.. విద్యార్థుల గుండెల నిండా ఉన్న అభిమానంతో ఆర్ట్స్ కాలేజీ వద్దకు వచ్చానని వ్యాఖ్యానించారు. తమ ప్రసంగాలు చదువుకొని కాదని.. తన మనసులో ఉన్నది చెప్పాలని ఇక్కడకు వచ్చానని చెప్పుకొచ్చారు. పురాతన యూనివర్సిటీలో ఉస్మానియా ఒకటని వివరించారు. ఉస్మానియా యూనివర్సిటీకి గొప్ప చరిత్ర ఉందని అభివర్ణించారు. ఇక్కడకు రావాలంటే ధైర్యం కాదని.. అభిమానం కావాలని చెప్పుకొచ్చారు. తెలంగాణలో చదువు లేకున్నా ఆధిపత్యాన్ని సహించరని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ప్రాంతానికి ఒక చైతన్యం, పౌరుషం ఉంది. ఎందరో ఓయూ విద్యార్థులు రాష్ట్రం కోసం ఆయుధాలతో అడవిబాట పట్టారు. గద్దర్, జార్జిరెడ్డి, పీవీ నరసింహారావు వంటి ఎంతోమంది ప్రముఖులను ఈ యూనివర్సిటీ ఇచ్చింది. బడికి వెళ్లని ఓ పేదింటి బిడ్డ అందెశ్రీ.. జయజయహే తెలంగాణ నినాదాన్ని అందించారు. సమాజానికి ఏ సమస్య వచ్చినా ఈ యూనివర్సిటీ విద్యార్థులు కదం తొక్కారు. రాష్ట్రం ఏర్పడ్డాక ఎవరి ఆస్తిలో వాటా అడగలేదు.. కేవలం స్వేచ్ఛ, సమాన అవకాశాలు మాత్రమే అడిగారు. మీరు ఎదిగేందుకు ఈ ప్రభుత్వం స్వేచ్ఛను ఇస్తుంది. ప్రపంచానికే మీరు దిక్సూచిగా మారాలి. ఎవరి గురించీ రాజకీయ వ్యాఖ్యలు చేయాలనుకోవడం లేదు. కొందరు రెండేళ్లుగా మాట్లాడుతున్నారు. నేను గుంటూరులో చదువుకోలేదు.. గూడుపుఠాణీలు చేయలేను. గుంటూరులో చదువుకున్న వాళ్లు బెంజ్ కారులో వెళ్లి పేదరికం గురించి తెలుసుకుంటారు. గుంటూరు, పుణె, అమెరికాలో చదువుకున్నాం అని ఉపన్యాసాలు ఇవ్వడం ద్వారా ఏం చెప్పాలని అనుకుంటున్నారు? నాకు భాష సరిగా రాకపోవచ్చు.. కానీ పేదవాడిని అర్థం చేసుకునే భాష వచ్చు. పేదవాడి బిడ్డ చదువుకుంటే ఎలాంటి ప్రయోజనం ఉంటుందో నాకు తెలుసు. పేదలు, నిస్సహాయులకు అండగా ఉండేలా చర్యలు చేపడుతున్నాం. నేను ఫాంహౌస్‌లు కట్టించుకోలేదు.. సాధారణంగానే ఉన్నా. రాష్ట్ర ముఖ్యమంత్రిగా, మీ సోదరుడిగా ఈ ఆర్ట్స్ కాలేజీ ముందు నిలుచున్నా. చరిత్రలో సజీవంగా నిలబడే కార్యక్రమాలు చేయాలని అనుకుంటున్నా. జయజయహే తెలంగాణ గీతం, తెలంగాణ తల్లిని ఆవిష్కరించుకున్నాం. వర్గీకరణ ద్వారా దళితుల సమస్యను శాశ్వతంగా పరిష్కరించాం. జనగణనలో కులగణన చేపట్టి వందేళ్ల సమస్యను పరిష్కరించాం. ప్రభుత్వం దగ్గర పంచేందుకు డబ్బు లేదు. దళితులకు మూడెకరాల భూమి ఇస్తామన్నారు.. గత పదేళ్లలో ఎవరికైనా ఇచ్చారా? భూములు ఉన్న ఆసాములు కూడా వెనుకబాటుతనంతో బాధపడు తున్నారు. దాన్ని నిర్మూలించాలంటే ప్రతి గ్రామంలో విద్యావకాశాలు పెంచాలి. నాణ్యమైన విద్య, స్కిల్స్‌ను అందించేందుకు కృషి చేస్తున్నాం. విద్య ఒక్కటే మన ఆత్మగౌరవాన్ని పెంచుతుందన్నారు.

విద్యాలయాల్లో కుల వివక్ష ఉండకూడదనే యంగ్ ఇండియా స్కూల్స్‌లో అందరూ కలిసి చదువుకునేలా చర్యలు చేపట్టాం. డబ్బు ఉన్నవాళ్లు ఎక్కడికి వెళ్లి అయినా చదువుకోగలరు. పేదింటి విద్యార్థులకు ఉస్మానియా యూనివర్సిటీ నాణ్యమైన విద్యను అందించాలి. మంజూరు చేసిన రూ.1000 కోట్లు డబ్బుగా కాదు.. భవిష్యత్తు తరాలకు పెట్టుబడిగా చూస్తున్నాం. ఉత్తుత్తి మాటలు చెప్పను.. మన చేనుకి చీడ పడితే ఏ మందు కొట్టాలో నాకు తెలుసు. నాకు ఇంగ్లిష్ రాదని వాళ్లు అనుకుంటున్నారు. చైనాకు కూడా ఆ భాష రాదు.. కానీ ఆ దేశం ప్రొడక్షన్ నిలిపివేస్తే అమెరికా కూడా విలవిలలాడుతుంది. భాష కేవలం కమ్యూనికేషన్ కోసం మాత్రమే.. అది నాలెడ్జ్ కాదు. రాష్ట్రానికి ఓయూ గుండెకాయ లాంటిది. సమస్యల మీద కొట్లాడతానంటే నేను వద్దు అనను. రాజకీయ పార్టీల మోచేతినీళ్లు తాగాలని.. వాళ్ల జెండాలు మోయాలని అనుకోవద్దు. మీ స్వతంత్రతను నిలబెట్టుకోండని రేవంత్ అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీకి ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. రూ.వెయ్యి కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రూ.వెయ్యికోట్ల నిధుల విడుదల జీవోను విద్యార్థులకు అంకితం చేస్తున్నట్లు సీఎం పేర్కొన్నారు.

## నేడే తొలివిడత పంచాయితీ పోరు

తొలి విడత సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరగేలా విస్తృత చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. తొలి విడతలో మొత్తం 189 మండలాలు, 4,236 గ్రామపంచాయతీలు, 37,440 వార్డులు ఎన్నికల పక్రియలో భాగంగా ఉన్నాయి. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 37,562 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయగా, తొలి విడతలో 56,19,430 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించు కోనున్నారు. వీరిలో 27,41,070 మంది పురుషులు, 28,78,159 మంది మహిళలు, 201 మంది ఇతరులు ఉన్నారు. తొలి విడతలో 395, రెండో విడతలో 495 గ్రామాల్లో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయని చెప్పారు. ఇప్పటి వరకు తనిఖీల్లో రూ.8.2 కోట్లు సీజ్ చేశామని వివరించారు. 50వేల మంది సివిల్ పోలీసులు విధుల్లో ఉంటారని, 60 ప్లటూన్స్ బృందాలు బయటి నుంచి వచ్చాయని ఎస్ఈసీ తెలిపారు.ఎన్నికల నిర్వహణ కోసం సుమారు లక్ష మంది ఎన్నికల సిబ్బందిని నియమించామని కమిషనర్ తెలిపారు. ఇందులో 3,591 మంది రిటర్నింగ్ అధికారులు, 93,905 మంది పోలింగ్ సిబ్బంది ఉన్నారు. అలాగే ఎన్నికల పక్రియను పర్యవేక్షించేందుకు 2,489 మైక్రో అబ్జర్వర్లను నియమించారు. పారదర్శకత కోసం 3,461 పోలింగ్ స్టేషన్లలో వెబ్‌కాస్టింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. మొత్తం 45,086 బ్యాలెట్ బాక్సులు వినియోగించనున్నారు. ఓటర్ సౌలభ్యం దృష్ట్యా 99 శాతం ఓటర్ స్లిప్పుల పంపిణీ పూర్తయ్యిందని కమిషనర్ వెల్లడించారు. మిగతా ఓటర్లు 'టీఎస్ ఈ-పోల్ మొబైల్ యాప్' ద్వారా కూడా తమ ఓటర్ స్లిప్‌ను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం ఉందన్నారు. అలాగే ఓటింగ్ కేంద్రం తెలుసుకునేందుకు అదే యాప్ ఉపయోగపడుతుందని తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో భాగంగా ఇప్పటివరకు 3,214 ఎఫ్ఐఆర్లు నమోదు చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా.. 31,428 మందిని బైండోవర్ చేసినట్లు, 902 లైసెన్స్ ఆయుధాల డిపాజిట్, రూ.7.54 కోట్ల విలువైన నగదు, మద్యం, డ్రగ్స్, విలువైన లోహాల స్వాధీనం చేసినట్లు రాణి కుముదిని వెల్లడించారు. నిన్న సాయంత్రం నుంచే మద్యం దుకాణాలు మూసివేశామని ఆమె తెలిపారు. భద్రతా చర్యలలో భాగంగా 31 జిల్లాల అధికారులకు మేజిస్ట్రేట్ పవర్స్ ఇచ్చామని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్, రెవెన్యూ యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తోందన్నారు. ఎన్నికల ప్రచారం కూడా మంగళవారం సాయంత్రం 5 గంటలతో ముగిసింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఓటర్లకు విజ్ఞప్తి చేస్తూ, భయభ్రాంతులు లేకుండా ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య బలోపేతంలో ఓటు కీలకమని పేర్కొంటూ, గ్రామాల భవిష్యత్తు నిర్ణయంలో ఓటు శక్తిని గుర్తించాలని ఆమె అన్నారు. అబ్జర్వర్లు, మైక్రో అబ్జర్వర్లతో ఈ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద సీసీ కెమెరా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ ఎన్నికల విధుల్లో లక్ష మందికి పైగా సిబ్బంది పాల్గొనున్నారని వివరించారు. ఈ ఎన్నికల్లో ఓటర్లు 18 రకాల ఐడి కార్డులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఏ రకమైన ఐడి కార్డును పోలింగ్ బూత్ అధికారులకు చూపించిన ఓటు వేయవచ్చునన్నారు. ఇక మంగవారం నుంచి ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో వైన్ షాపులన్నీ మూసి వేసినట్లు చెప్పారు. అన్ని జిల్లాల కలెక్టర్లకు మేజిస్ట్రియల్ పవర్స్ ఇస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు ఎస్ఈసీ వివరించారు. బందోబస్తు, శాంతిభద్రతల అంశాన్ని పోలీసులు పరిశీలిస్తున్నారని చెప్పారు. పోలింగ్ పూర్తికాగానే కౌంటింగ్ జరుగుతుందన్నారు.

## అగ్రస్థాయి స్టార్టప్స్‌లో గూగుల్ ఒకటి

హబ్‌లో గూగుల్ స్టార్టప్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు రూ.వేల కోట్లు కేటాయిస్తున్నామని రేవంత్‌రెడ్డి అన్నారు. మూడు దశాబ్దాల క్రితం స్టార్టప్‌గా ప్రస్థానం ప్రారంభించిన గూగుల్.. నేడు ప్రపంచస్థాయిలో నిలిచిందని చెప్పారు. ఆ సంస్థను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. టీహబ్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన గూగుల్ ఫర్ స్టార్టప్ కేంద్రాన్ని ఐటీ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి సీఎం ప్రారంభించారు. హైదరాబాద్‌ను స్టార్టప్‌లకు కేంద్రంగా చేయనున్నట్లు రేవంత్ తెలిపారు. స్టార్టప్‌లు యూనికార్న్ స్థాయికి ఎదిగేలా ప్రణాళిక సిద్ధం చేసుకుని కృషి చేయాలని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సీఎం సూచించారు. ఉన్నత ఆశయాలతో 1998లో ఇద్దరు స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ మిత్రులు ఇద్దరు కలిసి కాలిఫోర్నియాలో ఒక గ్యారేజీలో ఓ స్టార్టప్‌ను ప్రారంభించారని తెలిపారు. అదే నేటి ప్రఖ్యాత గూగుల్ కంపెనీగా అవతరించిందని గుర్తుచేశారు. తెలంగాణ భవిష్యత్ అభివృద్ధిని ఆకాంక్షించి ప్రపంచానికి తెలంగాణ బ్రాండ్‌ను పరిచయం చేయాలని గత రెండు రోజులు, మనం తెలంగాణ రైజింగ్ 2047 గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహించామని వివరించారు. జాతీయ అంతర్జాతీయ కార్పొరేట్ల సమక్షంలో తెలంగాణ భవిష్యత్ కోసం మన విజన్‌ను ఆవిష్కరించామని పేర్కొన్నారు. 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దాలనే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. గత 20 ఏళ్ల క్రితం ప్రారంభించిన అనేక స్టార్టప్స్ నేడు బిలియన్ల డాలర్ల కంపెనీలుగా ఎదిగాయని చెప్పుకొచ్చారు సీఎం రేవంత్‌రెడ్డి.'గూగుల్, ఆపిల్, అమెజాన్, టెస్లా, ఫేస్‌బుక్ ఇలాంటి గొప్ప ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. గత 25 సంవత్సరాల్లో సాఫ్ట్‌వేర్ సర్వీసెస్, ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాల్లో హైదరాబాద్‌లో చాలా స్టార్టప్స్ పెద్ద కంపెనీలుగా ఎదిగాయి. తెలంగాణ రైజింగ్ విజన్ స్టార్టప్స్ కోసం మీ ప్రణాళికలు ఏంటని అడిగితే... స్టార్టప్స్‌ని ఫుట్‌బాల్ ఆటతో పోలుస్తాం. నేను ఆ ఆట ఆడతాను. ఫుట్‌బాల్‌లో సమష్టి కృషి అవసరం. పట్టుదలతో సాధన చేయాలి. ఇది టీమ్ వర్క్. కానీ చివరకు గెలుపు చాలా ముఖ్యం. స్టార్టప్స్ కూడా అదే విధంగా ఉండాలి. ఈ రోజు నుంచి హైదరాబాద్ ప్రొడక్ట్ బేస్డ్ స్టార్టప్స్, ఇన్నోవేటివ్ స్టార్టప్స్, ఐపీ ఇంటెన్సివ్ స్టార్టప్స్ వీటి పైనే దృష్టి పెట్టాలి' అని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశర చేశారు.'హైదరాబాద్ కేవలం స్టార్టప్స్ హబ్‌గా ఎదగడమే కాదు. ఆ కంపెనీలు యూనికార్న్ కంపెనీలుగా ఎదగాలని కోరుకుంటున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్ నుంచి కనీసం 100 స్టార్టప్‌లు యూనికార్న్ కంపెనీలుగా ఎదగాలని ఆశిస్తున్నాం. కనీసం 1 బిలియన్ డాలర్ల విలువ కలిగిన కంపెనీలుగా ఎదగాలి. 2034 నాటికి వాటిల్లో కనీసం 10 సూపర్ యూనికార్న్ కంపెనీలుగా ఎదగాలి. అందుకోసం రాష్ట్రంలో ఒక మంచి ఎకోసిస్టమ్‌ను సృష్టించాలనుకుంటున్నాం. తెలంగాణ ప్రభుత్వం, గూగుల్ మీకు అవసరమైన సహకారం అందించడానికి సిద్ధంగా ఉన్నాయి. స్టార్టప్‌ల కోసం మా ప్రభుత్వం రూ. 1000 కోట్లతో స్టార్టప్స్ ఫండ్ ఏర్పాటు చేస్తుంది. ఆ ఫండ్స్‌ను వినియోగించుకోండి. తద్వారా స్టార్టప్‌లు గూగుల్ స్థాయిలో లేదా 1 బిలియన్ డాలర్ల కంపెనీగా ఎదగాలని కోరుకుంటున్నాం' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. దేశంలో తొలిసారిగా హైదరాబాద్‌లో గూగుల్ ఫర్ స్టార్టప్ కేంద్రాన్ని ఏర్పాటుచేయడం సంతోషంగా ఉందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఇప్పటికే ఎన్నో జీసీసీలు నగరంలో పెట్టుబడులు పెడుతున్నాయని.. స్టార్టప్‌లు సైతం ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశరచుకుని ముందుకువెళ్లాలని సూచించారు.

## అమెరికాలో బిజీగా లోకేశ్ పర్యటన

శాన్ ఫ్రాన్సిస్కో,డిసెంబర్10 : రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో అమెరికాలో పర్యటిస్తున్న ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ టెక్ దిగ్గజ సంస్థల సీఈవోలతో సమావేశమయ్యారు. శాన్ ఫ్రాన్సిస్కోలో గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్, అడోబ్ సీఈవో శంతను నారాయణన్‌లతో ఆయన వేర్వేరుగా భేటీ అయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలపై చర్చించారు. గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్‌తో జరిగిన సమావేశంలో విశాఖపట్నంలో ఏర్పాటు చేయనున్న 15 బిలియన్ డాలర్ల ఏఐ డేటా సెంటర్ పనుల పురోగతిపై ప్రధానంగా చర్చించారు. ఈ భారీ పెట్టుబడికి ముందుకు వచ్చినందుకు గూగుల్ బృందానికి లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు. ఏపీలో రాబోతున్న డ్రోన్ సిటీలో గూగుల్ డ్రోన్ అసెంబ్లీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన సుందర్ పిచాయ్, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను సంస్థలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అమెరికా వెలుపల గూగుల్ పెడుతున్న అతిపెద్ద ఎఫ్‌డీఐ విశాఖ డేటా సెంటర్ అని ఆయన పేర్కొన్నారు. ఈ భేటీలో గూగుల్ క్లౌడ్ సీఈవో థామస్ కురియన్ కూడా పాల్గొన్నారు. అనంతరం అడోబ్ సీఈవో శంతను నారాయణన్‌తో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. విశాఖలో అడోబ్ గ్లోబల్ కేపబిలిటీ



సెంటర్ (జీసీసీ) లేదా డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా, శంతను నారాయణన్ డైరెక్టర్‌గా ఉన్న ÷జైర్, కేకేఆర్ వంటి సంస్థల పెట్టుబడులను కూడా ఏపీకి తీసుకురావాలని కోరారు. విశాఖలోని ఫార్మా జోన్‌లో ÷జైర్ ఎ÷-లాంట్ ఏర్పాటు, ఆరోగ్య సంరక్షణ రంగంలో కేకేఆర్ పెట్టుబడులు పెట్టేలా సహకరించాలని విన్నవించారు. మంత్రి లోకేష్ చేసిన విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించిన శంతను నారాయణన్, తన సహచరులతో చర్చించి తగిన నిర్ణయం ప్రకటిస్తామని హామీ ఇచ్చారు.

## పల్లెలే దేశానికి వెన్నెముక

సమీక్షలు నిర్వహించి సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నా అని అన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ సహకారం, సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఏపీలో అనేక సంస్కరణలు తీసుకు వస్తున్నామని.. అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇప్పుడు సంస్కరణల ద్వారా పదోన్నతలు ఎలా వచ్చాయో అందరికీ బాగా తెలుసన్నారు. మంగళగిరిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఉద్యోగులతో ఆయన మాటామంతీ నిర్వహించారు. ఉద్యోగులు శాఖాపరమైన సమస్యలను పవన్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆయన మాట్లాడారు. పంచాయతీరాజ్ శాఖలో పదోన్నతులు ఇవ్వకపోవడం సరికాదనిపించింది. గత ప్రభుత్వంలో ప్రతి పోస్టుకు, బదిలీకి ఓ రేటు పెట్టారు. ఈ పద్ధతిని పూర్తిగా నిర్మూలించాలని చెప్పాను. పనులు చేసిన కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లుల చెల్లింపు చేయాలని ఆదేశించానని వెల్లడించారు. పంచాయతీరాజ్ అనుబంధ శాఖల్లో 2లక్షల మంది ఉద్యోగులు ఉన్నారు. సీనియారిటీ, సిన్సియారిటీ, పనితీరు ఆధారంగా పదోన్నతులు ఇవ్వాలని అధికారులకు చెప్పా. మంత్రులు, ఎమ్మెల్యేలు సిఫార్సులు కూడా ఆ పరిధిలో ఉంటేనే చెప్పాలని సూచించాను. 10 వేల మందికి పదోన్నతు లు కల్పించాం. పదోన్నతి వచ్చిన ఉద్యోగి ఇంట్లో పండుగ వాతావరణం ఉంటుంది. జీతాలు ఇంకా పెరగాలంటే రాష్ట్ర ఆదాయం పెరగాలి. ఆదాయం పెంపుపై అధికారులు దృష్టి పెట్టాలని అన్నారు. శశిభూషణ్‌కుమార్, కృష్ణతేజ, వెంకటకృష్ణ వంటి అధికారుల కృషి ప్రశంసనీయం. నా తండ్రి కూడా ప్రభుత్వ ఉద్యోగే.. అందుకే ఉద్యోగులపై సానుకూల భావన ఉందని పవన్ అన్నారు. కొన్ని సందర్భాల్లో నిర్ణయం తీసుకుంటే తప్పు.. తీసుకోకుంటే ఒప్పు అయిన పరిస్థితులు ఎదురయ్యాయని చెప్పుకొచ్చారు. అయినా కూడా తన పని తాను చూసుకుంటూ ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. డిప్యూటీ సీఎంగా తన సొంత తెలివి తేటలు ఏమీ కూడా వాడడంలేదన్నారు. బలమైన అధికారులు తనతో ఉన్నారని.. రిఫామ్స్ తీసుకువచ్చి పనిచేశారని అన్నారు. గతంలో చాలా అంశాల్లో పారదర్శకత లేదని తన దృష్టికి తీసుకు వచ్చారని.. సమీక్షల సమయాల్లో చిన్న చిన్న మార్పులు తీసుకువచ్చి పని చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించామని తెలిపారు. తన తండ్రి ఒక ప్రభుత్వ ఉద్యోగి అని.. తనకు ఉద్యోగులంటే ఎనలేని గౌరవం ఉందని పేర్కొన్నారు. ఇంట్లో, ఆఫీసుల్లో ఉద్యోగులకు ఉండే సాధక బాధకాలపై తనకు అవగాహన ఉందని చెప్పుకొచ్చారు. ఉద్యోగులకు ఏమి చేయాలని ఆలోచన చేస్తే.. రిఫామ్స్ తేవాలని అధికారులు చెప్పారని అన్నారు. కష్టపడి పని చేసే వారికి ఎదుగుదల ఎంతో ముఖ్యమని భావించి అమలు చేశామని డిప్యూటీ సీఎం అన్నారు. గత ప్రభుత్వంలో రోడ్లు, మౌలిక వసతులను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. వారు ఉద్యోగుల ఇబ్బందులను కూడా కనీసం పట్టించుకోలేదన్నారు. తాము ఉద్యోగుల ఇబ్బందులు, గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రణాళికలు అమలు చేశామని తెలిపారు. పంచాయతీరాజ్ శాఖలో దాదాపు రెండు లక్షల మంది అవుట్ సోర్సింగ్‌లో ఉన్నారని.. వీరికి పదోన్నతలు ఎలా చేయాలనే అంశంపై మాట్లాడితే వెంకటకృష్ణ వెనెముకలాగా పనిచేశారని తెలిపారు. నేటికీ మన దగ్గర వ్యవస్థలు బలంగా ఉన్నాయంటే వెంకట కృష్ణ, శశిభూషణ్ లాంటి అధికారులు ఉండటమే కారణమని చెప్పారు. ఇదంతా ఒక్కరు చేసింది కాదని.. అందరూ సమిష్టిగా అధికారుల సమూహం పని చేయడం ద్వారానే ఈ ఫలితాలు వచ్చాయన్నారు. తాను ఎక్కడా జోక్యం చేసుకోలేదని.. క్లీన్ గవర్నెన్స్ కావాలని మాత్రమే అధికారులకు చెప్పానని తెలిపారు. తన తండ్రి తాలూకా అనుభవం తనకు పని చేసింది కాబట్టే.. సీనియారిటీ, క్యాపబులిటీ చూడాలని మాత్రమే చెప్పానన్నారు. బదిలీలు, పదోన్నతులపై అనేక మంది మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా సిఫార్సు లెటర్లు ఇచ్చారని.. అయితే వారు సిఫార్సు చేసిన అధికారికి అర్హత ఉంటేనే చేయాలని స్పష్టంగా చెప్పామన్నారు.

## ఫస్ట్‌స్టేషన్‌లో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం

సహా వివరణ ఇస్తానన్నారు. కూకట్‌పల్లిలో 15 ఏళ్లుగా ఉన్న సమస్యలనే తాను చెప్పానని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడిన మాటలకు ఫీలయ్యేది లేదని... ప్రజలు అన్నీ గమనిస్తున్నారని అన్నారు. జాగృతి జనం బాటలో భాగంగా ఐదు రోజుల పాటు హైదరాబాద్ జిల్లాలో పర్యటిస్తామని తెలిపారు. నేడు కంటోన్మెంట్‌లోని బోయినపల్లి గవర్నమెంట్ స్కూల్‌ను సందర్శించినట్లు చెప్పారు. మన ఊరు- మన బడి కార్యక్రమంలో భాగంగా ఈ స్కూల్‌ను బాగు చేశారని.. కానీ కాంపౌండ్ వాల్, సీసీ కెమెరాలు లేవన్నారు. వాటిని తాము ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ స్కూల్లోనే అంగన్ వాడీని కూడా కలిపారని... కానీ అంగన్‌వాడీలో హెల్పర్లు లేరన్నారు. జనం బాటలో భాగంగా విద్య, వైద్యం మీద ఫోకస్ పెట్టామని వెల్లడించారు. స్కూల్స్, హాస్పిటల్స్‌లో మౌలిక వసతులు ఎలా ఉన్నాయన్నది పరిశీలిస్తున్నామన్నారు. ఇండ్లు, ఇళ్ల పట్టాలను లేని వారి సమస్యలు కూడా తెలుసుకుంటున్నామన్నారు. తమ వరకు చేయగలిగేది ఒక సంస్థగా చేస్తామని స్పష్టం చేశారు. టాప్ టెన్ విద్యార్థులకు జాగృతి తరఫున స్కాలర్ షిప్‌లు ఇస్తామని ప్రకటించారు. ఏ జిల్లాకు వెళ్లినా ప్రజల నుంచి ఆదరణ, సమస్యలు పరిష్కరించే అవకాశం ఉంటోందన్నారు. ప్రజల సమస్యలను వీలైనంతగా పరిష్కరిస్తామని ప్రకటించారు. గత ప్రభుత్వంలో తనను నిజామాబాద్‌కే పరిమితం చేశారని.. అప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా ఏం జరుగుతుందో చూడలేదన్నారు. తెలంగాణ వచ్చాక ఏం జరిగింది... ఏం జరగలేదన్నది జనం బాట కార్యక్రమం ద్వారా తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. తాము చేయగలిగేవి చేస్తామని... మిగిలిన సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. మంచిని మంచి, చెడును చెడు అనే అంటామని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో ప్రతిపక్షం పట్టించుకోవటం లేదని... పాలక పక్షం అసలే పట్టించుకుంట లేదని.. అందుకే జాగృతి జనం గళమై పనిచేస్తోందని కవిత పేర్కొన్నారు.


# సంపాదకీయం

## రాహుల్ కన్నా ప్రియాంక బెటర్ !

లోక్‌సభలో రెండు రోజుల పాటు రెండు అంశాలపై జరిగిన చర్చలో..విపక్ష సభ్యులు మాట్లాడిన తీరును పరిశీలిస్తే.. రాహుల్ తన అపరిపక్వతను మరోమారు బయట పెట్టుకున్నారు. అదే సమయంలో కాంగ్రెస్ ఎంపి ప్రియాంకా వాద్రా మాత్రం పరిణతి చెందిన రాజకీయ నేతగా రాణించారు. వందేమాతరంపై చర్చలో ప్రియాంక ఓ రకంగా మోడీని అడ్డుకుని తీరారనే చెప్పాలి. నెహ్రూ ద్రోహం గురించి మోడీ మాట్లాడిన సందర్భంలో ఆమె గట్టిగానే ఎదుర్కొన్నారు. ఇవాళ జరుగుతున్న అభివృద్ధికి అంతా నెహ్రూ వేసిన పునాది అని గట్టిగా చెప్పగలిగారు. అలాగే వందేమాతరం ప్రస్తావన ద్వారా నెహ్రూను ఎండగట్టాలన్న తీరును కూడా తప్పు పట్టారు. ఒకవేళ నెహ్రూ గురించి అయితే ఓ రోజంతా చర్చిద్దామని, తిరిగి మళ్లీ నెహ్రూ జోలికి వెళ్లవద్దని అన్నారు. అయితే ఆమె మాట్లాడిన తీరు పరిణతి చెందిన రాజకీయ నేతగా కనిపించారు. సమస్యలను లోతుగా ఎత్తిచూపి మాట్లాడే సత్తా ఉన్న నేతగా కనిపించారు. రాహుల్‌తో పోలిస్తే ఆమె చాలా మెరుగైన నాయకత్వ లక్షణాలను కనబర్చారు. రాజకీయంగా మోడీని లేదా బిజెపిని ఎదుర్కొనే విషయంలో ఆమె సందర్భోచితంగా మాట్లాడ కలుగుతున్నారు. ఈ లెక్కన కాంగ్రెస్‌కు ఆమె సరైన నేతగా దారి చూపగల రని భావించవచ్చు. ఎందుకంటే రాహుల్ కేవలం ఓట్ చోరీ అని నిందించడం తప్ప ఆధారాలను సమర్పించే ప్రయత్నం ఇప్పటి వరకు చేయలేదు. బీహార్‌లో ఇదే నినాదంతో పోయి బొక్కబోర్లా పడ్డారు. అయినా ఆయనలో మార్పు కనిపించడం లేదు. ఎందుకంటే పార్లమెంటులో కూడా మళ్లీ ఇదే విధంగా తన పాతపాటనే పాడారు. ఓట్ల తొలగింపు ప్రక్రియ సర్‌ను తప్పుపట్టడమే పెద్ద తప్పు. రాజ్యాంగ వ్యవస్థను పనిచేయకుండా అడ్డుకున్నట్లేనని గురించండ లేదు. ఓట్ల తొలగింపు ద్వారా అర్హులైన ఓటర్లను గుర్తించ కేసు వేయించివుంటే రాహుల్ ప్రతిభ ఇనుమడించేది. సుప్రీం కూడా ఇదే కోరింది. కానీ రాహుల్ అది చేయలేదు. తాజాగా పార్లమెంటులోమంగళవారం సర్ ప్రక్రియపై రాహుల్ మాటలు పేలవంగా ఉన్నాయి. ప్రజలను ఆకట్టుకునేలా ప్రసంగం లేదు. అలాగే తప్పులను ఎత్తిచూపే విధంగానూ లేదు. కేవలం ఆర్‌ఎస్‌ఎస్‌ను దుమ్మెత్తి పోయడం ద్వారా మైనార్టీ ఓటు బ్యాంక్‌ను పదిల పర్చుకునే ఎత్తుగడ ప్రదర్శించారు. ఓటుచోరీ అనేది అతిపెద్ద దేశద్రోహమని, ఎన్నికల సంఘంతో కలిసి భాజపా దానికి పాల్పడుతోందని రాహుల్‌గాంధీ మరోసారి ఆరోపించారు. ఎన్నికల సంస్కరణలపై మంగళవారం లోక్‌సభలో ప్రత్యేక చర్చలో ఆయన తన పాత మాటలనే రికార్డుగా వినిపించారు. దేశ మూలాలనే దెబ్బతీసేలా ఓటుచోరీ జరుగుతోందని, సంస్థాగత వ్యవస్థ మొత్తాన్ని ఆరెస్సెస్ టోకుగా గుప్పిట పట్టిందని చెప్పడం ద్వారా వ్యవస్థను తప్పు పట్టారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నా ఎన్నికల సంఘం ఇదే చేసేది. భారత ప్రజాస్వామ్యానికి భంగం కలిగేలా ఎన్నికల సంఘాన్ని భాజపా వాడుకుంటోందని ఆరోపించడం ద్వారా ప్రజలల్లో తనకు ఇమేజ్ లేదని చెప్పుకున్నారు. ఎన్నికలకు నెల ముందు మెషీన్ రీడబుల్ నమూనాలో అన్ని పార్టీలకూ ఓటర్ల జాబితాలు ఇవ్వండని అడగడంలో తప్పు లేదు. కానీ నేతలు నిష్పాక్షికంగా ఉన్నప్పుడే ఎన్నికల సంస్కరణలు సాధ్యమవుతాయని గుర్తించాలి. కాంగ్రెస దేశంలో దశాబ్దాల పాటు పాలన చేసింది. దీనికి ఓట్ చోరీ కారణమని అనుకోవాలా అన్నది రాహుల్ చెప్పాలి. ఎన్నికలవ్యవస్థపై దాడిచేసే బదులు నిర్మాణాత్మక విమర్శలు,సూచనలు చేసివుంటే రాహుల్ ప్రతిభ ఇనుమడించేది. అందుకే ప్రియాంకతో పోలిస్తే రాహుల్‌కు విషయ పరిజ్ఞానం తక్కువని తేలిపోయింది. నిజానికి బిహార్ అసెంబ్లీ ఎన్నికలలో ప్రజలు ఇచ్చిన తీర్పును పరిశీలిస్తే విపక్షం పట్ల ప్రజల విముఖత ప్రతిబింబించింది. లాలూ కుటుంబంతో పాటు, రాహుల్ తీరుపై అంటే కాంగ్రెస్‌పై ఉన్న వ్యతిరేకత స్పష్టంగా ప్రతిబింబించింది. ఈ ప్రజాతీర్పును ప్రజలంతా అంగీకరించి నా, రాహుల్ మాత్రం అంగీకరించడం లేదు. ఓట్ చోరీ మాయలో పడ్డ ఆయన మొత్తం ఎన్నికల తీరునే తప్పు పట్టారు. సర్ ప్రక్రియను కూడా తప్పు పట్టడం రాజ్యాంగ వ్యవస్థల పనితీరును ప్రశ్నించడం తప్ప మరోటి కాదు. రాహుల్ పరిణతి రాజకీయాలు అవలంబించాలి. రాహుల్‌గాంధీ ఎంతకూ ఓట్ చోరీ, నిరుద్యోగిత అంశాలకే పరిమితమయ్యారు. అంతే తప్ప సమస్యలు లేదా ప్రజలు నిరంతరం ఎదుర్కొం టున్న ప్రధాన విషయాలను ప్రస్తావించడంలో రాహుల్ విఫలం అయ్యారు. పార్లమెంటులో అనేక సమస్యలను ప్రస్తావించి చర్చించడంలో విపక్షనేతగా విఫలం అయ్యారు. విపక్షాల పట్ల ప్రజల్లో ఒక ప్రగాఢ ఆకాంక్షను నెలకొల్పడంలోనూ ప్రతిపక్ష రాజకీయ పార్టీలు విఫలమయ్యాయి. బిహార్‌లో మాత్రమే ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమాన్ని చేపట్టింది. ఇప్పుడు బెంగాల్ సహా అనేక రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ మొదలయ్యింది. బెంగాల్లో మమతా బెనర్జీ కూడా మొత్తం పక్రియనే వ్యతిరేకిస్తోంది. ఇది ఎంతవరకు సబబో ఆలోచించాలి. ప్రజలు ఏం సమస్యలు ఎదుర్కొంటున్నారో..పార్లమెంట్ వేదికగా వాటికి ఎలాంటి పరిష్కారం చూపాలో అన్నది వపక్ష పార్టీల బాధ్యత. కేవలం ఓట్ చోరీ నినాదాలతో ముందుకు నడవలేరు. పార్లమెంటులో ఆయా అంశాలపై చర్చ జరక్క పోవడానికి కారణం ఇదే. అందుకు విపక్ష పార్టీలదే బాధ్యత. కాంగ్రెస్‌కు సంబంధించినంత వరకు ప్రియాంకను విపక్ష నేతగా చేస్తే మంచిది. ఆమెను మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలి. అప్పుడు ఆమె రాటుదేలుతుందనడంలో ఎలాంటి అనుమానాలు అక్కర్లేదు.

# పంచాయతీ ఎన్నికలు పేరుకే రాజకీయేతరం

## పంచాయతీ ఎన్నికల్లోనూ అలవికాని హామీలు!



హైదరాబాద్ బ్యూరో చీఫ్, డిసెంబర్ 10 (విజన్ ఆంధ్ర ): ఆవు చేలో మేస్తే... దూడ గట్టున మేస్తుందా? అని సామెత. తెలంగాణలో పంచాయతీ ఎన్నికల వార్తలు ఈ సామెతనే గుర్తు చేస్తున్నాయి. ప్రజాపాలన ఉత్సవాలు, వివిధ కార్యక్రమాల సందరరేగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పంచాయతీ ఎన్నికల్లో ఓటర్లు "హాఫ్‌కు" "ఫుల్‌కు" ఓటేయవద్దని చేసిన వ్యాఖ్య ఆసక్తికరంగా మారింది. డబ్బు, మద్యం వంటి ?ప్రలోభాలకు లొంగవద్దని సీఎం స్వయంగా చెప్పడం ఆహ్వానించదగ్గది. అన్ని పార్టీలవారు వీటిని పాటించడం అవసరం. కాని అలాంటి మాటలు చెప్పడానికి ముందు పాటించి చూపడమూ ముఖ్యమే. శాసనసభ, లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ తదితర పార్టీలు ఎంత విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేస్తున్నదీ మద్యం ఎలా పారుతోంది? అందరికీ తెలిసిన విషయమే. ఈ సంగతులన్నీ ప్రజలకు తెలియవా? ఈ మధ్యనే జరిగిన జూబ్లిహిల్స్ ఉప ఎన్నికలోనూ కాంగ్రెస్, ఒక్కో ఓటుకు రూ.2500 నుంచి రూ.నాలుగైదు వేల వరకు పంపిణీ చేసినట్లు ఆరోపణలున్నాయి. బీఆర్ఎస్ ఓటుకు రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు ఇచ్చిందని వార్తలు వచ్చాయి. వారీ స్థాయిలో కాకపోయినా బిజెపి కూడా బాగానే ఖర్చు చేసింది కదా! రేవంత్, మంత్రులు ఆకాశమే హద్దుగా హామీలు ఇచ్చారు కదా!

ఇన్ని చేసినవారు సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలలో మద్యం, డబ్బు పంచవద్దని చెబితే జనానికి పడతాయా? అయినా సీఎం హితబోధ చేయడాన్ని తప్పు పట్టనక్కర్లేదు. రేవంత్ మరో మాట కూడా చెబుతున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన చేస్తోందని, మంచి ప్రభుత్వం కనుక ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు వచ్చాయని, మరో మూడేళ్లు ఈ ప్రభుత్వానికి సహకరించే సర్పంచ్‌లు ఎన్నికైతే మరిన్ని ప్రయోజనాలు చేకూరతాయని ఆయన అభిప్రాయపడ్డారు. మంత్రులు,ఎమ్మెల్యేలతో కలిసి పనిచేసే వారిని ఎన్నుకోవాలని, కిరికిరిగాళ్లను వద్దని కోరారు. పంచాయతీ ఎన్నికలు పేరుకే రాజకీయేతరంగా జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి తన స్పీచ్‌లలో ఎవరినైనా రాజకీయాలకు అతీతంగా మంచివారిని ఎన్నుకోండని చెబితే బాగుండేది. అలా కాకుండా తమ మద్దతుదారులనే ఎన్నుకోవాలని పరోక్షంగా ప్రచారం చేసినట్లు అనిపిస్తుంది.


వేరే పార్టీ మద్దతుదారులను సర్పంచ్‌లుగా ఎన్నుకుంటే నిధులు రావని, పనులు జరగవని బెదిరిస్తున్నట్లు అనిపించదూ! వర్తమాన రాజకీయాలలో దాదాపు అన్ని రాజకీయ పార్టీలు ఇదే ధోరణితో ఉంటున్నాయన్నది కూడా వాస్తవమే. రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీవారినే ఉప ఎన్నికలలో, జెడ్పీ, మండల, పంచాయతీ ఎన్నికలలో గెలించాలని, లేకుంటే అభివృద్ధి ఆగిపోతుందని ప్రచారం చేయడం ప్రజాస్వామ్యంలో ఒక బలహీనతగా కనిపిస్తుంది. ఇదే ధోరణితో కేంద్రంలో అధికారంలో ఉన్న రాజకీయ పార్టీ రాష్ట్రాలలో ప్రచారం చేస్తుంటుంది. ఈ నేపథ్యంలో పంచాయతీ ఎన్నికల పర్వంలో డబ్బు, మద్యం,తదితర ప్రలోభాలు యథావిధిగా సాగుతున్నాయని వార్తలు వస్తున్నాయి.

వేలంపాటల ద్వారా సర్పంచులను ఎన్నుకుంటున్నారు.

కొన్ని గ్రామాలలో మాత్రం పార్టీలకు అతీతంగా ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్నారు. కాని అత్యధిక పంచాయతీలలో ఈ పరిస్థితి లేదు. అదేమీ తప్పు కాదు. పంచాయతీలలో ఎన్నికులు జరగవచ్చు.

కాని అవి పద్ధతిగా జరిగితే ప్రజాస్వామ్యం బలపడుతుంది. మంత్రులు,ఎమ్మెల్యేల సొంత గ్రామాలలో ఎలాగైనా ఏకగ్రీవాలు జరగాలని తంటాలు పడుతున్నారట. కొన్ని పంచాయతీలలో అభ్యర్థులు ఇస్తున్న హామీలు రాష్ట్ర స్థాయి పార్టీలు, నేతలను ఆదర్శంగా తీసుకున్నట్లు అనిపిస్తుంది. గత అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ నేతలు కొందరు హామీలపై బాండ్లు రాసిచ్చారు. దానిని ఆయా చోట్ల పంచాయతీ సర్పంచ్ అభ్యర్థులు పాటిస్తున్నారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలంలోని ఒక గ్రామంలో ఒక సర్పంచ్ అభ్యర్థి ఇంటి పన్ను మాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో మినరల్ వాటర్ సదుపాయం కల్పిస్తామని, ఎవరైనా చనిపోతే ఆ కుటుంబానికి పదివేలు, పెళ్లి జరిగితే ఆడబిడ్డకు ఐదువేల రూపాయలు ఇస్తామని చెబుతున్నారట. కొన్ని గ్రామాలలో అసెంబ్లీ ఎన్నికలను మించి ఖర్చు చేస్తున్నారట. రియల్ ఎస్టేట్ వ్యాపారం బాగా సాగే సంగారెడ్డి, పటాన్ చెరు నియోజకవర్గాలలో ఎన్నికలు జాతరను తలపిస్తున్నాయి. చిన్న పంచాయతీలలో పది నుంచి ఇరవై లక్షల వరకు ఖర్చు చేయడానికి సిద్దమవుతున్నారు. కాస్త పెద్ద పంచాయతీలలో కోట్లు వ్యయం చేయడానికి వెనుకాడబోమని చెబుతున్నట్లు అక్కడక్కడా వినిపిస్తుంది. ఏకగ్రీవంగా ఎన్నికయ్యేందుకు పోటీదారులకు రూ.15 నుంచి రూ.35 లక్షల వరకు ఇవ్వడానికి సిద్ధమవుతున్నారని సమాచారం. రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం కొత్తపేట గ్రామంలో సర్పంచ్‌గా తనను గెలిపిస్తే ప్రతి ఇంటికి ఐదు లక్షల బీమా సదుపాయం కల్పిస్తానని ఒక అభ్యర్థి హామీ ఇస్తూ ప్రచారం చేస్తున్నారు. ఆ గ్రామంలో 700 ఇళ్లు ఉన్నాయి. ఇందుకోసం ఏడాదికి సుమారు ఎనిమిది లక్షల చొప్పున ఐదేళ్లకు నలభై లక్షలు వ్యయం చేస్తానని హామీ ఇచ్చారన్నమాట. ఆడబిడ్డ పుడితే బంగారు తల్లి పథకం పేరుతో రూ.ఐదు వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తానని, ఆడపిల్లలకు మెట్టెలు, పెళ్లికొడుక్కి రూ.5116 ఇస్తామంటున్నారట. ఇల్లు కట్టుకుంటే స్లాబ్ వేసుకున్నప్పుడు రూ.21 వేలు ఇస్తామని కూడా హామీ ఇస్తున్నారట. మరి కొన్ని గ్రామాలలో విద్యార్థులకు ఉచిత బ్యాగ్‌లు, బూట్లు, ఉన్నత విద్యకు ఆర్థికసాయం, సీసీ కెమెరాలు మొదలైనవి సమకూర్చుతామని హామీ ఇస్తున్నారు. గద్వాల జిల్లా సల్కావరం గ్రామంలో ఒక అభ్యర్థి 22 హామీలతో బాండ్ పేపర్ పై రాసిచ్చారట. ఇవన్నీ అచ్చంగా అసెంబ్లీ ఎన్నికలలో మాదిరిగా అసాధ్యమైన హామీల్లానే ఉన్నాయి. ఇక ఒకే కుటుంబానికి చెందిన వారు పోటీ పడుతున్న ఘటనలు జరిగాయి. బలవంతంగా విత్ డ్రా చేసుకోమంటున్నారని ఒక అభ్యర్థి ఆత్మహత్యకు పాల్పడ్డారట. నిధులు అంతంత మాత్రంగా ఉండే పంచాయతీ ఎన్నికలలో ఈ పరిస్థితి ఎందుకు ఉందో ఊహించుకోవచ్చు. శాసనసభ, లోక్ సభ ఎన్నికలలో ఎలాగైతే రాజకీయ పార్టీలు అడ్డగోలుగా ఖర్చు చేస్తున్నాయో,అదే రీతిలో పంచాయతీ ఎన్నికలు సాగుతున్నాయని అనుకోవాలి. అధికారంలోకి వచ్చాక, హామీలు అమలు చేసినా, చేయకపోయినా ఏమీ కాదులే అని రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నేతలు వ్యవహరిస్తుంటారు. దానినే గ్రామాలలో అభ్యర్థులు క్లూగా తీసుకుంటున్నట్లు అనిపిస్తుంది. ఈ నేపథ్యంలో "హాఫ్‌కు", "ఫుల్‌కు" ఓటు వేయవద్దని రేవంత్ రెడ్డి చెబితే ఎవరైనా వింటారా? సుద్దులు చెప్పడం కాకుండా నిబంధనలను పటిష్టంగా అమలు చేసినప్పుడు, రాష్ట్ర స్థాయి నేతలు ముందుగా తాము పాటించి చూపితే ప్రజలలో విశ్వసనీయత వస్తుంది .లేకపోతే అవన్నీ ఊకదంపుడు ఉపన్యాసాలుగానే మిగిలిపోతాయి అని చెప్పక తప్పదు.

## ఓటింగ్ కోసం 18 రకాల గుర్తింపు కార్డులలో ఏదైనా చూపవచ్చు



నారాయణపేట జిల్లా ప్రతినిధి డిసెంబర్ 10 (విజన్ ఆంధ్ర): ఈ నెల 11, 14, 17 తేదీలలో మూడు విడత ల్లో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల సందరరేగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు వెళ్ళేటపుడు 18 రకాల గుర్తింపు కార్డులలో ఏదైనా ఒక దానిని తమ వెంట తీసుకెళ్లాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

1) ఓటర్ కార్డు
2) ఆధార్ కార్డు
3) జాతీయ గ్రామీణ ఉపాధి హామీ జాబ్ కార్డు
4) ఫోటోతో కూడిన పోస్ట్ ఆఫీస్/ బ్యాంక్ పాస్ బుక్
5) కార్మిక మంత్రిత్వ శాఖ ఇచ్చిన హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్ కార్డు
6) డ్రైవింగ్ లైసెన్స్
7) పాన్ కార్డ్
8) ఫోటోతో కూడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ కుల ధృవీకరణ పత్రాలు
9) ఇండియన్ పాస్పోర్ట్
10) ఫోటోతో కూడిన పెన్షన్ డాక్యుమెంట్
11) కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలచే జారీ చేయబడిన ఉద్యోగ గుర్తింపు కార్డు
12) ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ఇచ్చిన అధికారిక గుర్తింపు కార్డు
13) దివ్యాంగుల గుర్తింపు కార్డు
14) పట్టాదార్ పాస్ పుస్తకం
15) రేషన్ కార్డు
16) ఫోటోతో కూడిన ఆయుధ లైసెన్స్ పత్రం
17) ఫ్రీడం ఫైటర్ ఐ.డీ కార్డ్
18) ఆర్జీఐ ద్వారా జారీ చేయబడిన ఎన్.పీ.ఆర్ స్మార్ట్ కార్డు

పై వాటిలో ఏదైనా ఒక దానిని చూపించి ఓటు వేయవచ్చని కలెక్టర్ సూచించారు. ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.


# కలెక్టరేట్లలో తెలంగాణ తల్లి విగ్రహాలు

**గ్లోబల్ సమ్మిట్ వేదికగా ఆవిష్కరించిన సీఎం**

**ఏటా డిసెంబర్ 9న తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం**

**సోనియాగాంధీ జన్మదిన ఉత్సవాలు కూడా..**

హైదరాబాద్ బ్యూరో చీఫ్, డిసెంబర్ 10 (విజన్ ఆంధ్ర ): ఫ్యూచర్ సిటీలో జరుగుతున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 వేదిక నుంచి రాష్ట్రంలోని 33 జిల్లా కలెక్టరేట్లలో తెలంగాణ తల్లి విగ్రహాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం వర్చువల్‌గా ఆవిష్కరించారు. దేశ, విదేశీ ప్రముఖులు, వ్యాపారవేత్తలు, మంత్రివర్గ సహచరుల సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందరరేగా ముఖ్యమంత్రి మాట్లాడారు. 'తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభిస్తున్నట్లు 2009 డిసెంబర్ 9వ తేదీన నాటి యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ ఆదేశాల మేరకు అప్పటి హెూం మంత్రి చిదంబరం ప్రకటించారు. ఎన్ని అడ్డంకులు, ఆటంకాలు ఎదురైనా సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారు. ఆమె జన్మదినం డిసెంబర్ 9. ఈ రోజున రాష్ట్ర ఏర్పాటు ప్రకటన తెలంగాణ ప్రజలకు సంతోషాన్ని ఇచ్చింది. వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టింది. అందుకే ప్రతి ఏడాది ఈ రోజున తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం జరుపుకోవాలని నిర్ణయించుకున్నాం. తెలంగాణ రాష్ట్రం ఉన్నంత కాలం తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం, తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చిన సోనియాగాంధీ జన్మదిన ఉత్సవాలను జరుపుకుంటాం..'అని సీఎం స్పష్టం చేశారు.





సోనియా ఆరు దశాబ్దాల ఆకాంక్ష నెరవేర్చారు

'ఆరు దశాబ్దాల ఆకాంక్ష, 4 కోట్ల మంది ప్రజల కోరి కను కరీంనగర్‌లో జరిగిన సమావేశంలో సోనియాగాంధీ ప్రకటించడమే కాకుండా రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారు. గత ఏడాది ప్రజా పాలనకు సంకేతంగా ఉన్న సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించాం. ఇప్పుడు జిల్లాల్లో పాలనా కేంద్రాలైన కలెక్టర్ కార్యాలయాల్లో విగ్రహాలను ఆవిష్కరించడం సంతోషకరం..'అని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, సీఎస్ రామకృషా?రావు ఉన్నతాధికారులు, జిల్లాల నుంచి కలెక్టర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# జాతి, మత, లింగ, రాజకీయ కారణాలతో ఎవరినీ ఇబ్బంది పెట్టకూడదు


## మానవ హక్కులను పరిరక్షిద్దాం, వివక్షలేని సమాజాన్ని నిర్మిద్దాం-జూనియర్ సివిల్ జడ్జి



నారాయణపేట జిల్లా ప్రతినిధి డిసెంబర్ 10 (విజన్ ఆంధ్ర): వివక్ష లేని సమాజాన్ని నిర్మిద్దామని నారాయణపేట ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కమ్ జ్యూడిషల్ మేజిస్ట్రేట్ అఫ్ ఫస్ట్ క్లాస్ నారాయణపేట బి. సాయి మనోజ్ అన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లా న్యాయసేవ సంస్థ లీగల్ సర్వీసెస్ ఆథారిటీ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా నారాయణపేట టౌన్ మార్కండేయ దేవాలయంలో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కమ్ జ్యూడిషల్ మేజిస్ట్రేట్ అఫ్ ఫస్ట్ క్లాస్ నారాయణపేట బి. సాయి మనోజ్ గారి ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి గారు మాట్లాడుతూ అంతర్జాతీయ మానవ హక్కులు అనేవి ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కులకు ఉద్దేశించినవి. ప్రపంచంలో పౌర, రాజకీయ హక్కులకు సంబంధించి అంతర్జాతీయ ఒడంబడికలపై అవగాహన కల్పించడానికి ఏటా డిసెంబర్ 10న 'అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం' జరుపుకుంటున్నాం. ప్రతి సంవత్సరం ఓ అంశాన్ని ప్రాతిపదికగా తీసుకుని మానవహక్కుల దినోత్సవాన్ని ఐరాస నిర్వహిస్తుంది. మానవహక్కుల ప్రధాన లక్ష్యాలు జాతి, వర, లింగ, కుల, మత, రాజకీయ, ఇతర కారణాలతో వివక్ష లేని జీవనం గడపాలి. చిత్రహింసలు, క్రూరత్వం నుంచి బయట పడడం. వెట్టిచాకిరీ, బానిసత్వం వంటి దురాచారాల నుంచి రక్షణ పొందడం, నిర్బంధం లేని జీవన విధానం, స్వేచ్ఛగా స్వదేశంలో, విదేశాలలో పర్యటించే హక్కు, సురక్షిత ప్రాంతాలలో జీవించే హక్కు, బలవంతపు పనుల నుండి విముక్తి లభించాలి, విద్యా హక్కు ద్వారా పిల్లలకు స్వేఛ్ఛ, మానవ హక్కుల పరిరక్షణకు, హక్కుల అణచివేత లేని సమాజ నిర్మాణం కోసం నిరంతరం సాగాల్సిన కృషికి గుర్తుగా ఈరోజును మానవ హక్కుల దినోత్సవంగా ప్రపంచమంతా పాటిస్తోంది. మానవ హక్కుల పట్ల నిర్లక్ష్యం, తిరస్కారాలు క్రూరమైన దుష్కృత్యాలకు కారణమయ్యాయి. ఇవి మానవాళి అంతరాత్మకు గాయం చేశాయి. భావప్రకటనా స్వేఛ్ఛ, విశ్వాసాల విషయంలో స్వేఛ్ఛ, భయం నుంచి, లేమి నుంచి విముక్తిని పొందే స్వేఛ్ఛ ఉన్న ప్రపంచాన్ని ఆవిష్కరించుకోవడం ప్రజలందరి అత్యున్నత ఆకాంక్ష. నిరంకుశత్వానికి, అణచివేతకు వ్యతిరేకంగా మనుషులు చిట్టచివరి మార్గంగా తిరుగుబాటును ఆశ్రయించకుండా ఉండాలంటే మానవ హక్కులను చట్టబద్ధ పాలన రక్షించాలి. చట్టాలపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. రాజ్యాంగ రచన..భారత ప్రజలకు ఉపయోగం విద్యార్థులకు తెలియచేసారు. బానిసలుగా మారడం, బాలల హక్కుల దుర్వినియోగం, పిల్లల అక్రమ రావణాలు, ఆరోగ్యం, విద్యకు సంబంధించి అవగాహన కల్పించారు. ట్రాఫికింగ్ మరియు కమర్షియల్ లైంగిక దోపిడీ బాధితులు, అనైతిక ట్రాఫిక్ (నివారణ) చట్టం, లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం (POCSO) సామాజిక రక్షణ బాల కార్మికుల నుంచి పిల్లలను రక్షించడానికి సామాజిక రక్షణ వ్యవస్థలు అంశాల పై అవగాహన కల్పించారు. తమ పిల్లలకు చిన్న వయస్సులో పెళ్లిళ్లు చేస్తే పెద్దవారిదే తప్పుగా తల్లితండ్రుల నిర్వహణ, స్త్రీ మరియు పురుష ఆధిక్యత, వరకట్న వేదింపులు, సఖి సెంటర్, వోల్డీగే హెూమ్ గురించి సీనియర్ సిటిజన్స్ చట్టాలు వయోవృద్ధులకు న్యాయ సేవలు పథకాలు అనుగుణంగా సామాన్య ప్రజలు ఏవిదంగా న్యాయం పొందాలి పలు చట్టాల వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కే.సురేష్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కే.లక్ష్మిపతి గౌడ్ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ మరియు పారాలీగల్ వాలంటీర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# నారాయణపూర్ గ్రామంలో ప్రచార హెూరు

- ఉంగరం గుర్తుకు ఓటు వేయండి
- గ్రామ సమస్యలను పరిష్కరించడానికి వస్తున్నా
- పదవి ఆకాంక్షతో రావడం లేదు
- మన ఊరి ప్రగతి కోసం వస్తున్నాను
- నారాయణపూర్ గ్రామ సర్పంచ్ అభ్యర్థి కావలి జ్యోతి నరేష్



వికారాబాద్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 10 ( విజన్ ఆంధ్ర ) : నారాయణపూర్ గ్రామ ప్రగతి కోసం ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని సర్పంచ్ అభ్యర్థి కావలి జ్యోతి నరేష్ అన్నారు. అధికారం చలాయించడం ఏమాత్రం నా ఉద్దేశం కాదు. మన ఊరి అభివృద్ధి కోసం వస్తున్నానని ఆమె తెలిపారు. బుధవారం వికారాబాద్ మండల పరిధిలోగల నారాయణపూర్ గ్రామంలో గడపగడపకు తిరుగుతూ ఉంగరం గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆమె ఓటరు దేవుళ్లను వేడుకున్నారు. ఈ సందరరేగా ఆమె విజన్ ఆంధ్ర జిల్లా ప్రతినిధి మాచన్నగారి గైబులు ముదిరాజ్ తో మాట్లాడారు. గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి మండల పరిధిలోనే ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తానని ఆమె ధీమా వ్యక్తం చేశారు. గ్రామంలో సిసి రోడ్లు అండర్ డ్రైనేజీలు ఓపెన్ సైడ్ డ్రైనేజీలు నిర్మించేందుకు కృషి చేస్తానని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రణాళికాబద్ధంగా గ్రామాన్ని అభివృద్ధి పరచడానికి రాత్రింబగళ్లు కృషి చేస్తానని తెలిపారు. నేను మీ కుటుంబ సభ్యురాలిగా మసులుకుంటూ మీ ఆప్యాయత అనురాగాలు పొందుతానని విశ్వాసం వ్యక్తం చేశారు.

# మహబూబాబాద్ జిల్లాలో మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ సామాగ్రి పంపిణీ ప్రారంభం

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 10 (విజన్ ఆంధ్ర): గ్రామపంచాయతీ ఎన్నికలు – 2025 తొలి విడత పోలింగ్ నిర్వహణ కోసం మహబూబాబాద్ జిల్లాలోని ఐదు మండలాలకు ఎన్నికల సామాగ్రి పంపిణీ ప్రక్రియ శనివారం ఉదయం ప్రారంభమైంది. ఇనుగుర్తి, కేసముద్రం, గూడూరు, మహబూబాబాద్, నెల్లికుదురు మండలాల ఎన్నికల బృందాలకు బ్యాలెట్ బాక్సులు సహా అవసరమైన మొత్తం సామాగ్రిని పంపిణీ చేశారు. జిల్లా కేంద్రం మహబూబాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పంపిణీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అండ్ డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ పరిశీలించారు. పోలింగ్ సిబ్బందితో మాట్లాడి, నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా చూసుకోవాలని సూచించారు. నెల్లికుదురు మండల కేంద్రంలో సాధారణ పరిశీలకులు మధుకర్ బాబు, రెవెన్యూ డివిజనల్ అధికారి గణేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఇదే విధంగా ఇనుగుర్తి, నెల్లికుదురు మండలాల్లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో తనిఖీ చేపట్టారు.

# డిస్ట్రిబ్యూషన్/రిసెప్షన్ సెంటర్లను సందర్శించిన కలెక్టర్

## పోలింగ్ ప్రక్రియను నిర్ణీత సమయంలో ప్రారంభించాలి మధ్యాహ్నం 2 గంటలకు ఓట్ల లెక్కింపు చేపట్టాలి



నారాయణపేట జిల్లా ప్రతినిధి డిసెంబర్ 10 (విజన్ ఆంధ్ర): నారాయణపేట జిల్లాలో గ్రామ పంచాయతీ మొదటి విడత ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ నిమిత్తం ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను బుధవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ బుధవారం సందర్శించారు. ముందుగా మద్దూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆవరణలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను సందర్శించారు. ఈ సందరరేగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల11జిల్లాలోని మద్దూరు, కొత్తపల్లి, గుండుమాల్, కోస్గి మండలాల పరిధిలోని గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ జరుగుతుందని, పోలింగ్ అవసరమైన సామాగ్రిని డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో తీసుకున్న సిబ్బంది ఒకటికి రెండుసార్లు సామాగ్రిని సరి చూసుకోవాలని సూచించారు. బ్యాలెట్ పత్రాలు, బాక్సులు చెక్ చేసి ప్యాక్ చేసుకోవాలని, పోటీ చేసే అభ్యర్థుల కు సమానంగా గుర్తులు ఉన్నాయా లేదా నిశితంగా పరిశీలించాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఓటింగ్ నిర్వహణ ఏర్పాట్లను మరోసారి నిర్ధారణ చేసుకోవాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే ప్రతి అధికారి జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఎన్నికల సిబ్బందికి అల్పాహారం, మధ్యాహ్న భోజనం వసతి కల్పించాలని అధికారులకు సూచించారు. అలాగే పోలింగ్ కేంద్రాలలో విద్యుత్ అంతరాయం లేకుండా 24 గంటల సరఫరా ఉండేలా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో ఏమైనా లోపాలు కనిపిస్తే వెంటనే తెలియజేయాలని, ఎంట్రీ, ఎగ్జిట్ , తాగునీరు, మరుగు దొడ్ల సౌకర్యం ఉండాలన్నారు. జిల్లాలో మూడు విడతలలో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో మొదటి విడత లో జరిగే ఎన్నికలు ప్రశాంతంగా సజావుగా జరిగితే మిగతా రెండు విడతలు కూడా అదే విధంగా జరుగుతాయని ఆమె తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ ఉంటుందన్నారు. అనంతరం కలెక్టర్ కోస్గి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల లో గల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించి ఎన్నికల సామాగ్రి పంపిణీ తీరుతెన్నులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించి సంత ృప్తి వ్యక్తం చేశారు. అక్కడ పోలింగ్ సిబ్బందికి తాగునీటి వసతి, వైద్య శిబిరం, అల్పాహారం, భోజన వసతి, షామియానాలు ఇతర అన్ని వసతులు ఏర్పాటు చేయగా, పీ.ఓ, ఓ.పీ.ఓలతో కూడిన బృందాలన్నీ హాజరయ్యారా లేదా అని కలెక్టర్ ఆరా తీశారు. ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా సిబ్బందికి పోలింగ్ సామాగ్రిని పక్కాగా అందించాలని, చెక్ లిస్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందినదా, లేదా అన్నది జాగ్రత్తగా పరిశీలించుకోవాలని కలెక్టర్ సూచించారు. పోలింగ్ సిబ్బందితో పాటు ఓటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించే పోలీసు సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వాహనాలను పరిశీలించి, సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ సామాగ్రి, ప్రత్యేకించి బ్యాలెట్ పేపర్లు తరలించే సమయంలో తప్పనిసరిగా సాయుధ పోలీసులతో కూడిన బందోబస్తు ఉండాలని అన్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే తమ దృష్టికి తేవాలని ఆర్ఓలకు సూచించారు. పోలింగ్ సామాగ్రిని సర్దుకుని కేంద్రంలో భోజనం చేస్తున్న పీవోలు, ఓపివోల వద్దకు వెళ్ళిన కలెక్టర్ భోజనం చేశాక మరోసారి పోలింగ్ సామాగ్రినీ సరిచూసుకోవాలని తెలిపారు. భోజనం బాగుందా లేదా అని వారిని అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ అధికారులు, సిబ్బందికి ఆమె బెస్ట్ ఆఫ్ లక్ చెప్పారు. జిల్లా అదనపు కలెక్టర్లు వెంట అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, శ్రీను కొత్తపల్లి, గుండుమల్ మండల కేంద్రాలలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను సందర్శించి ఎన్నికల సామాగ్రి పంపిణీ తీరు తెన్నులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్ డీ సీ రాజేందర్ గౌడ్, డిఆర్డిఓ మొగులప్ప, ఆయా మండల ల తహసిల్దారులు, ఎంపీడీవోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# పోస్టల్ బ్యాలెట్ కోసం ఫెసిలిటేషన్ సెంటర్

## అదనపు కలెక్టర్ సుచిత్ర గంగ్వార్

నారాయణపేట జిల్లా ప్రతినిధి డిసెంబర్ 10(విజన్ ఆంధ్ర) : ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు అందరు పి ఓ, ఓ పి ఓ లు జోనల్ ఆఫీసర్లు, ఎఫ్ ఎస్ టి, ఎస్ ఎస్ టి రూట్ ఆఫీసర్లు మొదలైనవారు – తమ ఓటును వినియోగించు కోవడానికి ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఉపయోగించవచ్చనీ అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) సంచిత్ గంగ్వార్ తెలిపారు. ఫేజ్–3 లో డ్యూటీ చేసే మరియు ఫేజ్–3 లోనీలి మండలాల్లో ఓటు వేసే ఉద్యోగులకు మాత్రమే ఇది వర్తిస్తుందని తెలిపారు. ఈ క్రింది వివరాలు గమనించాల్సింది గా తెలియ ఫేజ్ 3 పోల్ రోజు, అంటే 17.12.2025 సమయంలో ఎన్నికల విధి మక్తల్ ఓట్కూర్ నర్వా కృష్ణ మాగనూరు – ఈ 5 మండలాలు ఓటరుగా నమోదు చేసుకున్నారు.

వివరాలు: – మండలాలు: కృష్ణ మాగనూరు నర్వ మక్తల్ ఊట్కూర్

– తేదీ: 12.12.2025 & 13.12.2025

– స్థలం: సంబంధిత ఎంపిడిఓ కార్యాలయాలు

తప్పనిసరి తీసుకురావాలిసిన పత్రాలు

– నింప బడిన ఫారం XIV

– ఎన్నికల విధి నియామక లేఖ

– ఎపిక్ కార్డ్ (ఓటరు ఐడి)

– ప్రభుత్వ ఐడీ

పోస్టల్ బ్యాలెట్ ఉపయోగించిన తర్వాత, సాధారణ పోల్ రోజున, అంటే 17.12.2025న ఓటరు ఓటు వేయడానికి అనుమతించబడరు.

మరిన్ని వివరాల కోసం: మీ ఎంపీడీవో లేదా పోస్టల్ బ్యాలెట్ల కోసం నోడల్ అధికారిని సంప్రదించండి,నోడల్ అధికారి వివరాలను శ్జాన్ సుధాకర్, జిల్లా వ్యవసాయ కార్యాలయం (630361727 సంప్రదించాలని తెలిపారు.

# భైంసాలో బుధవారం- ప్రజల ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్

**ప్రతీ ఫిర్యాదు పై తక్షణ స్పందన**

**బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు ఆదేశం**




నిర్మల్ డిసెంబర్ 10 (విజన్ ఆంధ్ర జిల్లా ప్రతినిధి): నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్, బుధవారం భైంసా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందరరేగా భైంసా సబ్‌డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన అర్జిదారుల ఫిర్యాదులను స్వీకరించి, ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించారు. ఫిర్యాదు దారుల ఎదుటే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, బాధితులకు చట్టపరంగా అవసరమైన సహాయాన్ని వెంటనే అందించాలని సూచించారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

కుటుంబ వివాదాల పరిష్కారంలో 'షీ టీం' పాత్ర:

ఈ కార్యక్రమంలో వచ్చిన కొన్ని కుటుంబ సమస్యలపై షీ టీం సిబ్బంది ఇరు వర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహించారు. కౌన్సిలింగ్ ద్వారా కుటుంబాలు తిరిగి కలుసుకోవడం జరిగింది. ప్రజలు "నిర్మల్ వరకు రావడం కష్టంగా ఉండగా, భైంసాలోనే కౌన్సిలింగ్ కల్పించడం పై ఎస్పీ గారు చూపిన ఆలోచనను బాధితులు సంత ృప్తిని వ్యక్తం చేశారు.

పెండింగ్ ఫిర్యాదులపై సమీక్ష:ఈ సందరరేగా గతంలో గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కార స్థితి, ఇంకా పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని పెండింగ్ లో ఉన్న వాటిని వేగంగా పరిష్కరించాలన్నారు.

# పాలకు రాలిగా కాదు మీ ఇంటి సేవకురాలిగా వస్తున్న కత్తెర గుర్తుకు ఓటు వేయండి నన్ను ఆశీర్వాదించండి

## సర్పంచ్ అభ్యర్థి మామిడి లక్షమమ్మ యాదగిరి




నల్గొండ జిల్లా బ్యూరో డిసెంబర్ 10(విజన్ ఆంధ్ర): పదవీ ఆకాంక్ష నాకు లేదని ఎల్లమ్మ గూడెం గ్రామ సర్పంచ్ అభ్యర్థి మామిడి లక్షమమ్మ యాదగిరి అన్నారు. మన ఊరు అభివృద్ధి కోసం ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని ఆమె స్పష్టం చేశారు.బుధవారం తిప్పర్తి మండల పరిధిలోగల ఎల్లమ్మ గూడెం గ్రామానికి చెందిన సర్పంచ్ అభ్యర్థి మామిడి లక్షమమ్మ యాదగిరి విజన్ ఆంధ్ర జిల్లా ప్రతినిధి మంగదుడ్ల అనిల్ యాదవ్ తో మాట్లాడారు. గడపగడపకు తిరుగుతూ కత్తెర గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటరు దేవుళ్లను కోరారు. పాలకురాలిగా కాకుండా మీ ఇంటి సేవకురాలిగా సేవ చేస్తానని చెప్పారు. గెలిస్తే సర్పంచ్ అవుతానని అన్నారు. కానీ ఎప్పటికీ మీ మనిషిగానే మసులు కుంటానని విశ్వాసం వ్యక్తం చేశారు. నా బలం బలగం మీ నమ్మకమేనని ధీమా వ్యక్తం చేశారు. నా లక్ష్యం మాత్రం ఎల్లమ్మ గూడెం గ్రామాన్ని అన్ని రంగాలలో అభివ ృద్ధి పరచడమే ప్రథమ లక్ష్యమని తెలిపారు. అధికారం చలాయించడానికి నేను సర్పంచ్ అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేయడం లేదని ఆమె అన్నారు. అప్యాయంగా మిమ్మల్ని మీతో పాటు మీ కుటుంబ సభ్యులను ఆదుకోవడమే లక్ష్యంగా మీ ముందుకు వస్తున్నానని ఆమె స్పష్టం చేసారు. గ్రామ ప్రజలందరూ కత్తెర గుర్తు పై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపిచలని గ్రామ ప్రజలను కోరారు.

# పాలకురాలిగా కాదు మీ ఇంటి సేవకురాలిగా వస్తున్న బ్యాట్ గుర్తుకు ఓటు వేయండి నన్ను ఆశీర్వాదించి భారీ మెజారిటీ తో గెలిపించండి ఉట్కూరి వాణి సందీప్ రెడ్డి




నల్గొండ జిల్లా బ్యూరో డిసెంబర్ 8(విజన్ ఆంధ్ర) : కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఊట్కూరి వాణి సందీప్ రెడ్డి బ్యాట్ గుర్తుకు ఓటేసి ఒకసారి అవకాశం ఇస్తే గ్రామాన్ని అన్ని విధాలుగా అభివ ృద్ధి చేసి చూపిస్తానని ఊట్కూరి వాణి సందీప్ రెడ్డి గ్రామ ప్రజలను కోరారు. శనివారం తిప్పర్తి మండలంలోని ఎల్లమ్మగూడెంలో విజన్ ఆంధ్ర బ్యూరోతో మాట్లడుతూ గత కొన్ని సంవత్సరాల నుండి గ్రామంలో సొంత నిధులతో అభివ ృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని తెలిపారు.గ్రామంలో చెరువు కట్ట వద్ద మంచినీటి ట్యాంకు,గత రెండు సంవత్సరాల నుండి స్ట్రీట్ లైట్లు, రెండు లక్షల నిధులతో డ్రైనేజీ, 65 కోట్లతో మామిడాల ఎక్స్ రోడ్డు నుండి ఎల్లమ్మ గూడెం మీదుగా మాడుగులపల్లి వరకు డబల్ రోడ్డు మంజూరు.రెండున్నర కోట్లతో ఎల్లమ్మ గూడెం నుండి ఆరెగూడెం వరకు రోడ్డు, ఎల్లమ్మ గూడెం,వడ్డే వారి గూడెం వరకు 20 లక్షల తో సిసి రోడ్డు, గ్రామంలో 1.4 కిలోమీటర్ల 33 వెడల్పులో సీసీ రోడ్డు, గ్రామంలో మూడు ఫీట్ల వెడల్పు తో డ్రైనేజీ నిర్మాణం, చెరువు కట్ట వద్ద రిటర్న్ వాలు, 20 లక్షలతో ఇంటర్నల్ సీసీలు, 35 లక్షలతో గ్రామపంచాయతీ భవన నిర్మాణం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో ఎంతో అభివ ృద్ధి చేస్తున్నానని పేర్కొన్నారు. గ్రామంలోని ఆలయంలో ప్రతిరోజు పూజలు నిర్వహిం చడానికి నిర్వహణ ఖర్చులు ప్రతినెల 14 వేల రూపాయల తో 2018 నుండి ఇవ్వడం జరుగుతుం దని తెలిపారు. కొంతమంది యూట్యూబ్ ఛానల్ వాళ్ళు నిజా నిజాలు తెలుసుకోకుండా అన్న దమ్ము లా కలిసివున్న గ్రామ ప్రజల మధ్య చిచ్చు తెడుతున్నారు అని తెలిపారు.గ్రామ ప్రజల సహకారం సంపూర?ంగా ఉందని స్వచ్ఛందంగా ప్రచారం చేస్తూ గెలుపు కోసం కృషి చేస్తున్నారని అన్నారు.అరాచక వాదులకు ఈనెల 11న గ్రామ ప్రజలు భారీ మెజారిటి ఓటుతో సర్పంచ్ గా గెలిపించి వారికి తగిన బుద్ధి చెప్తారని అన్నారు.ఎల్లమ్మ గూడెం గ్రామ ప్రజలకు నిజా నిజాలు అన్ని తెలుసు గ్రామ ప్రజలందరూ ప్రతి ఒక్కరు బ్యాట్ గుర్తు పై ఓటు వేసి భారీ మెజారిటీ తో ఊట్కూరి వాణి సందీప్ రెడ్డిని గెలిపించి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారికి అండగా వుంటారు అని అన్నారు. ఓటున్న ప్రతి ఒక్కరూ బ్యాట్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని గ్రామ ప్రజలను పేరు పేరున కోరారు.

## ఎన్నికల పంపిణీ కేంద్రాన్ని సంయుక్తంగా పరిశీలించిన జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్, జిల్లా కలెక్టర్ శ్రీమతి అభిలాష అభినవ్



నిర్మల్ డిసెంబర్ 10( విజన్ ఆంధ్ర జిల్లా ప్రతినిధి ): రేపు జరగనున్న తొలి విడత పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో, ఖానాపూర్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల (ZPHS Girls School) వద్ద ఏర్పాటు చేసిన ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్, జిల్లా కలెక్టర్ శ్రీమతి అభిలాష అభినవ్ సంయుక్తంగా పరిశీలించారు. ఈ సందరరేగా అధికారులు, పోలింగ్ సిబ్బందికి అవసరమైన సౌకర్యాలు, భద్రతా చర్యలు, ఎన్నికల సామాగ్రి పంపిణీకి సంబంధించి చేసిన ఏర్పాట్లను సమీక్షించారు. అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి, ఎన్నికల ప్రక్రియ శాంతియుతంగా, పారదర్శకంగా, ఎలాంటి అంతరాయం లేకుండా సాగేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ, కలెక్టర్ సూచించారు. ఎన్నికల రోజు ఏవైనా అత్యవసర పరిస్థితులు తలెత్తిన వెంటనే స్పందించేలా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.

# పాలకురాలిగా కాదు మీ ఇంటి సేవకురాలిగా వస్తా

- బ్యాట్ గుర్తుకు మీ ఓటు వేయండి
- నన్ను ఆశీర్వదించి భారీ మెజారిటీతో గెలిపించండి
- మూలమాడ గ్రామ సర్పంచ్ అభ్యర్థి జిన్నారం విజయం యాదయ్య



వికారాబాద్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 09 (విజన్ఆంధ్ర) : పదవీ ఆకాంక్ష నాకు లేదని మూలమాడ గ్రామ సర్పంచ్ అభ్యర్థి జిన్నారం విజయ యాదయ్య అన్నారు. మన ఊరు అభివృద్ధి కోసం ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని ఆమె స్పష్టం చేశారు. బుధవారం నవాబుపేట్ మండల పరిధిలోగల మూలమాడ గ్రామానికి చెందిన సర్పంచ్ అభ్యర్థి జిన్నారం విజయ యాదయ్య విజన్ ఆంధ్ర జిల్లా ప్రతినిధి మాచన్నగారి గైబులు ముదిరాజ్‌తో మాట్లాడారు. గడపగడపకు తిరుగుతూ బ్యాట్ గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటరు దేవుళ్లను కోరారు. పాలకురాలిగా కాకుండా మీ ఇంటి సేవకురాలిగా సేవ చేస్తానని చెప్పారు. గెలిస్తే సర్పంచ్ అవుతానని అన్నారు. కానీ ఎప్పటికీ మీ మనిషిగానే మసులుకుంటానని విశ్వాసం వ్యక్తం చేశారు. నా బలం బలగం మీ నమ్మకమేనని ధీమా వ్యక్తం చేశారు. నా లక్ష్యం మాత్రం మూలమాడ గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరచడమే ప్రథమ లక్ష్యమని తెలిపారు. అధికారం చలాయించడానికి నేను సర్పంచ్ అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేయడం లేదని ఆమె అన్నారు. ఆప్యాయంగా మిమ్మల్ని మీతో పాటు మీ కుటుంబ సభ్యులను ఆదుకోవడమే లక్ష్యంగా మీ ముందుకు వస్తున్నానని ఆమె స్పష్టం చేశారు.

# పెండ్లిమడుగు గ్రామం అభివృద్ధే లక్ష్యం

- కత్తెర గుర్తుకు ఓటు వేయండి
- పదవి కాంక్షతో రావట్లేదు ఊరి అభివృద్ధి కోసం వస్తున్నా
- అధికారం చలాయించడానికి రావడం లేదు
- మీ ఆత్మీయత అనురాగాలు పొందడానికి వస్తున్నా
- పెండ్లిమడుగు గ్రామ సర్పంచ్ అభ్యర్థి పెద్ద సంతోష బుచ్చయ్య



వికారాబాద్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 09 ( విజన్ ఆంధ్ర ) : పెండ్లిమడుగు గ్రామం అభివృద్ధి లక్ష్యంగా క ృషి చేస్తానని సర్పంచ్ అభ్యర్థి పెద్ద సంతోష బుచ్చయ్య అన్నారు.కత్తెర గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపిం చాలని ఓటర్లను ఆమె వేడుకున్నారు. బుధవారం వికారాబాద్ మండల పరిధిలోగల పెండ్లిమడుగు గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ కత్తెర గుర్తుకు ఓటు వేయాలని ఆమె కోరారు. నేను పదవి కోసం రావడం లేదని మన ఊరి ప్రగతి కోసం వస్తున్నానని ఆమె స్పష్టం చేశారు. అధికారం చెలాయించడానికి నేను రావడం లేదని మీ ఇంటి సేవకురాలిగా వస్తున్నానని ఆమె తెలిపారు. మీ ఆత్మీయత అనురాగాలు పొందడానికి వస్తున్నానని ఆమె చెప్పారు. నన్ను గెలిపిస్తే సర్పంచును అవుతానని ఆమె వెల్లడించారు. కానీ ఎల్లప్పుడూ మీ మనిషిగానే మసులుకుంటానని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని గ్రామాన్ని ప్రణాళిక బద్ధంగా అభివ ృద్ధి చేసేందుకు రాత్రింబగళ్లు కష్టపడతానని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

# పంచాయతీ ఎన్నికల పర్యవేక్షణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్



ఖమ్మం, డిసెంబర్ –10 ( విజన్ ఆంధ్ర ): గ్రామ పంచాయతీ ఎన్నికల పర్యవేక్షణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేస్తున్న వెబ్ క్యాస్టింగ్ మానిటరింగ్ సెల్ ను బుధవారం పరిశీలించారు. ఈ సందరరేగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో మొదటి విడత పంచాయతీ ఎన్నికలు 7 మండలాలకు సంబంధించి జరుగుతున్నాయని, వీటిలో మొత్తం 360 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు,1006 సాధారణ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని అన్నారు. ప్రతి క్రిటికల్ పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరాలు, వెబ్ క్యాస్టింగ్ ఏర్పాటు చేయడం ద్వారా ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు చర్యలు చేపట్టామని తెలిపారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సరళీ పర్యవేక్షించేందుకు మండలానికి ఒకటి చొప్పున కలెక్టరేట్ లో మానిటరింగ్ సెల్ లో 7 స్క్రీన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొదటీ విడత పోలింగ్ ప్రక్రియను కలెక్టర్‌తో పాటు సాధారణ పరిశీలకులు ఇతర ఉన్నతాధికారులు నిశితంగా పరిశీలించి, సజావు ఎన్నికల నిర్వహణకు పర్యవేక్షణ చేస్తారని కలెక్టర్ తెలిపారు. ప్రతి మండలంలోని క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు సరిగా పనిచేస్తున్నాయో లేదో చివరిసారి క్రాస్ చెక్ చేసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మశ్రీ, కలెక్టరేట్ ఏవో కె. శ్రీనివాసరావు, ఈడిఎం దుర్గాప్రసాద్, టెక్నికల్ టీం సభ్యులు హనుమా చారి, సంబంధిత అధికారులు, ఉన్నారు.

# జీహెచ్ఎంసీ వార్డు పునర్విర్వచన ముసాయిదా విడుదల

## బోడుప్పల్ సర్కిల్ కార్యాలయంలో ఫామ్-1 విడుదల చేసిన డీప్యూటి కమిషనర్ ఏ శైలజ





బోడుప్పల్,డిసెంబర్ 10: (విజన్ ఆంధ్ర) : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ వార్డు పరిమితుల పునర్నిర్వచన (డీలిమిటేషన్)కు సంబంధించిన ముసాయిదా ప్రకటనను కమీషనర్ ఆదేశాల మేరకు బుధవారం బోడుప్పల్ సర్కిల్ కార్యాలయంలో ఫామ్–1 ద్వారా ఈ ముసాయిదాను డిప్యూటీ కమీషనర్ ఎ. శైలజా అధికారికంగా విడుదల చేశారు.ఈ సంధరరేగా ఆమే మాట్లాడుతూ కొత్తగా ప్రతిపాదించిన 300 వార్డుల డ్రాఫ్ట్ వివరాలు ప్రజల పరిశీలన కోసం సర్కిల్ కార్యాలయంలో అందుబాటులో ఉంచబడ్డాయని తెలిపారు. ఈ ముసాయిదాపై పౌరుల అభ్యంతరాలు, సూచనలు, అభిప్రాయాలు స్వీకరించేందుకు జీహెచ్ఎంసీ అవకాశం కల్పించిందన్నారు. పౌరులు తమ సూచనలు, అభ్యంతరాలను లిఖితపూర్వకంగా బోడుప్పల్ సర్కిల్ కార్యాలయంలో ఈ నెల 16 లోపు సమర్పించవచ్చని తెలిపారు. ప్రజల విలువైన సూచనలు నగర నిర్వహణలో కీలకపాత్ర పోషిస్తాయని డిప్యూటీ కమీషనర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్అసిస్టెంట్ శ్రీనివాస్ రెడ్డి,వార్డు అధికారులు పాల్గోన్నారు.


## సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రేటర్ కమిషనర్ కు కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి వినతి



అల్వాల్, డిసెంబర్ 10,(విజన్ ఆంధ్ర): అల్వాల్ డివిజన్ పరిధిలోని వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం స్థానిక కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వీ కర్ణన్ ని కలసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..రెండు చెరువులలో పూడిక తీత, మెస్ కాలనీలో బ్యాడ్మింటన్ కోర్ట్ మంజూరు, బండబస్తీ దగ్గర ఓవర్ హెడ్ ట్యాంక్ కూల్చివేత, హరిజనబస్తీ శ్మశానవాటిక, కొన్ని కాలనీలలో కొత్త రోడ్లు వేయడానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

## శ్రీ అయ్యప్ప స్వామి మహా పడిపూజ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ





శేరిలింగంపల్లి డిసెంబర్ 10: ( విజన్ ఆంధ్ర): ఈ సందరరేగా పిఎసి చైర్మన్ మాట్లాడుతూ కర్తవ్యాన్ని ధర్మబద్ధంగా చేయాలని తెలిపేదే అయ్యప్ప తత్వమని, మనలోని దుర్గుణాలను వదిలి సన్మార్గం వైపుగా నడిపేదే అయ్యప్ప దీక్ష అనితెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంచందర్, యశవంత్ ,రాహుల్ మరియు అయ్యప్ప స్వాములు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటింగ్ కోసం 18 రకాల గుర్తింపు కార్డులలో ఏదైనా చూపవచ్చు

### జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్



ములుగు డిసెంబర్ 10 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): ఈ నెల 11, 14, 17 తేదీలలో మూడు విడతల్లో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల సందరరేగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు వెళ్ళేటపుడు 18 రకాల గుర్తింపు కార్డులలో ఏదైనా ఒక దానిని తమ వెంట తీసుకెళ్లాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. బుదవారం ఒక ప్రకటనలో తెలిపారు.

1) ఓటర్ కార్డు
2) ఆధార్ కార్డు
3) జాతీయ గ్రామీణ ఉపాధి హామీ జాబ్ కార్డు
4) ఫోటోతో కూడిన పోస్ట్ ఆఫీస్/ బ్యాంక్ పాస్ బుక్
5) కార్మిక మంత్రిత్వ శాఖ ఇచ్చిన హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్ కార్డు
6) డ్రైవింగ్ లైసెన్స్
7) పాన్ కార్డ్
8) ఫోటోతో కూడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ కుల ధృవీకరణ పత్రాలు
9) ఇండియన్ పాస్పోర్ట్
10) ఫోటోతో కూడిన పెన్షన్ డాక్యుమెంట్
11) కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలచే జారీ చేయబడిన ఉద్యోగ గుర్తింపు కార్డు
12) ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ఇచ్చిన అధికారిక గుర్తింపు కార్డు
13) దివ్యాంగుల గుర్తింపు కార్డు
14) పట్టాదార్ పాస్ పుస్తకం
15) రేషన్ కార్డు
16) ఫోటోతో కూడిన ఆయుధ లైసెన్స్ పత్రం
17) ఫ్రీడం ఫైటర్ ఐ.డీ కార్డ్
18) ఆర్జీఐ ద్వారా జారీ చేయబడిన ఎన్.పీ.ఆర్ స్మార్ట్ కార్డు


పై వాటిలో ఏదైనా ఒక దానిని చూపించి ఓటు వేయవచ్చని కలెక్టర్ సూచించారు. ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

## సామాజిక న్యాయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గట్ల రాజన్న నియామకం



ములుగు డిసెంబర్ 10 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): ములుగు మండలం జంగాల పల్లి గ్రామానికి చెందిన గట్ల రాజన్న మరోజు వీరన్న సహచరుడు కుల ఉద్యమాల నిర్మాణంలో విశేష కృషి చేశారు కుల ఉద్యమాల తోపాటు బిసి ఉద్యమాలు దళిత బహుజన ఉద్యమాల నిర్మాణంలో రాష్ట్ర వ్యాప్తంగా చురుకు గాపనిచేస్తున్నారు దళిత బహుజన రాజ్యాధికారం కోసం మారోజు వీరన్న సహచరునిగా ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లోను తెలంగాణ ఉద్యమ నిర్మాణంలో పని చేసారు మా రోజు వీరన్న మార్గంలోనే దళిత బహుజన రాజ్యాధికారం వస్తుందని నమ్మిన సిద్ధాంత కర్త అతని సేవలు సమాజానికి అవసరం గా భావించి సామాజిక న్యాయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గా నియమించడం జరిగింది అని సామాజిక న్యాయ వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఏష బోయిన సాంబయ్య యాదవ్ ప్రకటించారు.

## వ్యాధి నిరోధక టీకల కార్యక్రమాన్ని సందర్శించిన డాక్టర్ జె సంధ్యా కిరణ్మయి



గద్వాల డిసెంబర్ 10(విజన్ ఆంధ్ర): జోగులాంబ గద్వాల జిల్లా ఎంసీఏ సెంటర్ నందు బుదవారం వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని డాక్టర్ జె సంధ్యా కిరణ్మయి సందర్శించారు. ఈరోజు వ్యాక్సిన్ చేయించుకునే వారి డ్యూలిస్ట్ని ఆశా కార్యకర్తల వారీగా పరిశీలించారు. వ్యాధి నిరోధక టీకా వేయగానే పిల్లల తల్లిదండ్రులకు నాలుగు కి మెసేజ్లు తెలపాలని, జ్వరం రాకుండగా సిరప్ మందులను ఇవ్వాలని సూచించారు. మందుల స్టాక్ రిజిస్టర్ మైంటైన్ చేయాలని తెలిపారు. సిబ్బంది అందరూ సమయపాలన పాటించాలని, ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీలు చేపించాలని సందరరేగా సూచించారు. ఇట్టి వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో డిపిహెచ్ఎన్ఓ వరలక్ష్మి, హెల్త్ సూపర్వైజర్ సుబ్బలక్ష్మి, ఏఎన్ఎంలు , గ్రేస్,లక్ష్మి, వివిధ వార్డుల ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఖమ్మం పాత బస్టాండ్‌లో అధికారుల 'వసూళ్ల దందా'

## మార్కెట్‌లో బీజేపీ ఆకస్మిక తనిఖీ బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు వార్నింగ్



ఖమ్మం, డిసెంబర్ 10 : ఖమ్మం నడిబొడ్డున బ్రతుకు దెరువు కోసం ఏర్పాటు చేసుకున్న కూరగాయల మార్కెట్ ఇప్పుడు అవినీతికి అడ్డాగా మారిందంటూ భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు అధికారుల తీరుపై నిప్పులు చెరిగారు. పాత బస్టాండ్ సమీపంలోని వీధి వ్యాపారుల నుండి అధికారులు అక్రమంగా లక్షల రూపాయలు వసూలు చేశారని, నెలలు గడుస్తున్నా వారికి రసీదులు ఇవ్వకుండా వేధిస్తున్నారని ఆరోపిస్తూ బుధవారం బీజేపీ శ్రేణులు సంఘటనా స్థలాన్ని సందర్శించాయి. ఈ సందరరేగా అక్కడ తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పేదల కష్టార్జితాన్ని దోచుకుంటున్న అధికారుల తీరుపై, స్థానిక రాజకీయాలపై బీజేపీ నేతలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఖమ్మం నగరంలోని పాత బస్టాండ్, టీటీడీ కళ్యాణ మండపం సమీపంలో గత అనేక సంవత్సరాలుగా సుమారు 40 నుండి 60 కుటుంబాలు కూరగాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో ఉన్నప్పుడు కూడా వీరు ఇక్కడే వ్యాపారం చేసుకునేవారు. అయితే 2014 తర్వాత అప్పటి ప్రభుత్వం ఇక్కడ షెడ్లను పొడిగించినప్పటికీ, వాటికి సంబంధించిన పూర్తి అనుమతుల విషయంలో స్పష్టత ఇవ్వలేదు. దీన్ని అవకాశంగా తీసుకున్న ప్రస్తుత మెప్మా అధికారులు, లైసెన్సులను పునరుద్ధరించడానికి అంటూ ఒక్కొక్కరి దగ్గర నుండి 10 వేల రూపాయల చొప్పున వసూలు చేయడం ఇప్పుడు తీవ్ర దుమారం రేపుతోంది. పేద వ్యాపారుల నుండి ఇంత భారీ మొత్తంలో వసూలు చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై సమాచారం అందుకున్న బీజేపీ రాష్ట్ర కోశాధికారి దేవసాని వాసుదేవరావు మరియు జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు, రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు ఇతర నాయకులతో కలిసి నేరుగా మార్కెట్‌ను సందర్శించి బాధితులతో మాట్లాడారు. ఈ సందరరేగా నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ మెప్మా పీడీ సుజాత, శివరామకృష్ణ అనే అధికారులు వ్యాపారుల నుండి రేషన్ కార్డులు, ఆధార్ కార్డుల జిరాక్సులు తీసుకొని, దాదాపు 28 లక్షల రూపాయలకు పైగా నగదును మూడు నెలల క్రితమే వసూలు చేశారని ఆరోపించారు. డబ్బులు కట్టి మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఒక్కరికి కూడా రసీదు ఇవ్వలేదని, ప్రభుత్వానికి చెల్లించాల్సిన డబ్బులకు రసీదు ఇవ్వకుండా ఆ డబ్బులు ఎవరి జేబుల్లోకి వెళ్తున్నాయో సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు. అంతేకాకుండా, ఇక్కడ ఏళ్ల తరబడి వ్యాపారం చేసుకుంటున్న వారిని బెదిరించి, వారి స్థానంలో కొత్తవారిని తీసుకొచ్చి పెట్టే కుట్ర జరుగుతోందని బీజేపీ నేతలు ఆరోపించారు. స్థానిక వ్యాపారులు గంజాయి లేదా డ్రగ్స్ అమ్ముతున్నారంటూ అబద్ధపు ప్రచారాలు చేస్తూ, వారిని భయ భ్రాంతులకు గురిచేసి ఖాళీ చేయించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే, తమకు అనుకూలమైన వారిని అక్కడ చొప్పించడానికి అధికారులు , కొంతమంది స్థానిక నాయకులు ప్రయత్నిస్తున్నారని, ఇది అత్యంత హేయమైన చర్య అని బీజేపీ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. పేదవాడి పొట్ట కొట్టి రాజకీయాలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. అధికారులు వెంటనే స్పందించి వసూలు చేసిన 28 లక్షల రూపాయలకు పక్కా లెక్క చెప్పాలని, లేదంటే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయపరమైన పోరాటం చేస్తామని నెల్లూరి కోటేశ్వరరావు అల్టిమేటం జారీ చేశారు. అక్రమంగా డబ్బులు వసూలు చేయడం ఒక దందాగా మారిందని, రసీదు లేకుండా ప్రజల డబ్బును తీసుకోవడం మనీ లాండరింగ్ కిందకే వస్తుందని వారు గుర్తుచేశారు. తరతరాలుగా ఇక్కడ వ్యాపారం చేస్తున్న వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, కొత్తవారికి అవకాశం ఇవ్వాలనుకుంటే వారి అర్హతలను పరిశీలించి వేరే చోట స్థలం కేటాయించాలి తప్ప, ఉన్నవారి ఉపాధిని దెబ్బతీయవద్దని తేల్చిచెప్పారు. సమస్య పరిష్కారమయ్యే వరకు బాధితులకు అండగా ఉంటామని బీజేపీ నేతలు హామీ ఇచ్చారు.

# పోలింగ్ ప్రక్రియతో పాటు, ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సజావుగా ఏర్పాట్లు పూర్తి,

## ఉదయం 7 నుంచి ఒంటిగంట వరకు పోలింగ్, 137 పంచాయతీల్లో ఎన్నికలకు సర్వం సిద్ధం, నాగర్ కర్నూల్ జిల్లా ఎన్నికల అధికారి బాదావత్ సంతోష్,



నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర): డిసెంబర్, మొదటి విడతలో జరిగే గ్రామపంచాయతీ ఎన్నికలకు పటిష్టమైన ప్రణాళికతో ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా మొదటి విడత ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయి సంసిద్ధంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని నాగర్ కర్నూల్ ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు.

గురువారం నాగర్ కర్నూల్ జిల్లాలో మొదటి విడతలో జరిగే గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో బుధవారం నాగర్ కర్నూల్ జిల్లా ఎన్నికల అధికారి బాదావత్ సంతోష్ మాట్లాడుతూ..... జిల్లాలో పటిష్టమైన ప్రణాళికతో ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా మొదటి విడత ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పరంగా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. మొదటి విడత ఎన్నికల కోసం 6 వేల మంది పైగా ఎన్నికల అధికారులు తొలి విడత ఎన్నికల్లో వివిధ హోదాల్లో నిధులు విధుల్లో పాల్గొంటున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.

జిల్లాలో మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలలో 151 గ్రామ పంచాయతీలు ఉండగా , 14 గ్రామ పంచాయతీలు సర్పంచలు ఏకగ్రీవమయ్యాయని, మిగిలిన 137 గ్రామ పంచాయతీలకు గాను 447 మంది సర్పంచ్ అభ్యర్థులుగా పోటీలో ఉన్నారన్నారు. ప్రిసైడింగ్ అధికారులకు, స్టేజ్-2 రిటర్నింగ్ అధికారులకు ముదు విడుతలలో శిక్షణ ఇచ్చాం. సీటింగ్ ఏర్పాట్లు, సీక్రెట్ ఓటింగ్ కంపార్ట్‌మెంట్ వంటివి నిబంధనలకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.

1326 వార్డులకు గాను , 208 వార్డులుఏకగ్రీవమయ్యాయని,
1,118 వార్డులకు గాను 2774 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని, ఆయా అభ్యర్థులకు ఎన్నికలు జరగనున్నట్లు తెలియజేశారు.

కల్వకుర్తి, ఊర్కోండ, వెల్దండ, వంగూరు, తాడూరు, తెలకపల్లి ఆరు మండలాలకు గాను 1,118 పోలింగ్ కేంద్రాలు, 1,118 పిఓ లు, 3000 ఓపిఓలు, 151 మంది రిటర్నింగ్ ఆఫీసర్లను నియమించినట్టు తెలిపారు.

మండలాల వారీగా ఓటర్ల వివరాలు

కల్వకుర్తి మండలంలో 24 గ్రామపంచాయతీ లు 214 వార్డులు,
పురుష ఓటర్లు 15,803
మహిళా ఓటర్లు 15,703
మొత్తం..........31511

ఊర్కోండ మండలంలో 16 గ్రామపంచాయతీలు,138 వార్డులు,
పురుష ఓటర్లు 8868
మహిళా ఓటర్లు 9119
మొత్తం.......... 17,987

వంగూరు మండలంలో 27 గ్రామపంచాయతీ లు, 228 వార్డులు,
పురుష ఓటర్లు 16,498
మహిళా ఓటర్లు 17000
మొత్తం............33,498

వెల్దండ మండలంలో 32 గ్రామపంచాయతీలు, 270 వార్డులు,
పురుష ఓటర్లు 17,163
మహిళా ఓటర్లు 16,995
మొత్తం..........33,498

తాడూరు మండలంలో 24 గ్రామపంచాయతీ లు,216 వార్డులు,
పురుష ఓటర్లు 14,968
మహిళా ఓటర్లు 15187
మొత్తం.......30,155

తెలకపల్లి మండలంలో 28 గ్రామపంచాయతీలు, 260 వార్డులు,పురుష ఓటర్లు 22,325మహిళా ఓటర్లు 22,520 ఇతరులు...2మొత్తం..44,847

మొదటి విడతలు జరిగే ఎన్నికల్లో 9,56,25 మంది పురుష ఓటర్ లు, 9,65,29 మంది మహిళా ఓటర్లు, ఇతరులు ఇద్దరు, మొత్తం 1,92156 మంది ఓటర్లు రేపు గురువారం మొదటి విడతలో జరిగే ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోనున్నారని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు.మొదటి విడత లో జరిగే ఎన్నికలకు 55 మంది మైక్రో అబ్జర్వర్లతో పాటు 32 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ ప్రక్రియను చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు.

ఆయా పోలింగ్ కేంద్రాల్లో కొనసాగి పోలింగ్ ప్రక్రియలను జిల్లా కలెక్టరేట్, రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయంలో నేరుగా వీక్షించేలా ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు.పంచాయతీ ఎన్నికల సందరరేగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులతో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశామని, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని వివరిస్తూ, పోటీచేస్తున్న అభ్యర్థులతో ఇప్పటికే ప్రత్యేక సమావేశాలు నిర్వహించామని, నిన్నటి సాయంత్రం 5 గంటల నుంచి గురువారం ఓట్ల లెకింపు పూర్తయి, ఫలితాలు వెల్లడించే వరకు ఆయా మండలాల్లో మద్యం విక్రయాలపై నిషేధం విధించినట్లు కలెక్టర్ బాదావత్ సంతోష్ చెప్పారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని అన్నారు.

# సజావుగా ఎన్నికల నిర్వహణ చేపట్టాలి

## -జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



జనగామ ప్రతినిధి,(విజన్ ఆంధ్ర): రేపు జరిగే మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు సజావుగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. మొదటి విడతలో చిల్పూర్, స్టేషన్ ఘనపూర్,లింగాల ఘనపూర్,జాఫర్ ఘడ్, రఘునాథపల్లి మండలాల్లో 11న జరగనున్న మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లను అబ్జర్వర్ రవి కిరణ్ తో కలిసి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. ముందుగా ఘన్పూర్ లోని జడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించి పోలింగ్ మెటీరియల్ ని పరిశీలించారు. అలాగే పోలింగ్ మెటీరియల్ పంపిణీ ఏర్పా ట్లను అడిగి తెలుసుకున్నారు. మైక్రో అబ్జర్వర్లతో మాట్లాడి పలు సూచనలు చేశారు. అనంతరం చిల్పూర్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి వెళ్లి అక్కడ ఎన్నికల సామాగ్రిని, బ్యాలెట్ పేపర్లను,పోలింగ్ బాక్సులను సైతం పరిశీలించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో కావాల్సిన సామాగ్రిని పోలింగ్ కేంద్రం వారిగా వేరు చేసి సిద్ధంగా ఉంచాలని సూచించారు. బ్యాలెట్ పత్రాలు జాగ్రత్తగా చెక్ చేసి ప్యాక్ చేయాలని తెలిపారు. డిస్ట్రి బ్యూషన్ కేంద్రం నుండి పోలింగ్ కేంద్రం చేరుకొని ఓటింగ్ నిర్వహణ ఏర్పాట్లను మరోసారి నిర్ధారణ చేసుకోవాలన్నారు. సిబ్బంది రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, అలాగే 24 గంటలు విద్యుత్ సరఫరా ఉండేలా సంబందిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏమైనా లోపాలు కనిపిస్తే వెంటనే తెలియజేయాలని, త్రాగునీరు,లైటింగ్, పా ర్కింగ్ ప్రదేశాలు, వచ్చిపోయేదారులు వంటి వాటికి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అనంతరం రఘునాథపల్లి జడ్పీ సెకండరి స్కూల్ లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి పోలింగ్ సిబ్బంది, మైక్రో అబ్సర్వర్ లతో మాట్లాడి వారి విధులను క్షుణ?ంగా వివరించారు. పోలింగ్ అధికారులకు ఏర్పాటు చేసిన భోజన సదుపాయాన్ని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ స్వయంగా పరిశీలించి పోలింగ్ సిబ్బందికి వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో లు వెంకన్న, గోపిరాం, తహసీల్దార్ లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ ఎన్నికల కోసం కాలువలను దాటిపోతున్న పోలీస్ సిబ్బంది



నిర్మల్ డిసెంబర్ 10 (విజన్ ఆంధ్ర జిల్లా ప్రతినిధి): గ్రామపంచాయతీ ఎన్నికల తొలి దశ పోలింగ్ సందరరేగా నిర్మల్ జిల్లా జనరల్ ఆబ్జర్వర్ ఐషా మస్రత్ ఖానం మంగళవారం పెంబి మండలంలోని యాపాలగూడ గ్రామపంచాయతీ ని సందర్శించారు. పోలింగ్ సిబ్బంది నదిని దాటి పోలీస్టేషన్లకు చేరుకునే ప్రాంతాన్ని ఆమె స్వయంగా పరిశీలించారు. యాపాలగూడలో పోలింగ్ బూత్‌కి చేరుకునే మార్గంలో వాగు ఉండడం వల్ల, స్థానికంగా తయారు చేసిన థర్మాకోల్ పడవను ఉపయోగించి సిబ్బందిని సురక్షితంగా తరలించే ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఏర్పాట్లను ఆబ్జర్వర్ సమగ్రంగా పరిశీలించి, సిబ్బంది ప్రయాణం ఎటువంటి ప్రమాదం లేకుండా జరుగాలన్న దిశగా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రేపే మొదటి విడత పోలింగ్ జరగనున్న నేపథ్యంలో, సిబ్బందికి రవాణా, భద్రత, కమ్యూనికేషన్ వంటి అన్ని ఏర్పాట్లు ఖచ్చితంగా సిద్ధంగా ఉండాలని ఆమె స్థానిక ఎన్నికల నిర్వాహకులకు ఆదేశించారు. నదిని దాటే ప్రాంతంలో తగినంత సిబ్బంది, లైఫ్ జాకెట్లు, సపోర్ట్ రోప్స్ వంటి ఏర్పాట్లు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. పోలింగ్ సిబ్బంది ఎటువంటి ఇబ్బంది లేకుండా బూత్‌లకు చేరుకునేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆబ్జర్వర్ స్పష్టం చేశారు.

## స్పోర్ట్స్ మానియా- 2025 కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పీఏసీ చైర్మెన్ ఆరెకపూడి గాంధీ





శేరిలింగంపల్లి .డిసెంబర్ 10 ( విజన్ ఆంధ్ర): గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గచ్చిబౌలి స్టేడియంలో శేరిలింగంపల్లి మండల గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన స్పోర్ట్స్ మానియా- 2025 కార్యక్రమంను ఎంఈఓ వెంకటయ్య కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన పీఏసీ చైర్మన్. ఈ కార్యక్రమంలో శేరిలింగం పల్లి స్పోర్ట్స్ మేనియా 2025, చీఫ్ అడ్వైసర్ లయన్ డా. వెంకటేశ్వర రావు, అధ్యక్షులు, పవన్ కుమార్, సెక్రటరీ పి. త్రిమూర్తులు, కోశాధికారి, సలీం, కన్వీనర్ ఎన్ ఎస్ రావు, కో. కన్వీనర్ నరేంద్ర బాబు. ట్రేసమా స్టేట్ ప్రెసిడెంట్ S.N. రెడ్డి ,సెక్రటరీ అనిల్ కుమార్,రాజేశ్వర రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మొదలగు వారు పాల్గొన్నారు.

## 13 న సత్తుపల్లికి చిన్న జీయర్ స్వామి రాక

సత్తుపల్లి ఆర్ సి, డిసెంబర్ 10 ( విజన్ ఆంధ్ర ): ఈనెల 13న శనివారం సాయంత్రం సత్తుపల్లి పట్టణంలో జీ వి మాల్ వెనుక నూతనంగా నిర్మించిన గృహ సముదాయ సమగ్ర యూనిట్ నందు జరగనున్న శ్రీ శ్రీనివాస కళ్యాణం మహోత్సవానికి ముఖ్య అతిథులుగా శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి సమగ్ర యూనిట్లుసందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి,శ్రీ శ్రీనివాస కళ్యాణం జరిపించుదురని నిర్వాహకులు,శ్రీ శ్రీ శ్రీ చిన్న జీయర్ స్వామి వారి శిష్యులు శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల రామకృష్ణ చార్యులు బుధవారం విలేకర్ల సమావేశంలో తెలిపారు,ఈ కార్యక్రమానికి చిన్న జీయర్ స్వామి భక్తులు శిష్యులు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు, ఈ సమావేశంలో సమగ్ర యూనిట్ నిర్వాహకులు బోనగిరి చెన్నారావు, ఇడుప సాంబశివరావు, అడపా ముత్యాలరావు, మొర్రిశెట్టి సాంబశివరావు, బాడిశ రమేష్, ఇడుపులపాటి శివప్రసాద్, ఇడుపులపాటి రామకృష్ణ, ప్రతాప్ ,సురేష్,ఎస్ కే బాబా పాల్గొన్నారు

# మెడికల్ విద్య రక్షణ కోసం ప్రజలే తీర్పు చెప్పారు

## లక్ష్యాన్ని మించిన పూర్తయిన కోటి సంతకాలు : పూతలపట్టు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే సునిల్ కుమార్





పూతలపట్టు, డిశంబర్ 10 ( విజన్ ఆంధ్ర ) : చిత్తూరు జిల్లా, పూతలపట్టు నియోజకవర్గం లో 54 వేల సంతకాలు .మెడికల్ విద్య రక్షణ కోసం ప్రజలే తీర్పు చెప్పారు. లక్ష్యాన్ని మించిన కోటి సంతకాలు. పూతలపట్టు నియోజక వర్గంలో పూర్తయిన కోటి సంతకాల పత్రాలతో వైఎస్ఆర్ సిపి జిల్లా కార్యాలయంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు భూమాన కరుణాకర్ రెడ్డికి అందజేసిన పూతలపట్టు మాజీ ఎమ్మెల్యే మరియు సమన్వయకర్త డాక్టర్ సునీల్ కుమార్! ఈ కార్యక్రమం లో మాజీ ఎమ్మెల్యే లలిత కుమారి, జిల్లా మాజీ జెడ్పి చైర్మన్ కుమార్ రాజా, బంగారుపాళ్యం వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, వైయస్సార్ పార్టీ సీనియర్ నాయకులు తలపలపల్లి బాబు రెడ్డి, ఐరాల మండల కన్వీనర్ బుజ్జి రెడ్డి, తవణంపల్లి మండల కన్వీనర్ హరి రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ప్రభు నాయుడు, రాష్ట్ర సోషియల్ మీడియా సంయుక్త కార్యదర్శి కిషోర్ కుమార్ రెడ్డి, నియోజకవర్గం అధికార ప్రతినిధి సుధాకర్ రెడ్డి, నియోజకవర్గం సోషియల్ మీడియా అధ్యక్షులు రెడ్డప్ప, నియోజకవర్గం పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షులు ఓబుల్ రెడ్డి, బంగారుపాళ్యం మండలం యువత అధ్యక్షుడు గజేంద్ర, ఐరాల మండల వైయస్సార్ పార్టీ నాయకులు దొరబాబు, రామచంద్ర, రమణ, మురళి, బీసీ నాయకులు కోదండ, శంకర్ నాయుడు, రమణ, సుందర్ రాజ్, మొగిలయ్య తదితరులు పాల్గొన్నారు..

# మానవ సంబంధాలను దెబ్బతీసే మత్తు జోలికి వెళ్లొద్దు

**యువ భారత్ ను దెబ్బతీసే లక్ష్యంతోనే దేశంలోకి డ్రగ్ సరఫరా**
**ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్**
**అపోలో నాలెడ్జ్ సిటీ క్యాంపస్ లో "మదకద్రవ్యాల దుర్వినియోగం : నిశ్శబ్ద సంక్షోభం అంశంపై అవగాహన**



చిత్తూరు, డిశంబర్ 10 ( విజన్ ఆంధ్ర ) : మానవత్వాన్ని, మానవ సంబంధాలను దెబ్బతీసే మత్తు పదార్థాల జోలికి యువత వెళ్లవద్దని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పిలుపునిచ్చారు. అపోలో నాలెడ్జి సిటీలో బుధవారం సాయంత్రం జరిగిన "మాదకద్రవ్యాల దుర్వినియోగం నిశ్శబ్ద సంక్షోభం" అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భారత్ ఐటీ రంగంలో అగ్రగామమగా వెలుగొందుతోందని.. భారత యువత చాలా దేశాల్లో ఐటీ రంగాన్ని ఏలుతోందని.. వీటిని సహించలేని కొందరు భారత యువతను దెబ్బతీసే ఉద్దేశంతో.. డ్రగ్స్ ను యువతకు చేర్చేలా కుట్రలు చేస్తున్నారన్నారు. మత్తు ఏ రూపంలో ఉన్న యువత వీటికి దూరంగా ఉండాలని, మీ భవిష్యత్తు కోసం కష్టపడుతున్న తల్లిదండ్రుల ఆకాంక్షలు నెరవేర్చేలా,దేశం గర్వించేలా ముందుకు వెళ్లాలన్నారు. సాంకేతికతను, స్నేహితులను జాగ్రత్తగా మంచి కోసమే ఉపయోగించుకోవాలన్నారు. సమాజాన్ని ఏ ఒక్కరే మార్చలేరని.. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. మత్తు పదార్థాల వినియోగం, దుష్పరిణామాల, యువతపై ప్రభావం, చట్టాల, పడే శిక్షలపై సర్కిల్ ఇన్స్పెక్టర్లు మహేశ్వర్, నిత్య బాబు, నెట్టి కంఠయ్య సవివరంగా వివరించారు. ఈ కార్యక్రమంలో మేయర్ ఎస్ అముద, ఏఐఎంఎస్ఆర్ డీన్ డా.ఆల్ఫ్రెడ్ జె.అగస్టీన్, యూనిట్ హెడ్ బాలరాజ్, స్థానిక నాయకులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆరు మండలాల్లో నిషేధాజ్ఞలు అమల్లోకి

## మద్యం దుకాణాలు మూసివేత - 11న తొలి విడత పోలింగ్



ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి,డిసెంబర్10, (విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ జిల్లా లో 6 మండలాల్లో... గ్రామపంచాయతీ తొలి విడత ఎన్నికలు డిసెంబర్ 11వ తేదీ (గురువారం) ఉదయం 7:00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంటల వరకు జరుగనున్న నేపథ్యంలో ఎన్నికల నిర్వహణ సజావుగా సాగేందుకు కీలక ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. ఇంద్రవెల్లి, ఉట్నూర్, నార్నూర్, గాదిగూడ, సిరికొండ, ఇచ్చోడ మండలాల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు నిన్న సాయంత్రం 5:00 గంటలలోపు ప్రచారం ముగించారు. ప్రచారం ముగిసిన తరువాత బహిరంగ సభలు, ర్యాలీలు, మైక్ అనౌన్స్‌మెంట్లు, మోటార్‌షోలు వంటి ఏ విధమైన కార్యక్రమాలకు కూడా కఠినంగా నిషేధం విధించబడింది. ఎన్నికల ప్రశాంతత దృష్ట్యా, సంబంధిత ఆరు మండలాల్లో Sec.163 BNSS ప్రకారం నిషేధాజ్ఞలు నిన్న సాయంత్రం 5 గంటల నుంచి అమల్లోకి వచ్చాయని కలెక్టర్ తెలిపారు. ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది ఒకచోట గుమిగూడడం నిషేధం. శాంతిభద్రతల విషయంలో ఎటువంటి రాజీ ఉండదని హెచ్చరించారు.ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం ప్రచారం ముగిసిన వెంటనే, ఆరు మండలాల్లోని మద్యం దుకాణాలు, బార్లు పూర్తిగా మూసివేయాలని ఆదేశాలు జారీ చేశామని కలెక్టర్ తెలిపారు. పోలింగ్, ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు ఈ ఆంక్షలు కొనసాగుతాయన్నారు.

డిసెంబర్ 11న పోలింగ్ అనంతరం, అదే రోజు మధ్యాహ్నం తర్వాత మండల కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు జరగడంతో ఫలితాలు ప్రకటించబడతాయని తెలిపారు. ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాత వాతావరణంలో జరుగేందుకు అన్ని శాఖలు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనలు గౌరవించి ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# వంద శాతం పోలింగ్ నమోదుకు అధికారులు సమన్వయంతో పని చేయాలి

## అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా



ఇచ్చోడ ,డిసెంబర్ 10, (విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ, సిరికొండ మండల కేంద్రాల్లోని మొదటివిడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ సామాగ్రి డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన కేంద్రాల్లో సిబ్బందికి సూచనలు ఇస్తూ, అధికారులు సమన్వయంతో పనిచేసి పోలింగ్ వందశాతం జరిగేలా చూడాలన్నారు. బ్యాలెట్ బాక్స్, పోలింగ్ సామాగ్రిని పరిశీలించుకోని ఏమైనా పొరపాట్లు ఉంటే మాస్టర్ ట్రైనర్, అధికారుల సహాయంతో సరిదిద్దుకోవాలని తెలిపారు. ఓటర్ల సహాయార్థం పోలింగ్ కేంద్రాల వద్ద సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసి పంచాయతీ కార్యదర్శి, బూత్ స్థాయి అధికారులను నియమించడం వివరించారు. పోలింగ్ నమోదు వివరాలను ఎప్పటికప్పుడు అందించాలని, వివరాలను టి-పోల్ యాప్ లో పొందుపరచడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్స్ కి సీల్ వేసి ఏజెంట్లు సంతకాలు స్వీకరించాలని అన్నారు. స్టేజ్ -2 రిటర్నింగ్ అధికారులు మధ్యాహ్నం 2 గంటలకు కౌంటింగ్ ప్రారంభించి, పారదర్శకంగా, ప్రశాంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో శిక్షణ కలెక్టర్ సలోని చబ్రా, శిక్షణ నోడల్ అధికారి మనోహర్, డీఎల్పీఓ ఫణీందర్, ఇచ్చోడ, సిరికొండ మండలాల తహసీల్దార్లు జాదవ్ రమేష్, తుకారాం ఎంపీడీవో నరేష్, రాయిస్ఉల్ల, రిటర్నింగ్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జగనన్న పిలుపుతో ఉప్పెనలా కోటి సంతకాల ఉద్యమం

**పూతలపట్టు నియోజకవర్గం లో 54 వేల సంతకాలు**
**మెడికల్ విద్య రక్షణ కోసం ప్రజలే తీర్పు చెప్పారు**
**- లక్ష్యాన్ని మించిన కోటి సంతకాలు**
**జిల్లా అధ్యక్షులు భూమాన కరుణాకర్ రెడ్డి కి**
**అందజేసిన సునీల్ కుమార్, వైసిపి నాయకులు**



పూతలపట్టు, డిశంబర్ 10 ( విజన్ ఆంధ్ర ) : చిత్తూరు జిల్లా, పూతలపట్టు నియోజక వర్గంలో పూర్తయిన కోటి సంతకాల పత్రాలతో వైఎస్ఆర్ సిపి జిల్లా కార్యాలయంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు భూమాన కరుణాకర్ రెడ్డి అన్న కి అందజేసిన పూతలపట్టు మాజీ ఎమ్మెల్యే మరియు సమన్వయకర్త డాక్టర్ సునీల్ కుమార్! ఈ కార్యక్రమంలో ఐరాల మండల కన్వీనర్ బుజ్జి రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ప్రభు నాయుడు, రాష్ట్ర సోషియల్ మీడియా సంయుక్త కార్యదర్శి కిషోర్ కుమార్ రెడ్డి, నియోజకవర్గం అధికార ప్రతినిధి సుధాకర్ రెడ్డి, నియోజకవర్గం సోషియల్ మీడియా అధ్యక్షులు రెడ్డప్ప, నియోజకవర్గం పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షులు ఓబుల్ రెడ్డి, బంగారుపాళ్యం మండలం యువత అధ్యక్షుడు గజేంద్ర, శంకర్ నాయుడు, రమణ, సుందర్ రాజ్, మొగిలయ్య పాల్గొన్నారు..

# సిద్దిపేట ఫ్రెండ్లీ వాకర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడుగా కోమటిరెడ్డి జీవన్ రెడ్డి

## ఏకగ్రీవ ఎన్నికకు సహకరించిన సభ్యులందరికీ కోమటిరెడ్డి జీవన్ రెడ్డి

సిద్దిపేట జిల్లా ప్రతినిధి డిసెంబర్ 10( విజన్ ఆంధ్ర): సిద్దిపేట ఫ్రెండ్లీ వాకర్స్ అసోసియేషన్ అభివృద్ధికి పాటుపడతానని నూతన అధ్యక్షులు కోమటిరెడ్డి జీవన్ రెడ్డి అన్నారు. తనను ఏకగ్రీవంగా ఎన్నికకు సహకరించిన సభ్యులందరికీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. బుధవారం సిద్దిపేట ఫ్రెండ్లీ వాకర్స్ అసోసియేషన్ 73 మంది సభ్యులతో కోమటి చెరువు కట్ట వద్ద సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షునిగా జీవన్ రెడ్డి ఎన్నుకున్నారు . గత కొన్ని సంవత్సరాలుగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సిద్దిపేట లోనే ఆదర్శంగా నిలిచినటు వంటి సిద్దిపేట కోమటి చెరువు ఫ్రెండ్లీ వాకర్స్ అసోసియేషన్ అని అన్నారు. గతంలో కరోనా సంవత్సరంలో కూడా అసోసియేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. సిద్దిపేట పట్టణ ప్రజా ప్రతినిధుల సహకారంతో అసోసియేషన్ను మరింత ముందుకు తీసుకపోవడం జరుగుతుందన్నారు. నూతన అధ్యక్షునిగా కోమటిరెడ్డి జీవన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా : నక్కి రెడ్డి కిషన్ రెడ్డి , ఉపాధ్యక్షులుగా పిటిల సుధాకర్ , కెమ్మసారం రాజేష్ ఖన్నా , మైపాల్ రెడ్డి సహాయ కార్యదర్శిగా :కోమటిరెడ్డి అంజిరెడ్డి క్యాషియర్ గా : సుక్క చంద్రంలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అసోసియేషన్ అధ్యక్షునిగా ఎన్నుకోవడంతోఅసోసియేషన్ అభివృద్ధికి తాను ఎల్లవేళలా పాటు పడతానన్నారు.

# యురేనియం ప్రభావిత గ్రామస్థులకు న్యాయం చేస్తాం

**జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి**
**కేకే కొట్టాల గ్రామ భూసేకరణకు యూసీ ఐ ఎల్ వారి అవసరం మేరకు చర్యలు**



కడప జిల్లా, డిసెంబర్ 10 (విజన్ ఆంధ్ర): యురేనియం ప్రభావిత గ్రామస్థులకు నష్టం జరగకుండా న్యాయం జరిగేలా చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు.బుధవారం కలెక్టరేట్లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్ నందు తుమ్మలపల్లి యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (యు.సి.ఐ.ఎల్) సమస్యలపై మాజీ ఎమ్మెల్సీ బి.టెక్ రవి, ప్రాజెక్టు అధికారులు, పులివెందుల డివిజన్ రెవెన్యూ అధికారి, కేకే కొట్టాల గ్రామస్థులతో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందరేగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ జాతీయ స్థాయిలో అత్యంత ప్రాధాన్యత కలిగిన యుసిఐఎల్ ప్రాజెక్టు నిర్వహణకు సంబంధించి కేంద్ర స్థాయిలో పర్యవేక్షణ లో నిర్వహించడం జరుగుతోందన్నారు. యురేనియం ప్రభావిత గ్రామస్థుల సమస్యలు,వారి ప్రతిపాదనలను పరిశీలించి కేంద్రానికి నివేదిస్తామన్నారు. స్థానిక సమస్యలను పరిగణన లోకి తీసుకుని,ప్రాజెక్టు అవసరాలు,నిర్వహణ సామర్థ్యం ద ృష్ట్యా కొత్త టెయిలింగ్ పాండ్ నిర్మాణం చేపట్టడానికి ముందే ల్యాండ్ కమిటీని ఏర్పాటు చేసి కేకే కొట్టాల గ్రామాన్ని భూసేకరణ చేపట్టేందుకు చర్యలు చేపడతామన్నారు దీనిపై పబ్లిక్ నోటిఫికేషన్ కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇందుకు దాదాపు 6 నెలల సమయం పడుతుందన్నారు. అంతేకాకుండా నిర్వహణలో ఉన్న పాత టెయిలింగ్ పాండ్ ఎత్తును పెంచుకునేందుకు కానీ, ఏదైనా మరమ్మతులు చేపట్టేందుకు కానీ ఉన్న అవకాశాలనుపరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. దేశాభివృద్ధి, ఉత్పాదక ప్రయోజనాల కోసం స్థానికులు తమ సొంత భూములు, సొంత నివాసాలను వదులుకోవడం త్యాగంతో కూడుకున్న విషయమే అన్నారు. సమాజ శ్రేయస్సు కోసం ఊరిని కోల్పోతున్న యురేనియం ప్రభావిత గ్రామస్థులకుచట్టపరంగా,న్యాయ పరంగా జిల్లా యంత్రాంగం సహకరిస్తుందన్నారు. కేకే కొట్టాల గ్రామస్తులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా పరిహారం,ఉపాధి అవకాశాలను న్యాయబద్ధంగా కల్పిస్తామన్నారు. గతంలో పరిహారంతో పాటు ఇంకా కొంతమందికి పెండింగ్ లో వున్న ఉద్యోగ కల్పన కూడా త్వరలో క్లియర్ చేయాలని యూసీఐఎల్ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఏదైనా సామాజిక బాధ్యతగా యురేనియం ప్రభావిత గ్రామాల్లో మౌలిక అవసరాలను కల్పించేందుకు ఇంకా మెడికల్ క్యాంపులు, వైద్య సదుపాయాలు, పారిశుద్ధ్య అభివ ృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ముందుకు రావాలని, ఆ దిశగా ఆయా గ్రామ ప్రజలకు సహకారం అందించాలని యూసీయల్యాజమాన్యానికి జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో పులివెందుల ఆర్డీఓ చిన్నయ్య, యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ సుమన్ సర్కార్, యుసీఐఎల్ సూపరింటెండెంట్ ల్యాండ్ అక్విజేషన్ ఆఫీసర్ నవీన్ కుమార్ రెడ్డి, విజయ్ కుమార్, పీకే నాయర్, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలు శాంతియుతంగా, నిష్పక్షపాతంగా

## నిర్వహించేందుకు పోలీస్ బందోబస్తు ఏర్పాటు

### జిల్లా ఎస్పీ టి శ్రీనివాస రావు



గద్వాల డిసెంబర్ 10(విజన్ ఆంధ్ర): జిల్లాలో మొదటి విడత స్థానిక సంస్థల ఎన్నికలు గద్వాల, ధరూర్, గట్టు, కె.టి. దొడ్డి మండలాల్లో 11-12-2025న ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంటల వరకు జరగనున్న నేపథ్యంలో, ఎన్నికలు శాంతియుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడమైనదని జిల్లా ఎస్పీ టి శ్రీనివాస రావు అన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మొదటి విడత ఎన్నికల నేపథ్యంలో 163 బి ఎన్ ఎస్ ఎస్. (144 సెక్షన్ ) అమల్లో ఉన్నందున ఎన్నికల కేంద్రాల పరిసరాల్లో 100 మీటర్ల పరిధిలో ఐదుగురు లేదా అంతకన్నా ఎక్కువ వ్యక్తులు గుంపులుగా గుమికూడరాదు.పోలింగ్‌కు ముందు నుండి అనగా 09-12-2025 సాయంత్రం 5:00 గంటల నుంచి పోలింగ్ పూర్తయ్యే వరకు, సైలెంట్ పీరియడ్ అమల్లో ఉంటుంది. ఈ సమయంలో ఎన్నికల సభలు, సమావేశాలు, ఇంటింటా ప్రచారం, లౌడ్‌స్పీకర్ వినియోగం, ర్యాలీలు, బైక్ ర్యాలీలు పూర్తిగా నిషేధం. 3. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల లోపల, ఓటర్లు పోలింగ్ కేంద్రానికి వెళ్లే మార్గంలో లేదా దానికి సంబంధించిన వీధుల్లో ఎలాంటి ప్రచారం, అడ్డంకులు, ఉద్రేకం లేదా ప్రలోభాలను సృష్టించకూడదు.పోలింగ్ కేంద్రం నుండి 200 మీటర్ల దూరం లోపల ఎలాంటి బూత్‌లను ఏర్పాటు చేయడానికి అనుమతి లేదు. అభ్యర్థికి లేదా వారి పక్షాన ఒక్క బూత్‌ను మాత్రమే 200 మీటర్ల పరిధికి వెలుపల ఏర్పాటు చేయాలి. ప్రతి బూత్‌కు ఒక టేబుల్, రెండు కుర్చీలు మాత్రమే అనుమతించబడతాయి. బూత్‌ను టెంట్లు లేదా ఇతర మార్గాల ద్వారా మూసివేయడానికి వీలులేదు.బూత్‌ల ఏర్పాటుకు సంబంధించి రిటర్నింగ్ అధికారికి లిఖితపూర్వకంగా తెలియజేయాలి, స్థానిక అధికారుల నుండి లిఖితపూర్వక అనుమతి తప్పనిసరిగా పొందాలి.ఓటు వేయడానికి బూత్ లోకి వచ్చే వారికి ఇచ్చే చీటీ లో వర్డ్ నెంబర్, ఓటరు క్రమ సంఖ్య ను రాసి ఇచ్చే చీటీలపై అభ్యర్థి పేరు లేదా గుర్తు లేదా రాజకీయ పార్టీ పేరు ఉండకూడదు. కేవలం తెల్ల కాగితంపై మాత్రమే రాసి/ ముద్రించాలి. పోలింగ్ స్టేషన్ ప్రాంగణంలో లేదా 100 మీటర్ల పరిధి లోపల ఫోన్లు, కార్డ్‌లెస్ ఫోన్‌లు, వైర్‌లెస్ సెట్‌లు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను ఉపయోగించడానికి లేదా తమ వద్ద ఉంచుకోవడానికి అనుమతి లేదు.ఎన్నికల భద్రత దృష్ట్యా, మద్యం దుకాణాలు (వైన్ షాపులు) డిసెంబర్ 09వ తేదీ సాయంత్రం 05:00 గంటల నుండి 12వ తేదీ ఉదయం 10:00 వరకు పూర్తిగా మూసి ఉంచవలెను.ఎవరైనా మద్యం అక్రమంగా రవాణా చేసినా, నిల్వ చేసినా లేదా తమ వద్ద ఉంచుకున్నా , వారిపై కేసులు నమోదు చేయబడుతుంది.ఓటర్లు పోలింగ్ కేంద్రం లోపలికి గుర్తింపు కార్డ్ ( ఓటర్ కార్డు, ఆధార్ కార్డు ఇటిసి ..) మాత్రమే అనుమతించబడుతుంది. పోలింగ్ కేంద్రంలోకి సిరా (ఇంక్), వాటర్ బాటిళ్లు, కత్తులు లేదా భద్రతా సిబ్బంది అనుమానించే ఇతర ఎలాంటి వస్తువులను కూడా తమ వెంట తీసుకురావడానికి అనుమతి లేదు.పోలింగ్ పూర్తయ్యే వరకు పోలింగ్ కేంద్రాల పరిసరాలలో స్థానికేతరులు లేదా బయటి వ్యక్తులు ఎవరూ ఉండరాదు.ఓటర్లు పోలింగ్ కేంద్రానికి వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్న వెంటనే, ఎక్కడా గుమిగూడకుండా వెంటనే తమ నివాసాలకు తిరిగి వెళ్లాలి.పోలింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు లేదా ప్రదర్శనలు నిర్వహించడానికి అనుమతి లేదు. నిషేధాన్ని ఉల్లంఘించి ఎవరైనా ర్యాలీలు నిర్వహించినట్లయితే, వారిపై కేసులు నమోదు చేయబడుతుంది. ఎన్నికలు స్వచ్ఛంగా, ప్రశాంతంగా జరగేందుకు ప్రజలు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని కోరడమైనదని తెలియజేశారు.

# పోలీసు జాగిలం "రూని" కి ఘనంగా అంతః క్రియలు

**దివికెగిసిన పోలీసు జాగిలం రూని**
**2012 బ్యాచ్ లో పోలీసు వ్యవస్థలోకి వచ్చిన జాగిలం రూని.**
**నేరస్తులను, దొంగలను పట్టుకోవడంలో కీలకపాత్ర పోషించిన జాగిలం రూని**
**హత్య కేసులలో, దొంగతనాల కేసులలో వాసన పసిగట్టి నేరస్తులను పట్టుకోవడంలో దిట్ట**
**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**



ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి,డిసెంబర్ 10,(విజన్ ఆంధ్ర) 2012 బ్యాచ్కు సంబంధించిన పోలీసు జాగిలం రూని ఆదిలాబాద్ జిల్లా ప్రజలకు, పోలీసు వ్యవస్థకు దొంగలను పట్టుకోవడంలో, నేరస్తులను వెంబడించి పట్టుకోవడంలో సేవలందించి బుధవారం ఉదయం స్వర్గస్తులవడం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అంతక్రియలలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పాల్గొని పోలీసు జాగిలం రూని కి పూలమాలలు అలంకరించి నివాళులర్పించారు. రూని అందించిన సేవలకు జిల్లా ఎస్పీ సెల్యూట్ చేస్తూ తన సేవలకు సరైన గౌరవం అందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.... పోలీసు జాగిలం రూని నేరస్తులను, దొంగలను పట్టుకోవడంలో కీలకపాత్ర పోషించడం జరిగింది, సర్వీస్ నందు దాదాపు 250 కేసులలో పాల్గొని 20 మంది నేరస్తులను పట్టుకోవడంలో తన వంతు పాత్ర పోషించి పోలీసు వ్యవస్థకు సేవలు అందించింది. హత్య కేసులలో, దొంగతనాల కేసులలో వాసన ను పసిగట్టి, నేరస్తులను పట్టుకోవడంలో దిట్ట గా పేరొందింది ఈ జాగిలం, తనిఖీల నిర్వహించడంలోనూ విశేషమైన సేవలు అందించిందని కొనియాడారు. పోలీస్ జాగిలాలు అన్నింటికి మించి సదుపాయాలు, సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.2011 సంవత్సరంలో జన్మించి,2012 సంవత్సరంలో విధులను ప్రారంభించి, పది సంవత్సరముల పాటు పోలీసు వ్యవస్థకు ప్రజలకు విశేష సేవలందించి, 2021 సంవత్సరంలో పదవి విరమణ పొంది, నాలుగు సంవత్సరములుగా విశ్రాంతి లో ఉంది అని తెలిపారు. జిల్లాలో జాగిలాలకు అందుతున్న సౌకర్యాల దృష్ట్య దాదాపు 15 సంవత్సరాలు జీవించి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్యూటీ ఆఫీసర్ దత్తూరం, డాగ్ స్క్వాడ్ సిబ్బంది రూని జాగిలం హాంగ్లర్ పి గంగన్న, ఎస్ తిరుమలేశ్,పి దినేష్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భోరజ్ మండలంలో కంది శ్రీనివాస రెడ్డి పర్యటన

**సర్పంచ్ అభ్యర్దులను గెలిపించాలని కోరుతూ ప్రచారం**
**గ్రామపంచాయితీల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని వెల్లడి**
**ప్రచారంలో పాల్గొన్న డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్, మాజీ కేంద్రమంత్రి వేణుగోపాల చారి**

ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి,డిసెంబర్ 10, (విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ జిల్లాలోని గ్రామపంచాయితీలు అభివృద్ధి చెందాలంటే అధికారంలో ఉన్న కాంగ్రెస్ బలపరచిన సర్పంచ్ అభ్యర్దులను గెలిపించుకోవాలని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన కాంగ్రెస్ శ్రేణులతో కలిసి భోరజ్ మండలంలో పర్యటించారు, మండంలోని గ్రామపంచాయితీల సర్పంచ్ అభ్యర్దులకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. బాలాపూర్ లో రావుత్ అచ్యుత్,సావాపూర్ లో నలగంటి సువర్ణ ఊషన్న,లేఖర్ వాడలో షేక్ ఇమామ్, పెండల్ వాడ లో తుమ్మల సుహాసిని మహేందర్ ,ఆకోలిలో రస్పుత్ గెడాం,కొరాట లో ఇందూరి సవిత వామన్, మాండగడలో బాద రవీందర్,భోరజ్ లో లింగాల నవీన్ ,గేడ లో నిమ్మల ప్రభాకర్,హసీంపూర్ సునీత రాజు,కామాయి లో సురేందర్ రెడ్డి , రాంపూర్ లో బత్తుల వెంకటమ్మ శ్రీనివాస్,సిర్సన్నలో నాయిడి స్రవంతి ప్రకాష్ లను గెలిపించాలని ఆయన మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల చారి , డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్ తో కలిసి ఓటర్లకు విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో గిమ్మ సంతోష్ రావు, భోరజ్ మండల ఇంచార్జిలు ముడుపు దామోదర్ రెడ్డి , మునిగెల నర్సింగ్ ,ప్రశాంత్, మేకల అశోక్, కొండూరి రవి,మానె శంకర్ తిరుమని మహేందర్ ,మన్సూర్ అహ్మద్, శాంతన్ రావు, దీపక్, సాహెబ్ రావు, మల్లారెడ్డి , చందు, అల్లూరి భూమారెడ్డి, ప్రభాకర్, రాంరెడ్డి భోరజ్ మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక



# సమ్మిట్‌పై వ్యతిరేక ప్రచారం - బీఆర్ఎస్‌కు తొందరెక్కువ




హైదరాబాద్ బ్యూరో చీఫ్, డిసెంబర్ 10 (విజన్ ఆంధ్ర ) : పెట్టుబడుల సదస్సు పొలిటికల్ ఈవెంట్ కాదు. కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారం కాదు. తెలంగాణకు చెందినది. అక్కడ ఒక్క రూపాయి పెట్టుబడి వచ్చినా అది తెలంగాణకే మేలు చేస్తుంది. అయినా విపక్షం భారత రాష్ట్ర సమితికి మాత్రం ఇది ఇష్టం లేనట్లుగా ఉంది. సమ్మిట్ ప్రారంభానికి ముందు నుంచే వ్యతిరేక ప్రచారం ప్రారంభించారు. టెంట్లులో చేస్తున్నారని.. ఆంధ్రా కాంట్రాక్టర్లు అని విమర్శలు ప్రారంభించారు. తర్వాత ఒప్పందాలు చేసుకుంటూంటే.. ఒక్కొక్క కంపెనీ మీద వ్యతిరేక ప్రచారం చేయడం ప్రారంభించారు. ఒప్పందాలు చేసుకుంటున్న కంపెనీ లా. ఇతర కంపెనీలు ఉంటే వాటిని తీసుకు వచ్చి అదే కంపెనీ పెట్టుబడుల ఒప్పందం చేసుకుందని.. ఆ కంపెనీ దివాలా తీసిందని ప్రచారం చేస్తున్నారు. ఈ వ్యతిరేక ప్రచారం చాలా ఉద్ధృతంగా సాగుతోంది. పెట్టుబడుల సదస్సు గురించి పాజిటివ్ గా చెప్పకపోయినా వ్యతిరేక ప్రచారం చేసే విషయంలో కాస్త సంయమనం పాటిస్తే బాగుండేదన్న అభిప్రాయం ఎక్కువ రాజకీయేతర వర్గాల్లో వినిపస్తోంది. తెలంగాణకు వచ్చిన పారిశ్రామిక వేత్తలు ఇక్కడ కలుషిత రాజకీయ వాతావరణం ఉందనుకునేలా ఈ పోస్టులు, ప్రచారాలు ఉన్నాయి. తెలంగాణ ప్రభుత్వం డమ్మీ ఎంవోయూలు చేసుకుంటే వాటిని ఖచ్చితంగా బయట పెట్టాలి. సమ్మిట్ లో లోపాలుంటే ప్రశ్నించాల్సిందే. కానీ అసలు ప్రారంభం కాక ముందే.. వ్యతిరేకించాలి.. నెగెటివ్ ప్రచారం చేయాల్సిందే అన్నట్లుగా వ్యవహరిస్తే ఇదేం పద్దతి అనుకుంటారు. ఇప్పుడు అదే ప్రచారం జరుగుతోంది. తెలంగాణకు మేలు జరుగుతూంటే.. పెట్టుబడులు వస్తూంటే ఓర్చుకోలేకపోతున్నారని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్న ఆరోపణలు ఎదుర్కోవాల్సి వస్తోంది.

# కుల్సుంపుర ఏసీపీ మునావర్‌పై తీవ్రమైన చర్య

**- అవినీతి ఆరోపణలతో హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్‌లి**




హైదరాబాద్ బ్యూరో చీఫ్, డిసెంబర్ 10( విజన్ ఆంధ్ర ) : హైదరాబాద్ పోలీస్ వ్యవస్థలో మరోసారి క్రమశిక్షణా చర్యలు చోటుచేసుకున్నాయి. కుల్సుంపుర ఏసీపీ మునావర్‌ను తక్షణమే హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఏసీపీ మునావర్‌పై పలు తీవ్ర ఆరోపణలు వెలువడ్డాయి అవినీతి వ్యవహారాలు, భూ వివాదాల్లో జోక్యం, కేసుల తారుమారు, స్టేషన్ల వారీగా వసూళ్ల కోసం ప్రత్యేక టీంల ఏర్పాటు ఈ ఆరోపణల నేపథ్యంపై కమిషనర్ స్థాయి వరకు ఫిర్యాదులు చేరడంతో, సీపీ స్వయంగా విషయంపై కఠినంగా స్పందించినట్లు సమాచారం. పోలీసు సిబ్బందిని అవమానించే విధంగా మునావర్ ప్రవర్తించాడన్న ఆరోపణ కూడా కమిషనర్ దృష్టికి వెళ్లడంతో, విచారణను వేగవంతం చేశారు. అందిన ఫ్యాక్ట్–ఫైండింగ్ రిపోర్ట్ ఆధారంగా మునావర్‌ను ప్రస్తుత బాధ్యతల నుంచి తప్పించి హెడ్‌క్వార్టర్స్‌కు పంపించారు. పోలీసు శాఖలో క్రమశిక్షణ, పారదర్శకతకు భంగం కలిగించే ఏ చర్యనైనా సహించబోమన్నది ఈ నిర్ణయంతో స్పష్టమైందని వర్గాలు చెబుతున్నాయి.

# ఓటింగ్ కోసం 18 రకాల గుర్తింపు కార్డులలో ఏదైనా చూపవచ్చు..

## - జిల్లా కలెక్టర్ అనుదీప్



ఖమ్మం బ్యూరో డిసెంబర్– 10 ( విజన్ ఆంధ్ర ) ఈ నెల 11, 14, 17 తేదీలలో మూడు విడతల్లో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు వెళ్ళేటపుడు ఓటరు గుర్తింపు కార్డు లేని పక్షంలో ఇతర 18 రకాల గుర్తింపు కార్డులలో ఏదైనా ఒక దానిని తమ వెంట తీసుకెళ్లాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు.

1) ఆధార్ కార్డు
2) జాతీయ గ్రామీణ ఉపాధి హామీ జాబ్ కార్డు
3) ఫోటోతో కూడిన పోస్ట్ ఆఫీస్/ బ్యాంక్ పాస్ బుక్
4) కార్మిక మంత్రిత్వ శాఖ ఇచ్చిన హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్ కార్డు
5) డ్రైవింగ్ లైసెన్స్
6) పాన్ కార్డ్
7) ఫోటోతో కూడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ కుల ధృవీకరణ పత్రాలు
8) ఇండియన్ పాస్పోర్ట్
9) ఫోటోతో కూడిన పెన్షన్ డాక్యుమెంట్
10) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలచే జారీ చేయబడిన ఉద్యోగ గుర్తింపు కార్డు
11) ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ఇచ్చిన అధికారిక గుర్తింపు కార్డు
12) దివ్యాంగుల గుర్తింపు కార్డు
13) పట్టాదార్ పాస్ పుస్తకం
14) రేషన్ కార్డు
15) ఫోటోతో కూడిన ఆయుధ లైసెన్స్ పత్రం
16) ఫ్రీడం ఫైటర్ ఐ.డీ కార్డ్
17) ఆర్జీఐ ద్వారా జారీ చేయబడిన ఎన్.పీ.ఆర్. స్మార్ట్ కార్డు
18) ఏంపీ లకు జారీ చేయబడిన గుర్తింపు కార్డు

పై వాటిలో ఏదైనా ఒక దానిని చూపించి ఓటు వేయవచ్చని కలెక్టర్ అన్నారు. ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పిలుపునిచ్చారు.

# నల్గొండ జిల్లాలో మొదటి విడతన 14 మండలాలలోని 318 గ్రామపంచాయతీలలో ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

## - జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



నల్గొండ జిల్లా బ్యూరో డిసెంబర్ 10(విజన్ ఆంధ్ర): బుధవారం ఆమె నల్గొండ జిల్లా కేంద్రంలోని జూలకంటి ఇంద్రారెడ్డి ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన ఎన్నికల పోలింగ్ సామాగ్రి పంపిణీ, స్వీకరణ (డి ఆర్ సి) కేంద్రాన్ని తనిఖీ చేశారు. మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలలో విధులు నిర్వహించేందుకు సుమారు 7000 మంది సిబ్బందిని నియమించడం జరిగిందని ,ఈ ఎన్నికలలో 5600 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారని తెలిపారు. ప్రతి మండలానికి ఒక డిఆర్సి కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, అంతేకాక ఒక్కో మండలానికి రూట్ అధికారులతో పాటు, ఇద్దరు లేదా ముగ్గురు జోనల్ అధికారులను సైతం నియమించామని ,ఎన్నికల సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు కలెక్టర్ కార్యాలయంలో కాల్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి టి పోల్ లో పోలింగ్ శాతాన్ని నమోదు చేసేందుకు ఏర్పాట్లు చేశామని, పోలింగ్ సిబ్బంది బుధవారం సాయంత్రమే సంబంధిత పోలింగ్ కేంద్రాలకు వెళ్తారని, వారికి అవసరమైన భోజనం, వసతి అన్ని ఏర్పాట్లు చేశామని, అంతేకాక ప్రత్యేకంగా వారికి ఉపయోగపడే బ్రష్,పేస్ట్ వంటివాటితో కిట్ కూడా ఇస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ సిబ్బంది స్టాచ్యుటరీ, నాన్ స్టాచ్యుటరీ మెటీరియల్ ను సరిగా చూసుకోవాలని, ఒకవేళ ఏదైనా మెటీరియల్ సరిపోకపోతే తక్షణమే ఎంపీడీవోను లేదా డిఆర్డిఓను సంప్రదించాలన్నారు. పోలింగ్ నిర్వహణ సమయంలో ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా చూడాలని, పోలింగ్ కేంద్రం నుండి ఎలాంటి పేపర్లు బయటకు వెళ్లకుండా చూసుకోవాలన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రకారం పోలింగ్ ను ప్రారంభించాలని, ఒకసారి ప్రతిపాదించిన ఏజెంట్లను ఎట్టి పరిస్థితులను మార్చవద్దని అన్నారు. టెండర్, ఛాలెంజ్ ఓట్ల విషయంలో పూర్తి జాగ్రత్తగా ఉండాలని, ఏవైనా గొడవలు జరిగేందుకు ఆస్కారం ఉంటే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఎవరికైనా వైద్య పరమైన అత్యవసర పరిస్థితి ఏర్పడితే తక్షణమే పిహెచ్ సి డాక్టర్ కు సమాచారం అందించాలని తెలిపారు. ప్రతి పోలింగ్ టీము వారికి సంబంధించిన రూటు, జోనల్ అధికారుల ఫోన్ నంబర్లు కలిగి ఉండాలని చెప్పారు. ఓటర్లు ఓటు వేసేందుకు ఎన్నికల సంఘం ఆమోదించిన 14 కార్డులలో ఏదో ఒక కార్డును గుర్తింపుగా చూపించి ఓటు హక్కు వినియోగించుకునే విధంగా అనుమతించాలన్నారు. పోలింగ్ ముగిసిన వెంటనే కౌంటింగ్ కు ఏర్పాటు చేయాలని, వెంటనే ఉప సర్పంచ్ ఎన్నిక పూర్తి చేయాలని చెప్పారు.జిల్లా కలెక్టర్ వెంట జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, జెడ్పి సీఈవో శ్రీనివాసరావు, పశుసంవర్ధక శాఖ అధికారి రమేష్ ,తహసిల్దార్ పరుశురాం, ఎంపీడీవో యాకూబ్ తదితరులు ఉన్నారు.

# గ్రామపంచాయతీ ఎన్నికలకు పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు

**- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్**

**- ఇన్సిడెంట్ ఫ్రీగా ఎన్నికలు నిర్వహించాలి**

**- ఎన్నికల విధులు నిర్వర్తించే పోలీసులు అప్రమత్తంగా ఉండాలి.**



నారాయణపేట జిల్లా ప్రతినిధి డిసెంబర్ 10 (విజన్ ఆంధ్ర) : మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా కోస్గి, గుండుమల్, మద్దూర్, కొత్తపల్లి మండలాల్లో ఎన్నికల నిర్వహణను శాంతియుతంగా, పారదర్శకంగా, చట్టబద్ధంగా జరిపేందుకు నారాయణపేట జిల్లా పోలీస్ శాఖ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. మద్దూరు, కొత్త పల్లి మండలలకు గ్రామపంచాయతీ ఎన్నికల బందోబస్తుకు వచ్చిన పోలీసు అధికారులు సిబ్బందికి మద్దూర్ మండలంలోని షా గార్డెన్ ఫంక్షన్ హాల్ లో మరియు కోస్గి, గుండు మాల్ లో బందోబస్తు కు వచ్చిన పోలీసులకు పంచాక్షరి ఫంక్షన్ హాల్ లో ఎస్పీ భద్రత పరమైన సూచనలు చేశారు. పోలీసు ఫోర్స్: ఈ నాలుగు మండలాలకు మొత్తం 650 మంది పోలీసు ఫోర్స్ , 02 TSSP బెటాలియన్స్, CID నుండి వచ్చిన ఫోర్స్ తో బారి బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు. ప్రతి గ్రామంలో భద్రతా చర్యలను మరింత పటిష్టంగా అమలు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని ఈ నాలుగు మండలాల్లో మొత్తం 67 గ్రామ పంచాయతీలు ఉండగా, 12 ఏకగ్రీవం అయ్యావి అని, మిగతా 55 గ్రామపంచాయతీలకు పోలింగ్ నిర్వహణ జరుగుతోందని తెలిపారు. అందులో 13 సమస్యత్మక గ్రామ పంచాయతీలు ఉన్నాయి అని, అందులో 27 సమస్యత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తించబడినట్లు ఎస్పీ పేర్కొన్నారు. సమస్యాత్మక గ్రామపంచాయతీలు పోలింగ్ కేంద్రాల వద్ద ఎక్కువ ఫోర్స్ తో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు . ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... గ్రామపంచాయతీ ఎన్నికలు ఇన్సిడెంట్ ఫ్రీగా నిర్వహించాలని, ఎన్నికల విధుల్లో ఉన్న పోలీసు అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. విధి నిర్వహణలో బాధ్యత రాహితంగా వ్యవహరిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే మద్దూరు, కొత్త పల్లి లో మండలాలకు మొత్తం 18 రూట్లు గా, కోస్గి , గుండు మాల్ మండలలో 15 రుట్లూ గా విభజించి బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రూట్ మొబైల్ ఆఫీసర్లు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తూ ఉండాలని, గ్రామాలలో గుంపులు గుంపులుగా ఉండకుండా చూడాలని, ఓటర్లను ప్రలోభ పెట్టడానికి మద్యం, డబ్బులు పంపిణీ మరియు రాజకీయ పార్టీలు ప్రచారం చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే పోలింగ్ బూత్ దగ్గర విధులు నిర్వర్తించే పోలీసులు అత్యంత అప్రమత్తంగా ఉంటూ పోలింగ్ బూత్ వద్ద క్యూలైన్స్ మైంటైన్ చేయాలని, ఎలాంటి గొడవలు జరుగకుండా శాంతియుతంగా పోలింగ్ జరిగే విధంగా చూడాలని ఆయన తెలిపారు. పోలింగ్ బూత్ నుండి 200 మీటర్ల వరకు ప్రజలు దూరంగా ఉండాలనీ అత్యవసరమైతే వెంటనే సంబంధిత లోకల్ పోలీసులకు, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ కి సమాచారం ఇవ్వాలని అన్నారు. అందరూ శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించే విధంగా కష్టపడి బాగా పనిచేయాలని సూచించారు. ఎన్నిక సమయంలో ప్రతి పోలీసు అధికారి తన డ్యూటీని పూర్తిగా నిబద్ధతతో నిర్వర్తించి, న్యాయబద్ధంగా నిష్పక్షికంగా పనిచేయాలని ఎస్పీ స్పష్టం చేశారు. ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ముందస్తు చర్యలు తీసుకుని శాంతి భద్రతలను కాపాడడం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా, ప్రతి సమస్యాత్మక గ్రామం – పోలింగ్ కేంద్రంలో అదనపు ఫోర్స్‌ను మోహరించి మరింత బలోపేతం చేసినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా ఎవరైనా భంగం కలిగించే ప్రయత్నం చేస్తే ఎవ్వరినీ విడిచిపెట్టమని. అల్లర్లు, భయభ్రాంతులు సృష్టించాలని చూస్తే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవు అని హెచ్చరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను ఎవరైనా దెబ్బతీయాలనే ఉద్దేశంతో చుట్టూ తిరిగే వ్యక్తులు, గుంపులు ఎవరైనా ఉన్నా వెంటనే అరెస్టులు చేసి, కఠినంగా వ్యవహరిస్తాం" అని స్పష్టం చేశారు. ప్రజలు ధైర్యంగా, భయభ్రాంతులు లేకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించాలని, అనుమానాస్పదంగా కనిపించే కార్యకలాపాలను వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు. ఈ శామవేశంలో డీఎస్పీ లు నల్లపు లింగయ్య, మహేష్ లు, సీఐ సైదులు, ఎస్సై లు విజయ్ కుమార్, బాలరాజు, పోలీసు అధికారులు, సిబంది తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పెద్దలకు వణుకు పుట్టిస్తున్న కవిత ప్లాన్లు..



హైదరాబాద్ బ్యూరో చీఫ్, డిసెంబర్ 10 (విజన్ ఆంధ్ర ) : భారత రాష్ట్ర సమితి ఇప్పుడు కవితను చూసి వణికిపోతోంది.ఆమె రాజకీయాలను తట్టుకోలేక ఇక ఘాటు రాజకీయాలకు తెరలేపింది. కవిత కేసీఆర్ కుమార్తె అని తెలుసు. అయినా ఆమెను మాధవరం కృష్ణారావు కుక్కతో పోల్చారు. ఇది చిన్న విషయం కాదు. ఆయన అలా ఘాటుగా మాట్లాడే మనిషి కాదు. మాట్లాడించారని అనుకోవచ్చు. మాధవరం కృష్ణారావు కూడా.. అదే సామాజికవర్గానికి చెందిన వారు. ఎక్కడా తేడా రాకుండా ప్రణాళికా బద్దంగా దాడి చేయించారు. అందులోనే బీఆర్ఎస్ భయం ఏమిటో కూడా బయటపెట్టుకున్నారు. హరీష్‌ను బయటకు పంపడమే కవిత మొదటి లక్ష్యం కవిత రాజకీయంలో భారత రాష్ట్ర సమితికి మొదటి చాలెంజ్ గా మారిన అంశం హరీష్ రావు, కవిత మొదటగా హరీష్ రావును బయటకు పంపాలని ప్రణాళికలు వేసుకున్నారని బీఆర్ఎస్ నేతలు గట్టిగా నమ్ముతున్నారు. మాధవరం కృష్ణారావు కూడా అదే చెప్పారు. ఆమె ఇటీవలి కాలంలో స్పెసిఫిక్ గా హరీష్ రావును టార్గెట్ చేస్తున్నారు. తీవ్రమైన ఆరోపణలతో విరుచుకుపడుతున్నారు. ఆమె మాటల్లో.. హరీష్ రావుపై కేసీఆర్ లో అపనమ్మకం పెంచడమేనన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. హరీష్ రావు వల్ల కేటీఆర్ కూ ముప్పు ఉంటుందని ఆమె హెచ్చరిస్తున్నారు. కవిత..తన దీర్ఘ కాలిక రాజకీయ వ్యూహంలో భాగంగా.. ముందుగా బీఆర్ఎస్ పార్టీ నుంచి కవితను బయటకు పంపాలని అనుకుంటున్నారని నిర్ణయానికి వచ్చారు. అందుకే హరీష్ రావును అందరూ ఏకపక్షంగా సమర్థించే ప్రయత్నం చేస్తున్నారు.. కానీ కవిత ప్రయత్నాలు ఫలించి ఎక్కడైనా హరీష్ పై అపనమ్మకం ఏర్పడినా%ొ%తనను అనుమానంగా చూస్తున్నారని హరీష్ కు అనిపించినా కవిత మొదటి అడుగులో సక్సెస్ అవుతారు. హరీష్‌నుబయటకు పంపేశాక కేటీఆర్‌ను జైలుకు పంపే ప్లాన్ హరీష్ రావును బయటకు పంపేసిన తరవాత కవిత..నెక్స్ట్ కేటీఆర్ పై దృష్టి పెడతారని మాధవరం కృష్ణారావు చెప్పారు. కేటీఆర్ ను జైలుకు పంపాలంటే.. రేవంత్ చేతుల్లో ఉంది. కేట్టీర్ పదే పదే సవాల్ చేస్తున్నా అరెస్టు చేయడం లేదు. అయితే హరీష్ ను బయటకు పంపిన తర్వాత కేటీఆర్ ను జైలుకు పంపించాలన్న ప్రణాళికతో కవిత ఉన్నారని.. ఈ విషయంలో రేవంత్ రెడ్డితో కుమ్మక్కయ్యారని స్వయంగా బీఆర్ఎస్ పెద్దలు నమ్ముతున్నారు. పరిణామాలు అక్కడి వరకూ వస్తాయా లేదా అన్నది చెప్పలేం కానీ..కేటీఆర్ అరెస్టు అనే అంశం మాత్రం నలుగుతోంది. ఆ తర్వాత పార్టీకి క్యాప్చర్ చేయనున్న కవిత హరీష్ రావును బయటకు పంపి.. కేటీఆర్ ను అరెస్టు చేయించిన తర్వాత కవిత అప్పుడు బీఆర్ఎస్ పార్టీని క్యాప్చర్ చేస్తారని .. అదే ఆమె మాస్టర్ ప్లాన్ అని బీఆర్ఎస్ వర్గాలకు స్పష్టమైన అవగాహన వచ్చింది. కేసీఆర్ అనారోగ్యం వల్ల పార్టీని నడిపే పరిస్థితి లేదని .. హరీశ్ రావు లేకుండా..కేటీఆర్ జైలు పాలయిన తర్వాత ఇక కవిత నాయకత్వాన్ని కేటీఆర్ ఇష్టం లేకపోయినా ఆమోదిస్తారని కవిత ప్లాన్ గురించి అనుమానిస్తున్న వారు అనుకుంటున్నారు. ఈ పరిణామం కోసమే ఇంకా జాగృతిని రాజకీయ పార్టీగా ప్రకటించకుండా రాజకీయాలు చేస్తున్నారని చెబుతున్నారు. మాధవరం కృష్ణారావు బయటపెట్టిన కవిత ప్లాన్ లో ఎంత నిజం ఉందో కానీ.. ఇదే చేయడానికి ప్లాన్ చేస్తున్నారని బీఆర్ఎస్ పెద్దలు మాత్రం వణికిపోతున్నారని ఓ క్లారిటీ అయితే వచ్చేస్తుంది.

# భవిష్యత్తుకు తొలిమెట్టు పదవ తరగతి ..

హైదరాబాద్ బ్యూరో చీఫ్, డిసెంబర్ 10 (విజన్ ఆంధ్ర ) : తెలంగాణ పదో తరగతి పబ్లిక్ పరీక్షల టైం టేబుల్ విడుదల ఏ పరీక్ష ఏ తేదీలోనంటే! తెలంగాణలో పదో తరగతి పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు విద్యాశాఖ ప్రకటన చేసింది. ఉదయం 9 గంటల 30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల వరకు పరీక్షలు జరగనున్నాయి. మేరకు రాష్ట్ర విద్యాశాఖ మంగళవారం అధికారిక ప్రకటన చేసింది. మరోవైపు రాష్ట్రంలో ఇంటర్ పరీక్షలు ఫిబ్రవరి 25 నుంచి మార్చి 13 వరకు జరగనున్నాయి. టెన్త్ ఎగ్జామ్స్ టైం టేబుల్ ఈసారి పదవ తరగతి పరీక్షల్లో. వరకు నిర్వహించినున్నారు. సైన్స్ పేపర్ రెండు భాగాలుగా రెండు రోజులు జరగనున్న నేపథ్యంలో ఉదయం 9:30 నుంచి 11 గంటల వరకు సైన్స్ పేపర్ 1, పేప 2 ఎగ్జామ్స్ నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి టైం టేబుల్‌ను ఈ కింద చెక్ చేసుకోండి. పూర్తి టైం టేబుల్ ఇదే..

14 మార్చి 2026 – ఫస్ట్ లాంగ్వేజ్
18 మార్చి 2026 – సెకెండ్ లాంగ్వేజ్
23 మార్చి 2026 – థర్డ్ లాంగ్వేజ్
28 మార్చి 2026 – మాథెమాటిక్స్
02 ఏప్రిల్ 2026 – ఫిజికల్ సైన్స్
07 ఏప్రిల్ 2026 – బయోలాజికల్ సైన్స్
13 ఏప్రిల్ 2026 – సోషల్ స్టడీస్

ప్రతి ఎగ్జామ్ కి దాదాపు నాలుగు రోజుల గ్యాప్ రావడంతో విద్యార్థులకు పండగల ఒత్తిడి ఉండదని అధికారులు చెబుతున్నారు. ఫెస్టివల్ టైమ్ లో ఎక్కువ గ్యాప్ రావడంతో ప్రిపేర్ అవడానికి విద్యార్థులకు సమయం దొరుకుతుందని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలకు గ్రీన్ సిగ్నల్ రావడంతో అధికారికంగా పరీక్షల షెడ్యూల్ విడుదల చేశారు. ఈ మేరకు అన్ని జిల్లాల DEO లకు, స్కూల్ హెడ్ మాస్టర్ లకి విద్యాశాఖ సమాచారం పంపింది పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ లతో కో ఆర్డినేట చేసుకొని జిల్లా విద్యా అధికారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

# పోలింగ్ కేంద్ర్రాలలో కట్టుదిట్టమైన భద్రత చేపట్టాలి

**- జిల్లా ఎస్పీ డి. జానకి**

**- విధులపై పోలీసు అధికారులకు,సిబ్బందికి పలు సూచనలు**



మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లా బ్యూరో డిసెంబర్ 10(విజన్ ఆంధ్ర) : గ్రామపంచాయతీ తొలి విడత ఎన్నికలు పకడ్బందీగా జరిగేందుకు కట్టుదిట్టమైన పోలీస్ భద్రత కల్పించినట్లు జిల్లా ఎస్పీ బీ జానకి వెల్లడించారు. ఈ సందర్భంగా పోలింగ్ సమయంలో విధులు నిర్వహిస్తున్న అధికారులకు సిబ్బంది కి పలు సూచనలు చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి. జానకి బుధవారం స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పంపిణీ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ ఎన్నికల సామగ్రి పంపిణీ, సిబ్బంది హాజరు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా ఎస్పీ అక్కడ పనిచేస్తున్న అధికారులు, సిబ్బందికి పంపిణీ సమయంలో పోలింగ్ రోజున పాటించాల్సిన విధుల గురించి వివరంగా సూచనలు ఇచ్చారు.ఎస్పీ సూచనలు చేశారు. పోలింగ్ రోజున గ్రామాల్లో శాంతి – భద్రతలను కాపాడేందుకు ప్రతి పోలీసు ఉద్యోగి అప్రమత్తంగా ఉండాలి.ప్రజలను ప్రభావితం చేసే ప్రయత్నాలు, గుంపులుగా తిరగడం, గొడవలు వంటి వాటిని వెంటనే అరికట్టాలి.పరిస్థితులను బట్టి సిబ్బంది చురుకుగా, వేగంగా స్పందించాలని సూచించారు. పంపిణీ సమయంలో ఆలస్యం లేకుండా సమయానికి పనిచేయాలని, సామగ్రిని జాగ్రత్తగా చూడాలని చెప్పారు.పోలింగ్ కేంద్రాల వద్ద తటస్థంగా, నిష్పాక్షికంగా ప్రవర్తించాలని గుర్తు చేశారు.ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలింగ్ కేంద్రాల వద్ద క్రమశిక్షణను కట్టుదిట్టంగా నిర్వహించాలి. వృద్ధులు, వికలాంగులు వంటి ప్రత్యేక అవసరాలు ఉన్న ఓటర్లకు సహకారం అందించాలి. పోలింగ్ కేంద్రాల చుట్టూ అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులు కనిపిస్తే వెంటనే చెక్ చేసి నివేదిక ఇవ్వాలి. ఏ చిన్న విషయం వచ్చినా పై అధికారులకు వెంటనే సమాచారం అందించాలిబీ ఆలస్యం చేయకూడదు అని సూచించారు.పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజలు క్యూలో నిలబడే సమయంలో ఎలాంటి గొడవలు జరిగకుండా సిబ్బంది క్రమశిక్షణను కాపాడాలి. పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రతి సిబ్బంది తమ పై అధికారి ఆదేశాలు వచ్చే వరకు విధుల్లో నిష్టగా, శ్రద్ధగా ఉండాలి అని స్పష్టం చేశారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా, సమస్యలేమీ లేకుండా జరగేందుకు పోలీసు శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ భగవంత్ రెడ్డి, CCS ఇన్స్పెక్టర్ పరమేశ్వర్ గౌడ్, రూరల్ సబ్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్, ఇతర అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# 73వ రాజ్యాంగ సవరణ మహిళలకు ఏమిచ్చింది?

హైదరాబాద్ బ్యూరో చీఫ్, డిసెంబర్ 10 (విజన్ ఆంధ్ర ) : ఏడేండ్ల తర్వాత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల నగారా మోగించిన విషయం అందరికీ తెలుసు. డిసెంబర్ పదకొండు నుండి తొలివిడత గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగబోతున్నాయి. మను వాద సంస్కృతిని రుద్దుతున్న నేపథ్యంలో వందల ఏండ్ల మహిళల చైతన్యం అణిచి పెట్టినటువంటి వ్యవస్థను రాజ్యాంగం బద్దలు కొట్టింది. 73వ రాజ్యాంగ సవరణ తర్వాత మహిళలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు వచ్చాయి. కార్పొరేషన్లు, మున్సిపాలిటీ, జీపీ వార్డు మెంబర్ వరకు కూడా మహిళలకు ప్రాతినిధ్యం లభించింది. ఫలితంగా వారిలో అంతులేని చైతన్యం ప్రవేశించింది. ఆ విధంగా పురుషాధిపత్యాన్ని బద్దలు కొట్టడానికి అనేక సందర్భాల్లో ఆ కుర్చీలను (ప్రజాప్రతినిధి బాధ్యతను) కాపాడుతూ ఆ కుర్చీలకు న్యాయం చేయడం కోసం ఇండ్లల్లో గొడవలు, బయట ఘర్షణలు పడ్డారు. ఆఖరికి సారా లాంటి ఉద్యమాన్ని తెలుగు రాష్ట్రాల్లో ప్రవేశపెట్టి బ్రహ్మాండమైన విజయాలు సాధించారు. అంతేకాదు, రాజకీయంగా ఇంట్లోనే నిర్ణయాధికారం లేనటువంటి మహిళలు సమాజంలో ఒక అడుగు ముందుకేసి దాన్ని సాధించారు. గ్రామపంచాయతీల్లో, మున్సిపాలిటీల్లో తమదైన శైలిలో ఒక ముద్రవేశారు. బ్రహ్మాండమైన పరిపాలనతో సత్తాచాటారు. ఒక ఇందిరాగాంధీ లాంటి వారే కాదు, సాధారణ మహిళలు కూడా రాజ్యాలు ఏలగలరని నిరూపించారు. అందుకే ఇవాళ 33 శాతం రిజర్వేషన్‌ను ఉపయోగించుకొని మహిళలు పెద్ద సంఖ్యలో పంచాయతీలకు పోటీ చేస్తున్నారు. గ్రామాల్లో వీరి సేవల్ని బేరీజు వేసుకుని గెలిపించాల్సిన అవసరం ఉన్నది. ఆర్టికల్ 243ని సద్వినియోగం చేసుకుంటూ గ్రామాలు అభివ ద్ధి చెందాలి. ఆ నిబంధనల ప్రకారం రాజ్యాంగం అనేక విస్త త అవకాశాల్ని రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టే బడ్జెట్‌లో నలభై శాతం గ్రామీణ ప్రాంతాలకి కేటాయించాలని రాజ్యాంగం పేర్కొంది. అదే విధంగా ఆ నిధుల్ని గ్రామసభ ద్వారా గ్రామస్తుల అభిప్రాయాలను సేకరించి వాటికి అనుగుణంగా ఎన్నికైనటువంటి గ్రామపంచాయతీలు ఆ గ్రామంలో ఏ కార్యక్రమాన్ని చేపట్టాలి, వంద రోజుల పని కల్పించడమా, బడి లేదా గుడి ఏది అవసరమ నేది అక్కడ నిర్ణయం జరగాలి. ఈ విధానమే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం గ్రామ స్వరాజ్యాలు ఏర్పాటు చేసే క్రమంలో అమలు జరిగింది. ఈ విధానమే జాతిపిత కోరు కున్నది. ఈ విధానమే సుందరయ్య లాంటి మహానుభావులు కలగన్నది. గ్రామ స్వరాజాలు ఏర్పడాలని, గ్రామాలు సుభిక్షంగా వర్ధిల్లాలని, కరువు కాటకాలు ఆత్మహత్యలు లేనటువంటి గ్రామాలుగా తయారు కావాలని, పాడిపంటలు పశుసంపద, రైతు ఆత్మహత్యలు, మహిళల ఆత్మహత్యలు లేనటువంటి ప్రభుత్వాలు రావాలని, యువత శక్తి నిర్వీ ర్యం కానటువంటి పాలన కావాలని కోరుకున్నారు. కానీ ఇవాళ సమాజంలో అది జరగడం లేదు. నిధులు మొత్తం స్థానికంగా వున్న అభిప్రాయాలకు భిన్నంగా ఎమ్మెల్యేల చేతుల్లోకి వెళ్లడం వల్ల, వారు ఇష్టమైన వారికి కాంట్రాక్టులు ఇచ్చి సగం నిధులను మింగేస్తూ సగం మాత్రమే ప్రజల కోసం ఖర్చుపెట్టినటువంటి పరిస్థితి ఉన్నది. అందులో కూడా లోకల్ కాంట్రాక్టర్లు వారి వారి భజనపరులు మింగే స్తున్నటువంటి దుస్థితి. ఆ కారణంగా గ్రామాల్లో అభివ ద్ధి చాలా కుంటుపడిందన్నది వాస్తవం. ఏడున్నర దశాబ్దాలుగా గ్రామ స్వరాజ్యాలు 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్నట్టుగా అభివ ద్ధి గురించి ఇంకా మాట్లాడుకుంటుంటే, ఇవాళ భారతదేశంలోనే కేరళ ఒక గొప్ప విజయాన్ని సాధించింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎన్నో ప్రభుత్వాలు వచ్చాయి. పేదరికాన్ని అరికట్టడంలో మాత్రం ఏ సర్కారూ విజయం సాధించలేక పోయింది. కానీ ఇవాళ దేవభూమిగా పేరుగాంచినటువంటి ఒక కమ్యూనిస్టు పరిపాలనలో కొనసాగుతున్న కేరళ రాష్ట్ర ప్రభుత్వం దీన్ని అరికట్టగలిగింది. ఇది దేశానికే గర్వకారణం. 2021లో నిటిఆయోగ్ ప్రకటించిన లెక్కల ప్రకారం భారతదేశంలో సగటు పేదరికం రేటు 14.96శాతం కాగా అది కేరళలో 0.7 ఒక శాతం, బీహార్‌లో 23.9 శాతం ఉండగా జార?ండ్‌లో 18.18, యూపీలో 11.5 గా ఉంది. అయితే 2025 నవంబర్ నాటికి కేరళ రాష్ట్రం అత్యంత పేదరికం లేని రాష్ట్రంగా తన 65 వేల పేదరిక కుటుంబాలను కూడా దారిద్ర్యం నుంచి బయటపడేసి పేదరికం లేని రాష్ట్రంగా ప్రకటించింది. అంటే అది ఏ పరిపాలన వల్ల సాధ్యమైంది అనేది ప్రజలు గమనించాలి. ఆ విధంగా కేరళ అభివ ద్ధిని చూసి గాని లేదా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మానికొండ సూర్యవతి మండల పరిధిలో మహిళకు మరుగుదొడ్లు నిర్మించిన చరిత్ర గురించి మనకు తెలుసు. అలాగే వాజేడు మండలంలో ఎక్కడో మారుమూల ప్రాంతంలో బొన్నమడి అనేటువంటి అరవై ఏండ్ల గిరిజన మహిళ మద్యం లేని గ్రామాన్ని నిర్మించింది. ప్రగతి నగర్ ప్లాస్టిక్ లేని మద్యం లేని గ్రామంగా అవార్డు అందుకుంది. వరంగల్ జిల్లాలోని గంగదేవిపల్లి పంచాయతీ అరవై దేశాల సందర్శనకు వేదికగా నిలిచింది. ఖానాపురంహవేలి, భద్రాచలం మహిళలపై లైంగికదాడుల సంఖ్య తగ్గించారు. మన సర్పంచి, వార్డు మెంబర్ల గెలుపువల్ల మొత్తంగా ఉమ్మడి ఏపీలోనూ ఇవాళ తెలంగాణ లోనూ మార్క్సిస్టు పార్టీ బలపరిచిన అభ్యర్థులు గెలుపువల్ల అవినీతి లేని ప్రజాభివ ద్ధి జరిగిందని గర్వంగా చెప్పగలం. ఈ గ్రామాలన్నీ కూడా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో మహిళలు పరిపాలించినటువంటి గ్రామాలు, మండలాలు. నేడు ఎన్నికలు రాజకీయ గుర్తుల మీద జరగకపోయినప్పటికీ ప్రతి పంచాయతీలో ఏదో ఒక రాజకీయ పార్టీ తమ మద్దతుతో అభ్యర్థులను నిలబెడుతున్నది. వార్డు మెంబరు దగ్గర నుండి ఇది జరుగుతున్నది. గనుక ఓటు వేసేటపుడు ఏ రాజకీయ పార్టీ విధానమేమిటి? ఎటువంటి అభ్యర్థిని బలపరుస్తున్నది? అనేదాన్ని చూసుకునే ప్రజలు ఓటు వేయాల్సిన అవసరమున్నది. మనకేమో సబ్సిడీలు, పెన్షన్ల ఆశలు చూపెట్టి వచ్చినటువంటి వంద రోజుల పనికోసం కేటాయించినటువంటి వేలాది కోట్ల రూపాయల బడ్జెట్‌ని పందికొక్కులు మెక్కినట్టు మెక్కుతున్నటువంటి పరిస్థితి దేశంలో ఉన్నది. అటువంటి రాజకీయ పార్టీలు సపోర్ట్ చేస్తున్న వారికి ఓటు వేద్దామా? నీతి నిజాయితీతో దేశంలోనే ఆదర్శవంతమైనటువంటి పరిపాలన అందించే కమ్యూనిస్టులు బలపరిచినటువంటి అభ్యర్థులకు ఓటేద్దామా? నిర్ణయం మీ చేతుల్లోనే ఉంది.

## మొదటి విడత జరిగే 7 మండలాల్లోని గ్రామ పంచాయతీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

**- జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్**



జగిత్యాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 10 ( విజన్ ఆంధ్ర ) : బుధవారం రోజున మేడిపల్లి, కథలాపూర్, మల్లాపూర్ మరియు ఇబ్రహీంపట్నం మండలాల్లో ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీ ఎన్నికల డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు, సిబ్బంది పంపిణీ, లాజిస్టిక్స్ ఎన్నికల మెటీరియల్సును తనిఖీ చేశారు. ఈ పరిశీలనలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత, అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) బి. రాజ గౌడ్, జెడ్పీ సీఈవో గౌతంరెడ్డి, కోరుట్ల – మెట్పల్లి ఆర్డీవోలు జివాకర్ రెడ్డి, శ్రీనివాస్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కన్నం హరిణి, ఎంపీడీవోలు, ఎమ్మార్వోలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల బందోబస్తు విధులలో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలి..



సూర్యాపేట డిసెంబర్ 10:(విజన్ ఆంధ్ర) : డిసెంబర్ 11 న జిల్లాలో జరగనున్న మొదటి దశ ఎన్నికల సందర్భంగా జిల్లా ఎస్పీ నరసింహ సూర్యాపేట మండల పరిధి ఎన్నికల్లో విధులు నిర్వర్తించనున్న సిబ్బందికి పట్టణంలోని సూర్యాపేట పంక్షన్ హాల్ నందు విధులు నిర్వహణపై సలహాలు, సూచనలు ఇవ్వడం జరిగింది ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతలను కాపాడడంలో పోలీస్ సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని ఎస్పీ తెలిపినారు. బందోబస్తు విధులలో పాల్గొనే ప్రతి ఒక్కరూ ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా, పూర్తి అంకితభావం, క్రమశిక్షణతో తమ బాధ్యతలను నిర్వహించాలని స్పష్టం చేశారు. విధులు పూర్తయ్యే వరకు కేటాయించిన విధులు, ప్రాంతాలు వదలవద్దు అన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లను క్రమపద్ధతిలో ఉంచాలి, అనుమతిలేని వ్యక్తులను ఓటరు కానీ వారిని పరిసరాల్లో రానివ్వొద్దు, 100 మీటర్ల పరిధిలో ఆంక్షలు పటిష్టంగా అమలు చేయాలి అన్నారు. ఓటర్లు సెల్ ఫోన్స్, ఎలక్ట్రానిక్ వస్తులు ఏమనా వెంట తెస్తున్నారా అనేదానిపై నిఘా ఉంచాలి అన్నారు.ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది ఎన్నికల కోడ్ (ఎంసీసీ) నియమాలను ఖచ్చితంగా పాటిస్తూ, ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యేవరకు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. విధుల నిర్వహణలో సిబ్బందికి ఏవైనా ఇబ్బందులు లేదా ఆకస్మిక సమస్యలు ఎదురైతే, వాటిని వెంటనే ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, వ్యక్తిగతంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల భద్రత అనేది ఒక సమష్టి బాధ్యత అని, దీనిని విజయవంతం చేయడంలో సిబ్బంది పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు.

## మొదటి విడత సర్పంచ్ ఎన్నికలకు భద్రత ఏర్పాట్లు పూర్తి

**- ఎన్నికలు నిర్వహణకు 843 మంది పోలీస్ లతో పటిష్ట బందోబస్తు**

**- జిల్లా ఎస్ పి అశోక్ కుమార్**



జగిత్యాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 10 ( విజన్ ఆంధ్ర ) : జిల్లాలో జరుగుతున్న మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు జిల్లా పోలీసు శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు జిల్లా ఎస్ పి అశోక్ కుమార్ అన్నారు. బీమారం ,కోరుట్ల,మెట్ పల్లి లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ లను అదనపు ఎస్పీ తో కలిసి సందర్శించారు. ఈ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుండి ఆయా ప్రాంతాలకు ఎన్నికల సామగ్రి ని పటిష్ట పోలీస్ బందోబస్త్ మధ్య తరలించడం జరిగిందని ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూటు మొబైల్స్ ను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా ఎస్ పి మాట్లాడుతూ గతంలో జరిగిన ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు నిర్వహించడం జరిగిందని అదే స్ఫూర్తితో సర్పంచ్ ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా నిర్వహిస్తామని అన్నారు. మొదటి విడతకి సంబంధించి 1172 పోలింగ్ కేంద్రాల లో పోలింగ్ జరుగుతుంది అని దీనికి సంబంధించి (843) మంది పోలీసు సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు అని అన్నారు. పటిష్ట ఎస్కార్ట్ తో పోలింగ్ సామాగ్రిని పోలింగ్ కేంద్రాలకు తరలించడం జరుగుతుంది (46) రూట్స్ లలో సిబ్బంది అప్రమత్తంగా ఉంటారని, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ , స్ట్రైకింగ్ ఫోర్స్ టీమ్స్, ఎస్.ఐ లతో పెట్రోలింగ్ టీమ్స్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఎన్నికలలో పోలీసుల విధి విధానాలపై పోలీస్ అదికారులకు ,సిబ్బందికి దిశానిర్దేశం చేశామని, పౌరుల స్వేచ్ఛకు భంగం కలగకుండా ప్రలోభాలకు తావు లేకుండా ప్రతి ఓటరు తమ ఓటు ను స్వేచ్ఛగా వినియోగించుకునే ఏర్పాట్లు చేయడం జరిగిందని అన్నారు . ఓటర్లు ఎవ్వరూ కూడా సెల్ ఫోన్ లు, మందుగుండు సామాగ్రి, ఇంక్ బాటిల్స్, వాటర్ బాటిల్స్, పోలింగ్ బూతు లోనికి తీసుకువెళ్లారాదని, సెల్ఫీలు దిగడం నిషేదం అన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేఖ కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఎన్నికల సంఘంచే జారీ చేయబడిన నియమాలను పక్కగా అమలు చేస్తామన్నారు. ఎస్ పి వెంట అడిషనల్ ఎస్పీ శేషాద్రిని రెడ్డి , డిఎస్పీలు వెంకటరమణ,రాములు, సి.ఐలు ,ఆర్.ఐ లు, ఎస్.ఐ లు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## ఆశీర్వదించండి అభివృద్ధి చేసి చూపిస్తా

**- తోగాపూర్ గ్రామ సర్పంచ్ అభ్యర్థి బోయిని శ్రీనివాస్**



మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లా బ్యూరో డిసెంబర్ 10(విజన్ ఆంధ్ర) : పంచాయతీ ఎన్నికల్లో తోగాపూర్ సర్పంచ్ గా గెలిపిస్తే కోస్గి మండలంలో తోగాపూర్ గ్రామాన్ని ఆదర్శంగా చేస్తానని సర్పంచ్ అభ్యర్థి బోయిని శ్రీనివాస్ ప్రజలకు హామీనిస్తున్నారు. కోస్గి మండలం తోగాపూర్ గ్రామ పంచాయతీని అన్ని విధాల అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామపంచాయతీగా తీ ర్చిదిద్దుతానని తోగాపూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి బో యిని శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం గ్రామంలో పెద్ద ఎత్తున మహి ళలు, గ్రామస్థులతో కలిసి ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వ హించారు.గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి, వీధి దీపాల సమస్యలతో పాటు మౌళిక వసతుల కల్పనకు కృషి చేసి గ్రామాన్ని సర్వసుందరంగా మారుస్తానని హామీ నిచ్చారు. విద్యా, వైద్యంతో పాటు దేవాలయాలను అభివృద్ధి చేస్తానని అన్నారు. గ్రామంలోని యువతకు ఉద్యోగ ఉపాధి క ల్పనకు ప్రత్యేకమైన శ్రద్ధ వహిస్తానని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పిం చి వారి కలను నెరవేరుస్తానని హామీ నిచ్చారు. అన్ని వర్గాల ప్రజలకు కమ్యూనిటీ హాల్ నిర్మిం చేందుకు కృషి చేస్తానని అన్నారు. గ్రామంలో పోస్ట్ ఆఫీస్ మంజూరుతో పాటు సీసీ కెమెరాలను ఏర్పాటుతో పాటు. క్రీడాభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తానని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకా లు అర్హులైన ప్రతి పేదవారికి అందే విధంగా కృషి చేస్తానని అన్నారు. అనునిత్యం ప్రజలకు అందు బాటులో ఉండి సేవలందిస్తానని అన్నారు.గ్రామ ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా క్షణాల్లో వాలిపోతానని హామీ నిచ్చారు. ఈ నెల 11న జరిగే గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఉంగరం గుర్తు కు మీ అమూల్యమైన ఓటు వేసి భారీ మెజార్టీతో గెలుపిస్తారని ఆశించారు.

## ఈనెల 20 నుంచి హజ్రత్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్ షా ఉర్సు వేడుకలు

**- 21న గంధోత్సవ వేడుకలు**

**- పోస్టర్లను ఆవిష్కరించిన మత పెద్దలు**



మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లా బ్యూరో డిసెంబర్ 10(విజన్ ఆంధ్ర) : జిల్లా కేంద్రంలోని హజ్రత్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్ షా రహమతుల్లా అలై 87వ ఉర్సు వేడుకలు ఈనెల 20వ తేదీన ప్రారంభకానున్నట్లు ముతవల్లీ మహ్మద్ అబ్దుల్ జమీర్ ఖాద్రీ వెల్లడించారు. బుధవారం దర్గా సమీపంలోని మజీద్ లో ఉర్సు వేడుకల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. 20వ తేదీన గుస్లేషరీఫ్ (జలాభిషేకం) ఉంటుందని తెలిపారు. 21న ఉర్సు వేడుకల్లో ప్రధాన పట్టమైన గంధోత్సవ వేడుకలను నిర్వహిస్తామని తెలిపారు. ముతవల్లీ దర్గా నుంచి సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే గంధోత్సవ ఊరేగింపు ప్రధాన వీధుల గుండా దర్గా వరకు చేరుకుంటుందని తెలిపారు. అనంతరం దర్గాలో చాదర్లు, పూలు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తామని తెలిపారు. 22వ తేదీన సాయంత్రం దీపారాధన వేడుకలు ఉంటాయని, 23న ఉదయం ఫాతేహా నిర్వహిస్తామని తెలిపారు. ఈ వేడుకల్లో జాహేద్ అలీ వారిసి, వాహేద్ నియాజి ఖవ్వాలి ఆలపిస్తారని తెలిపారు. ఉర్సు వేడుకల్లో మత పెద్దలు హజ్రత్ సయ్యద్ పీర్ హుస్సేని తాహేర్ ఖాద్రీ, హజ్రత్ సయ్యద్ హయతుల్లా బాద్షా ఖాద్రీ, హజ్రత్ సయ్యద్ అజీజుల్లా ఖాద్రీ, మౌలానా అహ్మద్ నక్షబంది. మౌలానా రిజ్వాన్ పాష ఖాద్రీ , మౌలానా మొహసిన్ పాష ఖాద్రీ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఆల్ఇండియా సున్ని ఉల్మా మషాయక్ బోర్డు ప్రధాన కార్యదర్శి మొహసిన్ పాష ఖాద్రీ, మౌలానా ఖాజా ఫైజొద్దీన్, అబ్దుర్ నసీర్, ఎండి.అన్వర్ పాష, ఎండి. ఖాజ మొయినొద్దీన్, జాఫర్, ఎండి. ఖదీర్, ఎండి. ఖాదర్, ఖాలీద్, అహ్మద్, ఉస్మాన్ ఖాద్రి, షోయబ్, కింగ్ షోటోకాన్ ఫౌండర్ కరాటే మాస్టర్ జహంగీర్ పాష ఖాద్రీ, ఎండి.హాజి, రఫీక్, అయూబ్ అలీ, నవాజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి దశలోనూ జాగ్రత్తలు పాటిస్తూ ఎలాంటి లోపాలు లేకుండా ఎన్నికలు నిర్వహించాలి

**- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**



నల్గొండ జిల్లా బ్యూరో డిసెంబర్ 10(విజన్ ఆంధ్ర): బుధవారం ఆమె గ్రామపంచాయతీ ఎన్నికల సాధారణ పరిశీలకురాలు, ఐఏఎస్ అధికారి కొర్ర లక్ష్మి తో కలిసి నార్కట్పల్లి మండల కేంద్రంలోని శబరి ఫంక్షన్ హాల్లో ఏర్పాటుచేసిన గ్రామపంచాయతీ ఎన్నికల డిస్ట్రిబ్యూట్ ,రిసెప్షన్ కేంద్రాన్నిపరిశీలించారు.ఎన్నికల సామ్రాగ్రి పంపిణీ బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలు, స్టేషనరీ కిట్లు, పోలింగ్ సిబ్బంది నమోదు ,సామ్రాగ్రి పంపిణీ ,భద్రత చర్యలు, ట్రాన్స్పోర్ట్ ,కమ్యూనికేషన్ సదుపాయాలు తదితర అంశాలను ఎన్నికల పరిశీలకురాలు, జిల్లా పరిశీలించారు.బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, స్టేషనర్ కిట్లు జాగ్రత్తగా చెక్ చేసుకుని ఒకటికి రెండుసార్లు చూసుకొని, గందరగోళం లేకుండా ఎలాంటి సమస్యలు రాకుండా చెక్ చేసుకోవాలని పోలింగ్ సిబ్బందికి సూచించారు. హెల్ప్ డేస్కులు మరింత అందుబాటులో ఉండాలని, వాహనాలను,రూట్ మ్యాప్ అన్ని ముందుగానే సిద్ధంగా ఉంచుకోవాలని, ఎక్కడైనా రహదారి సమస్యలు ఉంటే వెంటనే ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. గ్రామపంచాయతీ ఎన్నికల పరిస్థితిని ఎప్పటికప్పుడు సీసీటీవీ ల ద్వారా 24 గంటలు పర్యవేక్షణ చేయాలని, వాహనాలు కదలికలు, ఆలస్యం లేకుండా ట్రాన్స్పోర్ట్ ప్లానింగ్ ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో అపరిచిత వ్యక్తుల కనిపిస్తే అదుపులోకి తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా పోలీసులు భద్రత కల్పించాలన్నారు.పోలింగ్ బూతులో ఏజెంట్ల ఆధ్వర్యంలో మాక్ పోలింగ్ నిర్వహించాలని, తర్వాత ఓటింగ్ ప్రారంభించాలని చెప్పారు.ఉదయం 7 గంటల నుంచి ఒంటిగంట వరకు ఓటింగ్ విధానం కొనసాగుతుందని ఒంటిగంటలోపు 100 మీటర్ల పరిధిలో ఓటు వేయడానికి వచ్చిన వారికి టోకెన్ జారీచేసి ఓటు వేసే విధంగా చూడాలన్నారు.కౌంటింగ్ కు ముందుగా వార్డు మెంబర్స్ కౌంట్ చేసిన తర్వాత సర్పంచి బ్యాలెట్ పేపర్ లెక్కించాలని,25 ఓట్లను ఒక బండిల్స్ చేసి ఓట్లు లెక్కింపు చేయాలన్నారు. లెక్కించిన ఓట్ల శాతాన్ని ప్రతి రెండు గంటలకు ఒకసారి టీ– పోల్లో అప్లోడ్ చేయాలన్నారు.ప్రతి ఓటరు తన ఓటు హక్కు వినియోగించినందుకు యంత్రాంగం నిష్పక్షపాతంగా పనిచేయాలని, ప్రతి అధికారి తన బాధ్యత నిబద్ధతగా నిర్వహిస్తే ఎన్నికలు సజావుగా సాగుతాయని అన్నారు. జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, జడ్పీ సీఈవో శ్రీనివాసరావు, నల్గొండ ఆర్డీవో వై. అశోక్ రెడ్డి ,తహసిల్దార్ వెంకటేష్ ఎంపీడీవో ఉమేష్ ,తదితరులు ఉన్నారు.

## ఎన్నికలను ప్రశాంత వాతావరణలో నిస్పక్షపాత నిర్వహణే లక్ష్యంగా పని చేయాలి


**- విజయోత్సవ ఊరేగింపులు, ర్యాలీలకు అనుమతి లేదు**

**- జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్**



నల్గొండ జిల్లా బ్యూరో డిసెంబర్ 10(విజన్ ఆంధ్ర): జిల్లాలో రేపు 11వ తేదీన మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల జరగనున్న నేపథ్యం లో ప్రజలు ప్రశాంత వాతావరణంలో, నిస్పక్షపాతంగా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా పోలీస్ అధికారులు,సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా యస్పి అన్నారు.ఎన్నికల విధులు నిర్వహించే పోలీసు అధికారులు,సిబ్బంది అందరూ ఎన్నికల సంఘం నియంత్రణ,పర్యవేక్షణ మరియు క్రమశిక్షణకు లోబడి పని చేయాలని సూచించారు. ఎలక్షన్స్ సమయంలో పోలీసు అధికారులు ఎలక్షన్ రోజు,ఎలక్షన్ తర్వాత కౌంటింగ్ పూర్తి అయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాల పై పూర్తిగా అవగాహన కలిగి ఉండి, పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ రోజు, పోలింగ్ కేంద్రాల దగ్గరా పాటించాల్సిన నియమాలను తెలియజేశారు. పోలీస్ అధికారులు ఎలక్షన్ సమయంలో సమస్యలు సృష్టించే వారి పై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.పోలింగ్ రోజు పోలింగ్ స్టేషన్ల దగ్గర 163 (బి.యన్.ఎస్.ఎస్)యాక్ట్ అమల్లో ఉంటుందని, పోలింగ్ కేంద్రాల 100 మీటర్ల లోపల ఎవ్వరినీ రానివ్వకూడదని ఓటు హక్కు వినియోగించుకోనే వారు పోలింగ్ కేంద్రాల కు ఎట్టి పరిస్థితిలో సెల్ ఫోన్లు, ఇంక్ బాటిల్స్,ఇతర హాని కలిగించే వస్తువులు తీసుకురాకుండా జాగ్రత్తగా తనిఖీ చేయాలని అన్నారు.ఏదైనా సమస్య వస్తె వెంటనే సంబంధిత అధికారులు సమాచారం అందించాలని అన్నారు.ఎన్నికల రోజు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న మొబైల్ రూట్ లలో ఏదైనా ఇన్సిడెంట్ జరిగితే క్షణాలలో రూట్ మొబైల్ టీమ్ లు అక్కడకు చేరుకొని సమస్యను పరిష్కరించగలగాలి అని అందుకు లోకల్ ఎస్సై, రూట్ మొబైల్ ఇంచార్జి అధికారి కమ్యూనికేషన్ లో ఉంటూ కో ఆర్డినేషన్ చేసుకోవాలని తెలియజేశారు.అదేవిధంగా ఆయా పోలీస్ స్టేషన్ పరిదిలో ఉన్న మొబైల్ రూట్ లను, వాటి పరిధిలో కి వచ్చే గ్రామాలు, క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వివరాలను, ఆక్కడ నియమించిన పోలీస్ అధికారుల వివరాలను పరిశీలించి ఆయా రూట్ లలో క్రిటికల్ పోలింగ్ కేంద్రాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తల పై పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు.ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులు విజయోత్సవ ఊరేగింపు, ర్యాలీలకు అనుమతి లేదని ఈ సందర్భంగా తెలియజేసారు.

## సత్తుపల్లికి శ్రీ చిన్న జీయర్ స్వామి రాక



సత్తుపల్లి , డిసెంబర్ 10 ,(విజన్ ఆంధ్ర) : "మాధవ సేవగా సర్వ ప్రాణి సేవ" అనే మహోన్నత ఆశయంతో, శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి వారు ఈ నెల 13వ తేదీన సత్తుపల్లికి విచ్చేయనున్నారు. కార్యక్రమ వివరాలు: ?తేదీ: ఈ నెల 13వ తేదీ. వేదిక: సత్తుపల్లి, జీవీ మాల్ వెనుక నూతనంగా నిర్మిస్తున్న సమగ్ర షాపింగ్ కాంప్లెక్స్. విశేషం: చిన్న జీయర్ స్వామి వారి దివ్య హస్తాలతో మరియు వారి శిష్య బృందం ఆధ్వర్యంలో "శ్రీనివాస కళ్యాణం" అంగరంగ వైభవంగా జరగనుంది. ఈ కార్యక్రమం గురించి ప్రముఖ ఆధ్యాత్మికవేత్త శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల రామకృష్ణమాచార్య స్వామి మాట్లాడుతూ, సత్తుపల్లి మరియు పరిసర ప్రాంత భక్తులందరూ ఈ కళ్యాణ మహోత్సవంలో పాల్గొనాలని కోరారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై, స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి, వారి కృపకు పాత్రులు కాగలరని మనవి చేశారు. ఈ కార్యక్రమంలో బోనగిరి చెన్నారావు ఇదుపులపాటి సాంబశివరావు అడపా ముత్యాలరావు తొంటెపు సురేష్ ఇదుపులపాటి రామకృష్ణ ఇదుపులపాటి శివప్రసాద్ ఎస్ కే బాబా మొరిశెట్టి సాంబశివగుప్త బోనగిరి కృష్ణారావు బోనగిరి రాఘవ తదితరులు పాల్గొన్నారు.

## బోడుప్పల్ లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ బోమ్మక్ కళ్యాణ్ కుమార్



బోడుప్పల్,డిసెంబర్ 10(విజన్ ఆంధ్ర) : బోడుప్పల్ సర్కిల్ పరిధిలో 12వ డివిజన్ లోని వివిధ కాలనీలలో బుదవారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు శుభారంభంగా భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బోమ్మక్ కళ్యాణ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని పూజ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.ఈ సందర్భంగా స్థానిక ప్రజలు మాజీ కార్పోరేటర్ కు దన్యవాధాలు తెలిపారు.ఈ మేరకు ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు గృహాల కల నెరవేర్చడంలో ఇందిరమ్మ హౌసింగ్ పథకం కీలక పాత్ర పోషిస్తుందని, పనులు వేగవంతంగా, నాణ్యతతో జరగాలని అధికారులు కట్టుబడి పనిచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ నగర్ ఫేజ్-2 కాలనీ అధ్యక్షుడునరేందర్ ,ప్రధాన కార్యదర్శి నరేష్,ఇందిరమ్మ కమిటీ సభ్యుడు రాహూల్,సత్యం చారి,ఉదయ్, కనకయ్య,శ్రీనివాస్,భీం,వార్డు సూపర్వైజర్ శంకర్ కాలనీవాసులు పాల్గోన్నారు.

## పంచాయతీ ఎన్నికలకు పటిష్టమైన బందోబస్తు

**- అడిషనల్ డీసీపీ లా & అర్డర్**




గురువారం జరగనున్న మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకొని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఖచ్చితమైన ప్రణాళికతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు అడిషనల్ డీసీపీ లా & అర్డర్ ప్రసాద్ రావు తెలిపారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు కొణిజర్ల, వైరా మండలాల గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ బందోబస్తు, రూట్ మొబైల్ బందోబస్త్, పోలింగ్ స్టేషన్ బందోబస్త్ సిబ్బంది యొక్క విధివిధానాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ముందస్తు భద్రత ఏర్పాట్లతో ఏ చిన్న సంఘటనకు అస్కారం లేకుండా ఏర్పాటు చేసిన బందోబస్త్ నేపథ్యంలో పోలీస్ సిబ్బందికి అప్పగించిన భాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికల పర్యవేక్షణ అధికారుల సమన్వయంతో ప్రశాంతంగా ఎన్నికల బందోబస్త్ ను విజయవంతం చేయాలని సూచించారు. శాంతి భద్రతల దృశ్య ఎన్నికల ఫలితాలు వెల్లడించిన అనంతరం ఎలాంటి విజయోత్సవ ర్యాలీలకు అనుమతులు లేదని అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ని ప్రతి ఒక్కరూఖచ్చితంగా పాటించాలని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు. గ్రామాలలో ఏదైనా ఘర్షణ వాతావరణం ఉంటే సంబంధిత పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (ఏఆర్) కుమారస్వామి సిఐ వెంకట ప్రసాద్ పాల్గొన్నారు.

## మీ ఇంటి ఆడబిడ్డకి - ఒక్క అవకాశం ఇవ్వండి..

**- పోలేబోయిన సుజాత..**



ఖమ్మం డిసెంబర్ 10 ( విజన్ ఆంధ్ర ) : ప్రియమైన కరకగూడెం గ్రామపంచాయతీ ప్రజలారా జరగబోయే స్థానిక గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా, గ్రామ అభివృద్ధికి మీరు అండగా నిలవాలని విజ్ఞప్తి చేస్తూ, కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి పోలేబోయిన సుజాత గారికి గ్రామానికి సేవ చేసే అవకాశం ఇస్తారని, మా పక్షం నుంచి గ్రామ అభివృద్ధి, శుభ్రత,నీటి సమస్యలు, ప్రజా ప్రభుత్వం ఇస్తున్న పథకాల అమలులో సంపూర్ణ నిబద్ధతతో పని చేస్తామని హామీ ఇస్తున్నాము.. ప్రతి ఇంటి సమస్య మాది – ప్రతి కుటుంబ అభివృద్ధి మా లక్ష్యం.. మీ ఇంటి ఆడబిడ్డకి గ్రామ భవిష్యత్తుకు న్యాయం చేసి చూపించే అవకాశం ఇస్తారని కోరుతూ, ఉంగరం గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించండి.

## ఎలాంటి ఇబ్బందులకు అవకాశం ఇవ్వకుండా మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు.



నల్గొండ జిల్లా బ్యూరో డిసెంబర్ 10(విజన్ ఆంధ్ర): బుధవారం ఆమె గట్టుప్పల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎన్నికల పంపిణీ, స్వీకరణ కేంద్రాన్ని తనిఖీ చేశారు.ఎన్నికల సామాగ్రి పంపిణీకై ఆయా రూట్ల వారిగా ఏర్పాటు చేసిన టబుళ్ళు, స్టాచ్యుటరి, నాన్ స్టాట్యూచరి పేపర్లు, ఓటరు కంపార్ట్మెంట్ మెటీరియల్, ఇండెలిబుల్ ఇంక్, ఇతర సామాగ్రిని పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డీ.ఆర్ సీ అధికారులకు పలు సూచనలు చేస్తూ పిఒలు డైరీ జాగ్రత్తగా రాసేలా తెలియజేయాలని, అదేవిధంగా పోస్టల్ బ్యాలెట్, చాలెంజ్ ఓట్ల విషయంపై ఇబ్బందులు లేకుండా జాగ్రత్త తీసుకోవాలని సూచించాలన్నారు. పోలింగ్ శాతాన్ని ప్రతి రెండు గంటలకు ఒకసారి టీ –పోల్ లో ఎలాంటి తప్పులు లేకుండా అప్లోడ్ చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులతో ముందే సమన్వయం చేసుకోవాలని, ఎక్కడైనా సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, జెడ్పిసిఈఓ శ్రీనివాసరావు, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, చండూరు ఆర్డీవో శ్రీదేవి ,తదితరులు ఉన్నారు.

# ఎన్నికల విధులకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు

**- జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 10 ( విజన్ ఆంధ్ర ) : జిల్లాలో జరగబోయే మొదటి దశ ఎన్నికల సందర్భంగా శాంతి భద్రతలను పర్యవేక్షించడానికి, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడడానికి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల బందోబస్తు ఏర్పాట్లను సమీక్షించిన అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, పౌరులందరూ ఎటువంటి భయం లేకుండా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. జిల్లాలో రౌడీ షీటర్లు, సస్పెక్ట్‌లు, ట్రబుల్ మంగర్‌లందరినీ ఇప్పటికే బైండోవర్ చేయడం జరిగిందని అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా, లైసెన్స్ పొందిన తుపాకులు, ఇతర ఆయుధాలను పోలీస్ స్టేషన్లలో డిపాజిట్ చేసుకునే ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశామన్నారు. ఎన్నికల విధులలో పాల్గొనే ఉద్యోగులకు, ప్రభుత్వ ఆస్తులకు, సాధారణ ప్రజలకు ఎవరైనా ఇబ్బందులు కలిగించినా, భయభ్రాంతులకు గురిచేసినా, చట్టప్రకారం కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ హెచ్చరించారు. అంతేకాకుండా, ఎన్నికలలో అలజడులు సృష్టించాలని ప్రయత్నం చేసినా, సామాజిక మాధ్యమాలలో (సోషల్ మీడియా) తప్పుడు లేదా విద్వేషపూరిత ప్రచారాలు చేసినా, అటువంటి వారిపై కేసులు నమోదు చేసి, అవసరమైతే రౌడీ షీట్ ఓపెన్ చేస్తామని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలని, పోలింగ్ బూత్‌లోకి ఎట్టి పరిస్థితుల్లోనూ సెల్ ఫోన్‌లు, కెమెరాలు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకెళ్లడం, వాటితో ఫోటోలు, వీడియోలు చిత్రీకరించడం పూర్తిగా నిషేధం అని తెలిపారు. ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కూడా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజలు ఎటువంటి అనుమానాలు, ఇబ్బందులు లేకుండా ఎన్నికల ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని, శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు పోలీస్ అధికారులకు సంపూర్ణంగా సహకరించాలని ఎస్పీ స్నేహ మెహ్రా తెలిపారు. ఎక్కడైనా అలజడులు, అవాంఛనీయ సంఘటనలు సృష్టించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు గమనిస్తే, వెంటనే తమ పరిధిలోని పోలీస్ అధికారులకు, కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలని ఎస్పీ కోరారు.

## తాత్కాలిక పద్ధతిన పని చేయుటకు దరఖాస్తులు చేసుకోవాలి.

**- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్**

ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 10( విజన్ ఆంధ్ర ) : డిసెంబర్ 20 లోపు ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టులో తాత్కాలిక పద్ధతిన పని చేయుటకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రాజ గోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. చిన్న పిల్లలపై జరిగే అఘాయిత్యాలు, పోక్సో కేసులను ఫాస్ట్ ట్రాక్ కోర్టులో పరిష్కరించేందుకు మార్చి 2026 వరకు తాత్కాలిక పద్ధతిన స్పెషల్ ఫాస్ట్ ట్రాక్ కోర్టులో పని చేసేందుకు అర్హత గల సీనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్ ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, సీనియర్ అసిస్టెంట్ కు నెలకు 22,750/- రూపాయలు, ఆఫీస్ సబార్డినేట్ కు నెలకు 15,600 /- రూపాయలు వేతనం అందించడం జరుగుతుందని అన్నారు. రిటైర్డ్ జ్యుడీషియల్ ఉద్యోగులు, ఇతర అర్హులు కూడా కాంట్రాక్ట్ పద్ధతిన నియామకాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగులు దరఖాస్తు చేసుకునే పక్షంలో వారికి 65 సంవత్సరాలు నిండటానికి వీలు లేదని, తెలంగాణ మినిస్టీరియల్ సర్వీసులలో పదవి విరమణ పొందిన వారికి మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హత ఉందని అన్నారు. రిటైర్మెంట్ పొందిన జ్యుడీషియల్ సిబ్బంది దరఖాస్తు చేసుకోని పక్షంలో జనరల్ అభ్యర్థులకు అవకాశం లభిస్తుందని, వీరికి వయసు 18 నుంచి 34 లోపు ఉండాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈ.డబ్ల్యు.ఎస్. అభ్యర్థులకు 5 సంవత్సరాలు, దివ్యాంగులకు 10 సంవత్సరాలు సడలింపు ఉంటుందని అన్నారు. సీనియర్ అసిస్టెంట్ పోస్ట్ కు ఏదైనా విశ్వవిద్యాలయం నుంచి గ్రాడ్యుయేషన్, కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలని, ఓఎస్ పోస్ట్ కు 7 నుంచి 10వ తరగతి వరకు ఏదైనా ఒకటి ఉండాలని, 10 కంటే ఎక్కువ చదివిన వారిని ఎంపిక చేయరని, డ్రైవింగ్ ఎలక్ట్రికల్ ప్లంబింగ్, కుకింగ్ వంటి నైపుణ్యత ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని అన్నారు. బయట వారి నుంచి 20 కంటే ఎక్కువ దరఖాస్తులు వస్తే మెరిట్ ప్రకారం షార్ట్ లిస్ట్ చేసి రాత పరీక్ష లేదా ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు డిసెంబర్ 20 సాయంత్రం 5.00 గంటల లోపు దరఖాస్తులు సమర్పించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి,

**- ప్రజలు వంద శాతం ఓటింగ్ లో పాల్గొనాలి,**

**- జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బాదావత్ సంతోష్,**




నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర): డిసెంబర్ 10 మొదటి విడత పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును స్వేచ్ఛగావినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ కోరారు. గురువారం జిల్లాలో జరిగే తొలి విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆయా మండలాల పరిధిలోని ఓటర్లు రేపు ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే పోలింగ్ ప్రక్రియలో ఓటర్లు స్వచ్ఛందంగా 100% భాగ్యస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ బుధవారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... ఓటు వజ్రాయుధం వంటిదని, ఎలాంటి ప్రలోభాలకు లోను కావద్దని సూచించారు. ప్రజాస్వామ్యంలో రాజ్యాంగం ఇచ్చిన ఓటు హక్కును తమకు నచ్చిన నాయకున్ని ఎన్నుకొనే అవకాశం కల్పించిందని సూచించారు. అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా ఓటు వేసి ప్రజాస్వామ్య పరిణతిని చాటాలన్నారు. తమ ఓటు హక్కుతో గ్రామాల అభివృద్ధికి నిస్వార్థంగా పనిచేసే నాయకుల ఎన్నుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ పోలింగ్ ప్రక్రియలో పాల్గొని పోలింగ్ శాతాన్ని పెంచడానికి తమ వంతు తోడ్పాటును అందించాలని కోరారు. కుల, మతాలు, జాతి భేదం లేకుండా రాజ్యాంగం తమకు నచ్చిన వ్యక్తికి ఓటు వేసే అవకాశాన్ని ఇచ్చిందని, దానిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు 1,118 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటరు స్లిప్పులు పంపిణీ చేశామని, ఇంకా అందని వారు ఆయా పరిధిలోని బీఎల్వోల నుంచి పొందొచ్చన్నారు. ఓటరు స్లిప్పులు లేకపోయినా గుర్తింపు కార్డుతో వెళ్లి సంబంధిత పోలింగ్ కేంద్రంలో వివరాలు తెలియజేసి ఓటు హక్కు వినియోగించుకోవచ్చన్నారు. ఓటర్లు తమ వెంట ఏదైనా ఫొటో గుర్తింపు కార్డు తీసుకురావాలని కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి బాదావత్ సంతోష్ రేపు ఓటు హక్కును వినియోగించుకునే ఓటర్లకు కోరారు సూచించారు.

## గ్రామపంచాయతీ ఎన్నికల సామాగ్రి పంపిణీలో భాగంగా దూరంగా ఉన్న పోలింగ్ కేంద్రాలకు ముందుగా మెటీరియల్ ను పంపించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు.



నల్గొండ జిల్లా బ్యూరో డిసెంబర్ 10(విజన్ ఆంధ్ర): బుధవారం ఆమె మునుగోడు మండల కేంద్రంలోని సైంట్ జోసెఫ్ పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రామపంచాయతీ ఎన్నికల డిఆర్సి కేంద్రాన్ని తనిఖీ చేసి అక్కడ ఎన్నికల పోలింగ్ సామాగ్రి పంపిణీ, స్వీకరణకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ సిబ్బందికి సామాగ్రిని పంపిణీ చేసే సమయంలో స్టాట్యూటరీ,నాన్ స్టాట్యూటరీ పేపర్ల ప్రాధాన్యతను తెలియజేయాలని, అలాగే ప్రతి పోలింగ్ టీం వారికి సంబంధించిన జోనల్ అధికారి, రూట్ అధికారుల ఫోన్ నెంబర్లు కలిగి ఉండాలని తెలిపారు. ప్రిసైడింగ్ అధికారులు పి ఓ డైరీ నిర్వహణ, టెండర్,ఛాలెంజ్ ఓట్ల విషయంలో తీసుకొనే జాగ్రత్తలు మరోసారి తెలియజేయాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాలలో సిబ్బందికి కి ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. ఒకవేళ మెటీరియల్ సరిపోకపోతే తక్షణమే ఎంపీడీవో దృష్టికి తీసుకురావాలన్నారు.జిల్లా కలెక్టర్ వెంట జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, జెడ్పిసిఈఓ శ్రీనివాసరావు, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, చండూరు ఆర్డీవో శ్రీదేవి, తదితరులు ఉన్నారు.

## గ్రామ అభివృద్ధికి డిసిసిబి చైర్మన్ గట్టి అండ

**- కొండపాకలో ప్రజాదరణ పెంచుతున్న మంచాల కనక రాములు - అనసూయ**



విజన్ ఆంధ్ర ఉమ్మడి జిల్లా ప్రతినిధి : కొండపాక, డిసెంబర్ 10: గ్రామ అభివృద్ధి పట్ల స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వస్తున్న కొండపాక సర్పంచ్ అభ్యర్థులు మంచాల కనక రాములు – అనసూయ దంపతులకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోంది. అభ్యర్థిత్వం ప్రకటించిన రోజునుంచే ప్రజల మధ్య చురుకుగా ప్రచారం చేస్తూ, వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుంటూ గ్రామంలో విశ్వాసాన్ని పెంచుకుంటున్నారు. ఈ సందర్భంగా దంపతులు మాట్లాడుతూతమ అభ్యర్థిత్వానికి డిసిసిబి చైర్మన్ గారి బలమైన మద్దతు లభించడం గ్రామాభివృద్ధికి మరింత తోడ్పడుతుందన్నారు. గ్రామంలో పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేయడం, శానిటేషన్ మెరుగుదల, లైటింగ్ వ్యవస్థ, తాగునీటి సరఫరా, రహదారులు వంటి ప్రాథమిక సదుపాయాలను అన్ని వార్డుల్లో సమానంగా అమలు చేయనున్నట్టు తెలిపారు.మహిళా సంఘాలకు ప్రోత్సాహం, యువతకు ఉపాధి – నైపుణ్య శిక్షణ, వృద్ధులు – దివ్యాంగులకు ప్రత్యేక సేవలు, పాఠశాల అభివృద్ధి వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తామని మంచాల కనక రాములు – అనసూయ వివరించారు. "గ్రామంలో సమస్యలన్నీ పరిష్కరించాలంటే పారదర్శక పాలనతో, ప్రజల భాగస్వామ్యంతో ముందుకు సాగాల్సిందే" అని వారు అన్నారు.ప్రజలఆశలు – అభిలాషలను నెరవేర్చే సర్పంచ్‌గా పనిచేయడానికి సిద్ధమని పేర్కొంటూ "అభివృద్ధే మా లక్ష్యం.. శాంతి – సమరసతే మా మార్గం.. రింగు గుర్తుకే మీ ఆశీర్వాదం ఇవ్వండి" అని అభ్యర్థులు కోరుకున్నారు.

## కాంగ్రెస్ నుండి బిఆర్ఎస్ లోకి భారీ చేరికలు

**- బిఆర్ఎస్ కండువా కప్పి ఆహ్వానించిన చెక్కిలాల లక్ష్మణ్ రావు**



పెనుబల్లి, డిసెంబర్ 10(విజన్ ఆంధ్ర) : పెనుబల్లి మండల పరిధిలో వి ఎం బంజర్ పంచాయితీ లో కాంగ్రెస్ నుండి 20 కుటుంబాలు బుధవారం బిఆర్ ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య ఆదేశాల మేరకు మాజీ ఏ ఎం సి చైర్మన్ చెక్కిలాల లక్ష్మణ్ రావు పార్టీ కండువా కప్పి సాధారంగా ఆహ్వానించారు.వి ఎం బంజర్ గ్రామపంచాయితీ సర్పంచ్ అభ్యర్థి భుక్యా రాజబాబు కి కండువా కప్పి స్వాగతం పలికారు. ఆయనతో పాటు తేజావత్ భద్రు, భానోత్ భద్రు, ఇస్లావత్ హరి, శంకర్, తేజా వత్ నాగేశ్వరావు, భుక్యా రాణి, ఇస్లావత్ సునీత, మేకతొట్టి కృష్ణవేణి, తేజావత్ సోని, సక్రి, భద్రమ్మ, పద్మ, భూలి, చంద్రమ్మ, వీరితో పాటు మరి కొందరు బి ఆర్ ఎస్ పార్టీలో చేరారు, ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ రాజబాబు తో పాటు వాళ్ళ కుటుంబాలు బి.ఆర్.ఎస్ పార్టీలో చేరడం సంతోషకరంగా ఉందని అన్నారు. టిఆర్ఎస్ పార్టీ బలపరిచినసర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రాజబాబుకు టిడిపి,బిజెపి ల సహకారంతో ముందుకు సాగటం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమం పెనుబల్లి మాజీ సర్పంచ్ తేజావత్ తా వునాయక్, మాజీ కో ఆప్షన్ సభ్యుడు షేక్ గౌస్, మండల ఎస్ సి సెల్ నాయకులు కోట ప్రభాకర్,సినియర్ నాయకులు వేముల సురేష్ గౌడ్, మరకాల చంటి, మరకాల వెంకీ, బజ్జూరి వంశీ, తదితరులు పాల్గోన్నారు.

# ఈ- కేవైసీ కారణంతో దేశంలో ఎన్ని రేషన్ కార్డులను రద్దు చేశారు..?

**- ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి**



ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 10 ( విజన్ ఆంధ్ర ) : లబ్ధిదారులు బయోమెట్రిక్ ఆధార్ ధ్రువీకరణ (ఈ–కేవైసీ) చేయించుకోలేదనే కారణంతో రాష్ట్రాల వారీగా అక్టోబర్ నాటికి రద్దయిన రేషన్ కార్డులు, ప్రస్తుతం ఉన్న కార్డుల గణాంకాలు తెలపాలని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి లోక్ సభలో కోరారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల సందర్భంగా.. బుధవారం ఈ అంశంతో పాటు 14వ విడత వాణిజ్య బొగ్గు గనుల వేలం లక్ష్యం, బిడ్ల వివరాలు, ఇంకా..ఆరో విడత మైనింగ్ లీజులు, తెలంగాణ రాష్ట్రంలో ఖనిజ గనుల పరిస్థితి తెలపాల్సిందిగా కోరారు. ఈ ప్రశ్నలకు కేంద్ర బొగ్గు, గనుల శాఖల మంత్రి జీ.కిషన్ రెడ్డి, కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ శాఖల సహాయ మంత్రి నిముబెన్ జయంతి భాయ్ బాంభానియా వేర్వేరుగా లిఖితపూర్వక సమాధానాలిచ్చారు. తెలంగాణలో మొత్తం రేషన్ కార్డులు 56,60,367, రద్దయినవి 1,40,947 నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్ (ఎన్ఎఫ్ సీఏ) నిబంధనల మేరకే లబ్ధిదారుల గుర్తింపు, జాబితాల నిర్వహణ ఉంటుందని దేశంలో అక్టోబర్ నాటికి గణాంకాల ప్రకారం 20,29,52,938 రేషన్ కార్డులు ఉన్నాయని, తెలంగాణలో 56,60,367 మంది కార్డులు కలిగి ఉన్నారని కేంద్ర, ప్రజా పంపిణీ శాఖల సహాయ మంత్రి నిముబెన్ జయంతి భాయ్ బాంభణియా తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో 2020 నుంచి ఈ ఏడాది అక్టోబర్ వరకు 1,40,947 రేషన్ కార్డులు రద్దు అయ్యాయని, అయితే.. అనర్హులు, చనిపోయిన వ్యక్తుల కార్డులే తొలగించామని, ఈ–కేవైసీ కారణంతో ఎక్కడ కూడా కార్డుల తొలగింపు నమోదు కాలేదని వివరించారు. 14వ విడత వాణిజ్య బొగ్గు గనుల వేలంలో బిడ్ల సమర్పణకు ఈ నెల 15 వరకు గడువు.. ఏడాదికి 35.41 మిలియన్ టన్నుల ఉత్పత్తిని అందించే సామర్థ్యం కలిగి ఉండి దేశ వ్యాప్తంగా మొత్తం 41 వాణిజ్య బొగ్గు గనులకు సంబంధించిన వేలం ప్రక్రియ అక్టోబర్ 29న ప్రారంభం కాగా.. ఇందులో తెలంగాణ నుంచి ఒక గని ఉందని, ఈనెల 15వ తేదీ నాటికి బిడ్ల సమర్పణకు గడువు ముగుస్తుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి పేర్కొన్నారు. బొగ్గు ఉత్పత్తి రంగాన్ని మరింత బలోపేతం చేయడం లక్ష్యమని, ఉక్కు మంత్రిత్వ శాఖ పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థ ఎంఎస్ టీసీ లిమిటెడ్ ద్వారా ఈ – వేలం నిర్వహిస్తామని తెలిపారు. పర్యావరణ రక్షణ చట్టం–1986, అటవీ సంరక్షణ చట్టం – 1980ల ద్వారా జీవవైవిధ్యం, గాలి, నీటి నాణ్యత దెబ్బతినకుండా, ప్రాజెక్ట్ ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన పునరావస వసతి సౌకర్యాలు కల్పించేలా చూస్తామని పేర్కొన్నారు. తెలంగాణలో వేలానికి రెండు ఖనిజ బ్లాక్ లు ఆరో విడతలో వివిధ రాష్ట్రాల్లో వేలానికి ప్రతిపాదించబడిన ఖనిజ గనుల బ్లాక్ లకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర పరిధిలో రెండు ఉన్నాయని కేంద్ర మంత్రి తెలిపారు. రసాయన మూలకమైన వెనాడియం, ఇంకా.. టైటానియం, అల్యూమినియం, లేటరైట్ ఖనిజ నిక్షేపాల గనులు ఇందులో ఉన్నాయని, ఖచ్చితమైన ప్రణాళికతో.. గనుల ప్రభావిత ప్రాంతాల్లో నిర్వాసితులకు లబ్ధి కలిగేలా ముందుకెళతామని వివరించారు.

# డిస్ట్రిబ్యూషన్,రిసెప్షన్ సెంటర్లను పరిశీలించిన కలెక్టర్

**పోలింగ్ ప్రక్రియను నిర్ణీత సమయంలో ప్రారంభించాలి**

**మధ్యాహ్నం 2 గంటలకు ఓట్ల లెక్కింపు చేపట్టాలి**

**జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి**



మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లా బ్యూరో డిసెంబర్ 10(విజన్ ఆంధ్ర): మహబూబ్ నగర్ జిల్లాలో మొదటి విడత ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ నిమిత్తం మహబూబ్ నగర్ రూరల్ మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను బుధవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయేంద్ర బోయి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ. ఈ నెల 11 జిల్లాలోని గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ జరుగుతుందని, పోలింగ్ అవసరమైన సామాగ్రిని డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో తీసుకున్న సిబ్బంది ఒకటికి రెండుసార్లు సామాగ్రిని సరి చూసుకోవాలని సూచించారు. బ్యాలెట్ పత్రాలు, బాక్సులు చెక్ చేసి ప్యాక్ చేసుకోవాలని, పోటీ చేసే అభ్యర్థుల కు సమానంగా గుర్తులు ఉన్నాయా లేదా నిశితంగా పరిశీలించాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఓటింగ్ నిర్వహణ ఏర్పాట్లను మరోసారి నిర్ధారణ చేసుకోవాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే ప్రతి అధికారి జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఎన్నికల సిబ్బందికి అల్పాహారం, మధ్యాహ్న భోజనం వసతి కల్పించాలని అధికారులకు సూచించారు. అలాగే పోలింగ్ కేంద్రాలలో విద్యుత్ అంతరాయం లేకుండా 24 గంటల సరఫరా ఉండేలా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో ఏమైనా లోపాలు కనిపిస్తే వెంటనే తెలియజేయాలని, ఎంట్రీ, ఎగ్జిట్ , తాగునీరు, మరుగు దొడ్ల సౌకర్యం ఉండాలన్నారు. జిల్లాలో మూడు విడతలలో ఎన్నికలు జరుగు తున్న నేపథ్యంలో మొదటి విడత లో జరిగే ఎన్నికలు ప్రశాంతంగా సజావుగా జరిగితే మిగతా రెండు విడతలు కూడా అదే విధంగా జరుగుతాయని ఆమె తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ ఉం టుందన్నారు. అనంతరం కలెక్టర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిస్ట్రి బ్యూషన్ కేంద్రాన్ని సందర్శించి ఎన్నికల సామాగ్రి పంపిణీ తీరుతెన్నులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అక్కడ పోలింగ్ సిబ్బందికి తాగునీటి వసతి, వైద్య శిబిరం, అల్పాహారం, భోజన వసతి, షామియానాలు ఇతర అన్ని వసతులు ఏర్పాటు చేయగా, పీ.ఓ, ఓ.పీ.ఓలతో కూడిన బృందాలన్నీ హాజరయ్యారా లేదా అని కలెక్టర్ ఆరా తీశారు. ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా సిబ్బందికి పోలింగ్ సామాగ్రిని పక్కాగా అందించాలని, చెక్ లిస్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందినదా, లేదా అన్నది జాగ్రత్తగా పరిశీలించుకోవాలని కలెక్టర్ సూచించారు. పోలింగ్ సిబ్బందితో పాటు ఓటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించే పోలీసు సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వాహనాలను పరిశీలించి, సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ సామాగ్రి, ప్రత్యేకించి బ్యాలెట్ పేపర్లు తరలించే సమయంలో తప్పనిసరిగా సాయుధ పోలీసులతో కూడిన బందోబస్తు ఉండాలని అన్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే తమ దృష్టికి తేవాలని ఆర్ఓలకు సూచించారు. పోలింగ్ సామాగ్రిని సర్దుకుని కేంద్రంలో భోజనం చేస్తున్న పీవోలు, ఓపివోల వద్దకు వెళ్ళిన కలెక్టర్ భోజనం చేశాక మరోసారి పోలింగ్ సామాగ్రినీ సరిచూసుకోవాలని తెలిపారు. భోజనం బాగుందా లేదా అని వారిని అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ అధికారులు, సిబ్బందికి బెస్ట్ ఆఫ్ లక్ చెప్పారు. జిల్లా అదనపు కలెక్టర్లు మండల కేంద్రాలలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను సందర్శించి ఎన్నికల సామాగ్రి పంపిణీ తీరు తెన్నులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్ఓ శ్రీనివాసులు ,మండలాల తహాసిల్దారులు, ఎంపీడీవోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



## దివ్యాంగుల ఆటల పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్, మెమొంటోల ప్రధానం



మల్కాజిగిరి, డిసెంబర్ 10,(విజన్ ఆంధ్ర): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని మహిళ శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా సైలెంట్ వాల్ స్కూల్ గ్రౌండ్ లో గత నెల 26వ తేదీన ఆటల పోటీలు నిర్వహించారు. జిల్లా స్థాయిలో జరిగి న దివ్యాంగుల ఆటల పోటీల్లో విజేతలకు బుధవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అడి షనల్ కలెక్టర్ రాధికాగుప్తా చేతుల మీదుగా శాలువా కప్పి అభినందించి, వారికి సర్టిఫికెట్, మెమెంటోలను ప్రధానం చేశారు. ఇందులో భాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షులు ఎస్.వినయ్ కు (క్రచల పై నడిచే వారికి నిర్వహించిన) రన్నింగ్ రేస్ పోటీలో మొదటి బహుమతి లభించింది. ఈ సందర్భంగా వినయ్ కు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా డి డబ్ల్యు సీ అధికారి శారద, ఇతర అధికారులు పాల్గొన్నారు

## పోలింగ్ సిబ్బంది బాధ్యతయుతంగా ఎన్నికల విధులు నిర్వహించాలి..

**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



సూర్యాపేట డిసెంబర్ 10 (విజన్ ఆంధ్ర): ఆత్మకూరు (ఎస్), నూతనకల్లు, మద్దిరాల, తుంగతుర్తి, నాగారం, జాజిరెడ్డిగూడెం మండలాలకు సంబంధించిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను సందర్శించారు. బుధవారం ఆయా డి ఆర్ సి కేంద్రాలలో కలెక్టర్ మాట్లాడుతూ పి ఓలు, ఏపీవోలు పోలింగ్ సామాగ్రిని, బ్యాలెట్ బాక్స్ లను జాగ్రత్తగా పరిశీలించి తీసుకోవాలని ,అన్ని సరిగ్గా ఉన్నాయో మరోసారి పరిశీలించుకోవాలని చెప్పారు. రిజర్వు సిబ్బందికి ఏదో ఒక గ్రామ పంచాయతీలో విధులు కేటాయించడం జరుగుతుందని, సిబ్బంది అందరూ వారికి కేటాయించిన గ్రామపంచాయతీ పోలింగ్ స్టేషన్లకు జోనల్ ఆఫీసర్ తో వెళ్లి పోలింగ్ స్టేషన్ కు చేరుకొని అక్కడ రాత్రి బస చేయాలని, సాయంత్రం సంబంధిత పోలింగ్ కేంద్రానికి చేరుకోగానే ఆ పోలింగ్ స్టేషన్ ను క్షుణ్ణంగా పరిశీలించి పోలింగ్ కు అనుకూలంగా అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. గురువారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 వరకు పోలింగ్ నిర్వహించాలని, మధ్యాహ్నం 1 తర్వాత ఓటర్లు ఓట్లు వేసేందుకు క్యూ లైన్లో ఉన్నట్లయితే పై అధికారుల అనుమతితో పోలింగ్ నిర్వహించాలని చెప్పారు.పోలింగ్ కేంద్రాల పరిధిలో శాంతి, భద్రతలకు విఘాతం కలగకుండా చూసుకోవాలని, ఏవైనా అనుకోని సంఘటనలు జరిగినప్పుడు మండల టీంకు సమాచారం అందిస్తే అవసరమైతే అదనపు పోలీస్ సిబ్బందిని పంపించడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ తదుపరి మధ్యాహ్నం 2 గంటల నుండి ఓట్ల లెక్కింపు చేపట్టాలని, ఓట్ల లెక్కింపులో రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటిస్తూ జాగ్రత్తగా ప్రజాస్వామ్య పద్ధతిలో లెక్కింపు జరపాలని అన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ఓట్ల లెక్కింపు పూర్తయిన పిదప స్టేజ్-%××% రిటర్నింగ్ ఆఫీసర్లు ఫలితాలు వెల్లడించే ముందు జిల్లా ఎన్నికల అధికారి, జనరల్ అబ్జర్వర్ అనుమతి తీసుకొని తుది ఫలితాలు ప్రకటించాలని తెలిపారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ప్రత్యేక ఎలక్షన్ సెల్ విభాగం ఏర్పాటు చేయడం జరిగిందని, ఎలక్షన్ సెల్ కు ఫోన్ కాల్ ద్వారా , వాట్సాప్ మెసేజ్ ద్వారా అనుమతి తీసుకొని ఫలితాలు ప్రకటించాలని ,ప్రతి ఎన్నికల సిబ్బంది బాధ్యతగా ఎన్నికల విధులు నిర్వహించి విజయవంతం చేయాలని కలెక్టర్ అన్నారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవ్, మండల స్పెషల్ ఆఫీసర్లు శ్రీధర్ రెడ్డి, శ్రీనివాస్ నాయక్, అశోక్, నాగయ్య, నాగులు నాయక్, ఎంపీడీవోలు ఎండి హస్సిన్, సునీత, సత్యనారాయణ రెడ్డి, శేష్ కుమార్, భీమ్ సింగ్, పి. ఝాన్సీ తాసిల్దార్లు అమన్ సింగ్, శ్రీనివాస్, దయానందం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## 11న అలుగ్లాజ్ లిమిటెడ్ పబ్లిక్ ఐపిఓ ప్రారంభం

హైదరాబాద్, డిసెంబర్ 10 (విజన్ ఆంధ్ర) : అల్యూమినియం ఉత్పత్తుల రూపకల్పన, తయారీ, సంస్థాపనలో నిమగ్నమైన హెచ్ఆర్ఎస్ అలుగ్లాజ్ లిమిటెడ్ పబ్లిక్ ఆఫర్ నుండి రూ.50.92 కోట్ల వరకు సేకరించాలని యోచిస్తోందని ఆ సంస్థ ప్రతినిధులు గురువారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ ఐపిఓ డిసెంబర్ 11న ప్రారంభమై 15న ముగుస్తుందన్నారు. కంపెనీ రూ.10 ముఖ విలువ కలిగిన 53.04 లక్షల ఈక్విటీ షేర్లను ఒక్కో షేరుకు రూ.94-96 ధరల బ్యాండ్‌లో జారీ చేయాలని యోచిస్తోందన్నారు. షేర్లు బీఎస్ఈ ఎస్ఎంఈ ప్లాట్‌ఫామ్‌లో జాబితా చేయబడతాయని తెలిపారు.

## మొదటి విడత ఎన్నికలు జరిగే ఏడు మండలాలకు ఎన్నికల మెటీరియల్ సప్లై చేసిన అధికారులు



సిద్దిపేట జిల్లా ప్రతినిధి 10 డిసెంబర్ (విజన్ ఆంధ్ర): 2వ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికలు - 2025 ప్రక్రియలో భాగంగా జిల్లాలో మొదటి విడతలో 7మండలాల్లోజరిగేగ్రామపంచాయతీ ఎన్నికలలో ఈ రోజు గజ్వేల్ మండలం సంబంధించి గజ్వేల్ పట్టణంలో ఐఓసి లో, ములుగు మండలం సంబంధించి ములుగు రైతు వేదిక, రాయపోల్ మండలం సంబంధించి జీఎల్ఆర్ గార్డెన్, దౌలతా బాద్ మండలం తెలంగాణ మోడల్ స్కూల్ లో నిర్వహించిన డిస్ట్రిబ్యూషన్ మరియు రిసెప్షన్ సెంటర్ లను జిల్లా ఎన్నికలఅధికారి కలెక్టర్ కె హైమావతి క్షేత్రస్థాయిలోపరిశీలించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్మాట్లా డుతూ..జిల్లాలో మొదటి విడతలో 7 మండలాల్లో ఆయా మండలాల సంబంధించిన పలు కేంద్రాల్లో పోలింగ్ మెటీరియల్స్ డిస్ట్రిబ్యూషన్ చేయడం జరుగుతుంది. పిఓ, ఓపిఓ మీకు అందజేయబడిన పోలింగ్ సామాగ్రిని అన్ని చెక్ చేసుకోవాలని, బ్యాలెట్ పేపర్ లులెక్కబెట్టుకోవాలని తెలిపారు. బ్యాలెట్ బ్యాక్ ఉపయోగించే ప్రక్రియ గురించి ఎలాంటి సందేశాలు ఉన్నా ఇక్కడే మాస్టర్ ట్రైనర్ లను అడిగి పరిష్కరించుకోవాలి. పోలింగ్ మెటీరియల్ తీసుకుని వివిధ రూట్లలో మీకు కేటాయించిన పోలింగ్ స్టేషన్లకు వెళ్ళిన తర్వాత పోలింగ్ స్టేషన్ లో ఫర్నిచర్, బ్యాలెట్ బాక్స్ ఆయా మెటీరియల్ అన్ని అన్ని సెట్ చేసుకోవాలని తెలిపారు. రేపు ఉదయం 6 గంటలకే అన్ని సిద్ధం చేసుకుని మాక్ పోలింగ్ చేసిన తరవాత తప్పనిసరిగా 7 గంటలకు ఓటింగ్ ప్రక్రియ మొదలు పెట్టాలని ప్రతి 2 గంటలకొకసారి పోలింగ్ శాతాన్ని తెలపాలని ఆదేశించారు. మధ్యాహ్నం 1 వరకు ఓట్లు వేయడానికి ఓటర్లు ఉంటే వారు ఓటు వేసిన తరవాత క్లోజ్ చేసి బ్యాలెట్ బాక్సు కి సీల్ వేయాలి. మధ్యాహ్నం 2 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభించాలని తెలిపారు. కౌంటింగ్ సెంటర్ లో ఏజెంట్లు, పోలింగ్ సిబ్బంది ఫోన్‌కి అనుమతి లేదని కౌంటింగ్ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా చేశాకే పై అధికారుల అనుమతితో ఫలితాలు రిలీజ్చెయ్యాలని తెలిపారు. మీకు ఎలాంటి సమస్యలు ఎదురైనా మీకు అందజేయబడిన కరదీపికను చదివి నివృత్తి చేసుకోవాలని తెలిపారు. మీకు అన్ని సౌకర్యాలు ఆయా గ్రామాల పంచాయతీ సెక్రటరీ లు సమకూరుస్తారని తెలిపారు. ఎన్నికల విధులకు గైర్హాజరు అయిన వారిపైన కఠిన చర్యలు తీసుకోవాలని డిఈఓ ను ఆదేశించారు. స్టేట్ ఎలక్షన్ కమిషన్ నియమావళి ప్రకారం ఓటింగ్ కౌంటింగ్ ప్రక్రియ ను విజయవంతం చెయ్యాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో చంద్రకళ, ఆయా మండల ఎంపిడిఓ, తహసిల్దార్ తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వం అందించే ఉచిత శిక్షణలను సద్వినియోగపరుచుకొని విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి,డిసెంబర్ 10,(విజన్ ఆంధ్ర) అదిలాబాద్ జిల్లా కేంద్రంలో స్థానిక ప్రొఫెసర్ జయశంకర్ చౌరస్తా సమీపంలోని స్థానిక ఉర్దూ భవన్ లో మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉర్దూ మీడియం విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఉచిత టెట్ శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, మైనార్టీ విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించాలనే ఉద్దేశ్యంతో ఉచిత శిక్షణను అందిస్తున్నామని, పట్టణం కేంద్రంలో నిర్వహిస్తున్నందున ఎక్కువ సంఖ్యలో అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళా అభ్యర్థులు టెట్ కోచింగ్ కు రావడం అభినందనీయమని, ప్రభుత్వ ఉద్యోగాలు ప్రతి ఒక్కరికి రావని, కానీ శిక్షణతో ప్రయివేట్ రంగంలో సైతం ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పొందవచ్చన్నారు. నిత్యం తరగతులకు హాజరవుతు వచ్చే డీఎస్సీలో అత్యధిక మంది ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. అదే విధంగా ఉర్దూ భవన్లో లైబ్రరీ ఏర్పాటుతో పాటు ఇతర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు .అంతకుముందు ఉర్దూ భవన్ లో ప్రత్యేక నిధులతో చేపట్టిన మరమ్మత్తులను మైనారిటీ సంక్షేమ అధికారి కలీం కలెక్టర్ కు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల సంక్షేమ అధికారి శ్రీనివాస్, అధికారులు, ట్రైనర్లు, విద్యార్థులు, పాల్గొన్నారు.

## సోలరైజేషన్ పథకం క్రింద ఏ.పిలో అమలవుతున్న సోలార్ కార్‌పోర్ట్ ఏర్పాటు వివరాలను కోరిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ

**సానుకూలంగా స్పందించిన భారత ప్రభుత్వం**

**వివరాలను వెల్లడించిన కేంద్ర నూతన, పునరుత్పాదక ఇనర్జా మంత్రిత్వ శాఖ**



చిత్తూరు (ఢిల్లీ), 10 ( విజన్ ఆంధ్ర ) : సోలరైజేషన్ పథకం క్రింద ఆంధ్రప్రదేశ్లో అమలవుతున్న సోలార్ కార్‌పోర్ట్ ఏర్పాటు వివరాలను బుధవారం చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు భారత ప్రభుత్వాన్ని కోరారు.దీనికి సానుకూలంగా స్పందించిన కేంద్ర నూతన, పునరుత్పాదక ఇనర్జా మంత్రిత్వ శాఖ, సోలార్ కార్‌పోర్ట్ ఏర్పాటుకు సంబంధించిన వివరాలను లిఖిత పూర్వకంగా తమకు అందినట్లు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ తెలియజేశారు.న్యూఢిల్లీ పార్లమెంటు శీతాకాల సమావే శాలకు హాజరైన చిత్తూరు చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాద రావు.ఏ.పి.సీయం చంద్రబాబు నాయుడు ప్రోత్సాహంతో ఆంధ్రప్రదేశ్ హక్కులు, ప్రయోజనాల సాధన కోసం పాటు పడుతున్నారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి, విజయవాడ, అన్నవరం, అహోబిలం, అరసవిల్లి వంటి ప్రధాన దేవాలయాల్లో అమలు చేసి, విజయవంతమైన సౌర కార్‌పోర్ట్ మోడల్‌ను పునరావృతం చేయడానికి ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసిందా...? అలాగే దీనికి సంబంధించి, రాష్ట్ర ప్రభుత్వాలు లేదా దేవస్థానాలతో ఏవైనా చర్చలు లేదా సాధ్యాసాధ్యాల అంచనాల పై సమీక్షలు చేసారా..? అదేవిధంగా దేవాలయ-ఆధారిత సౌర ప్రాజెక్టుల కోసం ఉన్న పునరుత్పాదక ఇనర్జా పథకాల క్రింద ఆర్థిక లేదా సాంకేతిక సహాయాన్ని అందించడానికి ఏవైనా ప్రతిపాదనలు ఉన్నాయా..? అలా అయితే, ఆంధ్రప్రదేశ్.., గుజరాత్‌లోని అటువంటి దేవాలయ సౌర కార్‌పోర్ట్‌ల ద్వారా గ్రిడ్ ఆధారపడటాన్ని తగ్గించడం, క్లీన్ ఎనర్జీ అనుసరణను ప్రోత్సహించడం కోసం అంచనా వేయబడిన సామర్థ్యం ఎంత? అన్న అంశాలకు సంబంధించిన వివరాలను చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు కోరారు. దీనికి తక్షణం స్పందించిన కేంద్ర నూతన, పునరుత్పాదక ఇనర్జా, పవర్ శాఖ సహాయ మంత్రి శ్రీపాద యెస్సో నాయక్.., సౌర కార్‌పోర్ట్‌ల వివరాలను లిఖిత పూర్వకంగా తమకు అందినట్లు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు తెలిపారు. దేవాలయాల్లో సౌర కార్‌పోర్ట్‌ల ఏర్పాటుకు సంబంధించిన ఏ నిర్దిష్ట పథకాన్ని అమలు చేయడం లేదని. అలాగే, అటువంటి దేవాలయ-ఆధారిత సౌర ప్రాజెక్టుల కోసం ఉన్న పునరుత్పాదక ఇనర్జా పథకాల క్రింద ఆర్థిక లేదా సాంకేతిక సహాయాన్ని అందించడానికి ప్రతిపాదన ఏదీ లేదని కేంద్ర నూతన, పునరుత్పాదక ఇనర్జా, పవర్ శాఖ సహాయ మంత్రి లేఖలో వివరించినట్లు పేర్కొన్నారు.

## బోథ్ నియోజకవర్గంలో జోరందుకున్న బిఆర్ఎస్ పార్టీ ఏకగ్రీవంగా సర్పంచ్ ఎన్నిక



నేరడిగొండ , డిసెంబర్ 10, (విజన్ ఆంధ్ర) అదిలాబాద్ జిల్లా నేరడి గొండ మండలంలోని కుంటాల కే గ్రామ పంచాయతీ ఏకగ్రీవం కావడం జరిగింది. ఈ సందర్భంగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ను మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది.నూతన సర్పంచ్ రాథోడ్ సావిత్రిని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపి.. ఎమ్మెల్యే మాట్లాడుతూ పల్లెలు ఏకాభిప్రాయం తో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం సంతోషం ప్రతి గ్రామ ఐక్యంగా ఏకగ్రీవల వైపు అడుగులు వేస్తూ గ్రామ పంచాయతీ అభివృద్ధి బాటలు వేయడం మంచి ఆలోచన అని అన్నారు కుంటాల గ్రామ అభివృద్ధి నావంతు కృషీ ఎప్పుడూ ఉంటుంది అని అన్నారు గ్రామంలో సర్పంచ్ ఉప సర్పంచ్ తో పాటు 8 మంది వార్డు సభ్యులు సర్పంచ్ రాథోడ్ సావిత్రి ప్రేమ్సింగ్.ఉప సర్పంచ్ శ్రీనివాస్. వార్డు సభ్యులు ,చీటి రాజు,ఎల్లుల లలిత,పులడి నవీన,బంక సరిత,శ్రీనివాస్ రాథోడ్,ఆడే ప్రేమ్ సింగ్,బట్టు స్వప్న,ఆడే సవిత ఏక్రీవంగా ఎన్నికయ్యారు.. వీరందరికీ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శుభాకాంక్షలు తెలిపి శాలువా తో సన్మానించారు.వారితో పాటు గ్రామ ప్రజలు,యూత్ సభ్యులు పాల్గొన్నారు

## జిల్లాలో మిషన్ శక్తి అమలపై ఈనెల 22వ తేదీ నుంచి 27 తేది వరకు నియోజకవర్గ స్థాయిలో సమీక్ష సమావేశాలు నిర్వహించాలి


**జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్**



చిత్తూరు, డిసెంబర్ 10 ( విజన్ ఆంధ్ర ) : మహిళా భద్రత, రక్షణ మరియు సాధికారత కోసం జోక్యాలను బలోపేతం చేయడం లక్ష్యంగా మిషన్ మోడ్‌లో ఒక పథకం శక్తి మిషన్ ఈనెల 22వ తేదీ నుంచి 27వ తేదీ వరకు నియోజకవర్గ స్థాయిలో సమీక్ష సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని అందుకు ఐసిడిఎస్, జిల్లా విద్యాశాఖ, వైద్యశాఖ ఆధ్వర్యంలో కార్యాచరణ ప్రణాళికలు అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం సమయం లో స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లా కలెక్టర్ జిల్లా స్థాయి శక్తి మిషన్ టీమ్ మెంబర్లతో శక్తి మిషన్ అమలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐ సి డి ఎస్ పి డి వెంక టేశ్వరి, డిఎంహెచ్వో సుధారాణి, డిఇఓ వరలక్ష్మి ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూమహిళల హక్కులు మరియు గౌరవాన్ని రక్షించే మరియు నిలబెట్టే ,వారికి అవసరమైన నైపుణ్యాలను సమకూర్చే మరియు వారి ముందుకు సాగడానికి వారిలో విశ్వాసాన్ని నింపే పర్యావరణ వ్యవస్థను సృష్టించే జీవిత చక్ర నిరంతర విధానాన్ని అవలంబించాలిపోలీసు అధికారులకు: మహిళలు, బాలలపై నేరాలలో 100% ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయాలి, రాజీలకు అవకాశం లేదు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో మహిళా హెల్ప్ డెస్క్‌లు పూర్తి స్థాయిలో పనిచేయాలి. పాక్సో, అత్యాచారం, గృహ హింస కేసులను వేగ వంతం చేయాలి. ప్రతి మండలంలో నెలవారీ 'భరోసా సంవాద్' సమా వేశాలు నిర్వహించాలి. జిల్లా న్యాయసేవల అధికారికి : ప్రతి నెలా మహిళా ఎస్‌హెచ్‌జీలతో కలిసి కనీసం ఒక చట్టపరమైన అవగాహన శిబిరం నిర్వహించాలి. బాధితులందరికీ తక్షణం ఉచిత న్యాయ సహాయం అందించాలి.విద్యాశాఖ అధికారులకు : ప్రతి పాఠశాల, జూనియర్ కాలేజీలో లైంగిక వేధింపులకు సున్నా సహనం. ఫిర్యాదు పెట్టెలు, టోల్ ఫ్రీ నంబర్లు (100, 1098, 181) ప్రదర్శించాలి. ఈ విద్యా సంవత్సరం లోనే 6 నుంచి ఇంటర్మీడియట్ వరకు అమ్మాయిలకు 'రాణి రుద్రమ/రక్ష' స్వరక్షణ శిక్షణ పూర్తి చేయాలి. వైద్య ఆరోగ్య శాఖకు : సఖి ఒన్ స్టాప్ సెంటర్లు 24ఐ7 పనిచేయాలి. 108/104 అంబులెన్స్ సిబ్బంది, పీహెచ్‌సీ డాక్టర్లకు లైంగిక వేధింపుల కేసుల్లో మెడికో-లీగల్ శిక్షణ ఇవ్వాలి. స్కిల్ డెవలప్‌మెంట్, ఎంఇపిఎంఎ, స్పోర్ట్స్, సామాజిక సంక్షేమ శాఖలకు : మహిళలకు కనీసం 70% స్కిల్ శిక్షణ సీట్లు, ప్రతి త్రైమాసికంలో అమ్మాయిలకు ప్రత్యేక స్వరక్షణ-క్రీడా కార్యక్రమాలు నిర్వహించాలి. అన్ని శాఖలకు: నిధుల విడుదలలో ఆలస్యం లేకుండా చూడాలి. ప్రతి నెలా మిషన్ శక్తి కమిటీ సమావేశం నిర్విఘ్నంగా జరగాలి. లైవ్ డాష్‌బోర్డ్ నిర్వహణ, పురోగతి నివేదికలు సమర్పించాలి. మహిళలపై హింసను సమూలంగా అరికట్టి, వారిని ఆర్థికంగా, సామాజికంగా సాధికారవంతులను చేయడం కోసం అన్ని శాఖలు ఒకే బృందంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో, స్కిల్ డెవలప్మెంట్, ఇంటర్మీడియట్ ఆర్ ఐ ఓ, గిరిజన సంక్షేమ శాఖ అధికారి, మైనార్టీ, సాంఘిక సంక్షేమ, డి ఆర్ డి ఏ, పోలీసు శాఖ, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు అనంతరం కలెక్టర్ బాల్య వివాహాలు అరికట్టాలని పోస్టర్లను విడుదల చేశారు.

## కొండపాక డబుల్ బెడ్ రూమ్ లో డ్రైనేజీ వ్యవస్థ బాగోలేదని ఫోన్ చేయగాలి

**స్పందించి బాగు చేయించిన అనంతుల ప్రశాంత్**



సిద్దిపేట జిల్లా ప్రతినిధి విజన్ ఆంధ్ర డిసెంబర్ 10: సిద్దిపేట జిల్లా కేంద్రంలో గల మండలకేంద్రమైనకొండపాక గ్రామం లో ఉన్నటువంటి డబుల్ బెడ్ రూమ్ కాలనీలో గత కొన్ని రోజుల నుండి డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా మారి రోడ్డుపైకి వచ్చి దుర్వాసన రోడ్డు మీద నిలబడలేని పరిస్థితి ఉండడం వలన దేని గురించి ఎవరు పట్టించుకోవడం లేదని ఫోన్ ద్వారా అనంతుల ప్రశాంత తెలపడంతో వెంటనే సెప్టిక్ ట్యాంకును తెప్పించి క్లీన్ చేయించారు.కాలనీవాసులు అందరూ అనంతుల ప్రశాంత్ అన్న గారికి కృతజ్ఞతలు తెలపడం జరిగింది

# పంచాయితీ ఎన్నికలకు పోలీసు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి

**936 సిబ్బందితో మొదటి విడత ఎన్నికలకు పోలీసు బందోబస్తు**

**మొదటి విడతలో ఆరు మండలాలలో గ్రామపంచాయతీ ఎన్నికలు**

**పోలింగ్ కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమలు**

**38 క్రిటికల్ పోలింగ్ స్టేషన్ లలో స్పెషల్ పార్టీ బలగాలు, 10 షాడో పోలింగ్ స్టేషన్లో కమ్యూనికేషన్ వ్యవస్థ**

**ఇప్పటివరకు జిల్లాలో 599 వ్యక్తులు బైండోవర్**

**20 ఆయుధాల సేఫ్ డిపాజిట్**

**బందోబస్తులో పాల్గొననున్న ఫారెస్ట్, టిజిఎస్పి, ఎసిటిపిసి సిబ్బంది**

**పోలింగ్ స్టేషన్స్, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, క్లస్టర్స్, రూట్ మొబైల్స్ లతో బందోబస్తు ఏర్పాటు.**

**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**



ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి,డిసెంబర్ 10, (విజన్ ఆంధ్ర): గ్రామపంచాయతీ ఎన్నికలకు జిల్లా పోలీసు వ్యవస్థ పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా మొదటి విడతలో భాగంగా 6 మండలాలలో ఎన్నికలు జరగనుండగా అందులో 39 క్లస్టర్లు, 34 రూట్ లతో, 166 గ్రామాల నందు 225 పోలింగ్ లొకేషన్లో ఎన్నికలు జరగనున్నాయి. అందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా 938 మంది పోలీసు సిబ్బందితో పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగింది అని తెలిపారు. ఇప్పటివరకు జిల్లా ఎస్పీ స్వయంగా 38 గ్రామాల నందు ఫ్లాగ్ మార్చ్ లు నిర్వహించి, ప్రజలను ఓటు హక్కు పై అవగాహన కల్పించి నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రలోభాలకు గురి కాకూడదని తెలిపారు. ఈరోజు నుండి పోలింగ్ స్టేషన్లో పరిధిలో 163 బిఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమలులో ఉంటుందని, ప్రజలు గుమ్మిగూడి ఉండకుండా, గొడవలకు అల్లర్లకు దారి తీయకుండా ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకొని ఇళ్లకు చేరుకోవాలని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో సమస్యలు సృష్టించేటటువంటి వారిని, ఎన్నికలను గొడవలు సృష్టించే వారిని 598 మందిని బైండోవర్ చేయడం జరిగిందన్నారు. ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా 20 మంది వద్ద ఉన్న ఆయుధాలను సేఫ్ డిపాజిట్ చేయడం జరిగిందన్నారు. ఈ బందోబస్తు నందు ఫారెస్ట్, టీజీఎస్పి, ఎసిటిపిసి సిబ్బంది పాల్గొంటున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మూడు విడతలలో 128(40 మొదటి విడత) క్రిటికల్ పోలింగ్ లొకేషన్స్ ఉండగా అందులో ప్రత్యేకంగా స్పెషల్ పార్టీ బలగాలచే బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎటువంటి సమాచార వ్యవస్థ లేనటువంటి 31(10 మొదటి విడత) షాడో ఏరియాలలో ప్రత్యేకంగా కమ్యూనికేషన్ వ్యవస్థ ద్వారా విహెచ్ఎఫ్ సెట్లను ఏర్పాటు చేయడం జరిగింది. బందోబస్తు ప్రక్రియలో పోలింగ్ స్టేషన్లో, క్లస్టర్లలో, రూట్ మొబైల్స్ లో, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ ఏర్పాటుచేసి ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా పటిష్టమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ బందోబస్తు నందు ముగ్గురు అదనపు ఎస్పీలు, నలుగురు డిఎస్పీలు, 21 మంది సీఐలు, 48 ఎస్సై లతో, మహిళా సిబ్బంది, హోంగార్డ్స్, రిజర్వు సిబ్బంది, సాయుధ సిబ్బంది, స్పెషల్ పార్టీ బలగాలచే బందోబస్తు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమలులో ఉంటుందని 100 మీటర్ల వద్ద 200 మీటర్ల వద్ద ప్రత్యేక నియమ నిబంధనలు ఉంటాయని వాటిని పాటించాలని, ప్రజల అనవసరంగా గుమిగూడి ఉండరాదని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలోనికి సెల్ఫోన్లు, వాటర్ బాటిల్ లు, ఇంకు బాటిల్లు, ఆయుధాలు, పెన్నులు, అగ్నికి సంబంధించిన వాటికి అనుమతులు ఉండవని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద క్యూ లైన్ పద్ధతిని పాటించి పోలీసులకు సహకరించాలన్నారు. పోలింగ్ రోజు ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ కేంద్రాలలోనికి అనుమతి ఇస్తారని తెలిపారు. తమ వెంట ఓటర్ ఐడి కార్డులను, గుర్తింపు కార్డులను తెచ్చుకోవాలి. వాట్సాప్ నందు సోషల్ మీడియా నందు ఇతరులకు రెచ్చగొట్టేలా కించపరిచేలా పోస్టులు పెట్టిన వారిపై పోలీసు నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రచారాలు ముగిసిన సందర్భంలో బయట వ్యక్తులు గ్రామాలలో ఉండరాదు. ఎలాంటి సమాచారం అయినా డయల్ 100 ద్వారా పోలీసులకు తెలియజేయాలని, గొడవలకు, అల్లర్లకు పాల్పడకూడదు . ఎన్నికలు పూర్తయిన తర్వాత విజయోత్సవ ర్యాలీలు నిర్వహించరాదని, అధికారుల అనుమతితో నిర్ధారించిన రోజులలో అనుమతి తీసుకుని నిర్వహించుకోవాలి. విజయోత్సవ ర్యాలీలలో టపాకాయలు పేల్చరాదు. సున్నితమైన ప్రాంతాలలో ఫ్లాగ్ మార్చ్ లు నిర్వహిస్తూ ప్రజలలో పోలీసుల పట్ల ధైర్యం నమ్మకం పెంపొందించేందుకు కృషి చేయడం జరిగిందని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు పూర్తి చేయడానికి జిల్లా పోలీస్ యంత్రాంగం కఠినమైన చర్యలతో విధులను నిర్వర్తిస్తుందని తెలిపారు. ఎలాంటి సమాచారం అయినా డయల్ 100 ద్వారా పోలీసు సహాయాన్ని సంప్రదించవచ్చు అదేవిధంగా డబ్బు, మద్యం, బహుమతులు లాంటివి పంచే క్రమంలో పోలీసులకు సమాచారం అందించాలి, పోలీసులు వారిపై కఠిన చర్యలు తీసుకుంటారని తెలిపారు.

## కష్టపడి ఎదిగిన ధర్మపురి చంద్రశేఖర్ ను మావల సర్పంచ్ గా భారీ మెజారిటీతో గెలిపించండి

**సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో బోరంచు శ్రీకాంత్ రెడ్డి..**



ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి,డిసెంబర్ 10, (విజన్ ఆంధ్ర) గ్రామ పంచాయితీ సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి మావల పంచాయితీ పరిధిలో ప్రచారం చేపట్టారు. బుధవారం మావల లో అధికార పార్టీ బలపర్చిన మావల గ్రామపంచాయితీ సర్పంచ్ అభ్యర్థి ధర్మపురి చంద్రశేఖర్ కు మద్దతుగా ఇంటింటికీ తిరుగుతూ ఫుట్ బాల్ గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు. అలాగే ఎన్నో ఏళ్లుగా అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజలమధ్యనే ఉండి సమస్యల పరిష్కారం కోసం పాటుపడిన శేఖర్ కు ఈ సారి అవకాశం ఇవ్వాలని, అధికార పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని గుర్తుచేశారు. వారి వెంట కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

## తలమడుగు మండలంలో మెజార్టీ సర్పంచులు కాంగ్రెస్ పార్టీ వారే గెలుస్తున్నారు

**మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలా చారి**



అదిలాబాద్ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 10, (విజన్ ఆంధ్ర) సర్పంచ్ ఎన్నికల సందర్భంగా అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని ఉముడం అభ్యర్థి బోన్ల మహేందర్ తరపున. సాయిలింగిలో దేవర పాచ్చన్న తరపున. కుచులాపూర్లో తమ్మల పాచ్చన్న తరపున కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల తరపున మాజీ కేంద్రమంత్రి సముద్రాల వేణు గోపాలచారి.బోత్ నియోజకవర్గం ఇంచార్జ్ ఆడే గజేందర్. డిసిసి అధ్యక్షులు నరేష్ జాదవ్. మాజీ పార్లమెంట్ సభ్యులు సోయం బాపురావ్ డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజరెడ్డి లు. ప్రచారం చేసినారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసిలు గోక గణేష్ రెడ్డి. బొల్లారపు బాబన్న. మాజీ ఎంపీపీ కళ్యాణం లక్ష్మి రాజేశ్వర్. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ ప్రకాష్ రావు. వెంకన్న యాదవ్. రామ్చందర్ దేశముక్. పోతాయ్య. రఫిక్. జి భూమారెడ్డి. సల్ల దేవన్న. నారాయణ. గంగార మాజన్. మోహన్. విట్టల్.రామన్న తదితరులు పాల్గొన్నారు.

## అనంత ఈ-సొల్యూషన్లో ఉద్యోగాలంటూ నిరుద్యోగులను మోసం చేసిన కేసులో మరో నిందితురాలు అరెస్ట్ రిమాండ్ కు తరలింపు

ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 10, (విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ టూటౌన్ పోలీసులు అనంత ఈ సొల్యూషన్స్ కేసులో మరో నిందితురాలు మంజులను బుధవారం అరెస్టు చేసి రిమాండ్కు తరలించారు. దాదాపు 50 మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నమ్మించి వారి నుంచి రూ.50లక్షలకు పైగా నిందితులు వసూలు చేశారు. ఆదిలాబాద్ పట్టణం తిలక్నగర్కు చెందిన బాధితుడు మెస్రం ఉమేష్ జులైలో పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పట్లోనే బోథ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కోవ విఠల్ను నిందితునిగా పోలీసులు గుర్తించి అరెస్టు చేసి రిమాండ్కు తరలించినట్లు టూటౌన్ ఇన్స్పెక్టర్ కే.నాగరాజు తెలిపారు. తాజాగా మరో నిందితురాలు మంజుల (జనగాం జిల్లా)ను బుధవారం అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కేసులో మరో ప్రధాన నిందితుడు మధుకిరణ్ పరారీలో ఉన్నాడని, అతని కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగులు ఎవరూ ఇలా ఉద్యోగాల వంకతో డబ్బులు ఇచ్చి మోసపోవద్దని ఆయన సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలకు సైతం ప్రకటనలు వెలువడుతాయని, దరఖాస్తులు చేసుకొని పరీక్షలు రాశాక ప్రతిభ ఉన్న వారికే ఉద్యోగాలు వరిస్తాయన్నారు. ఉద్యోగాల వంకతో మోస పోయిన వారుంటే ఫిర్యాదు చేయాలని సూచించారు.

## జాతీయ రహదారుల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

**–అధికారులకు జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆదేశాలు**




మల్కాజిగిరి, డిసెంబర్ 10, (విజన్ ఆంధ్ర): మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించి నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయాలని, ఆయా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులకు జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ విసి హాలులో జాతీయ రహదారుల నిర్మాణాల పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎన్ హెచ్ ఎఐ పిడి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సమస్యలను అధికారులు, కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించి నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని సూచించారు. జాతీయ రహదారుల నిర్మాణాలకు సంబంధించి రోడ్డు విస్తరణ పై ఉన్న సమస్యలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పరిశీలించారు. రోడ్డు విస్తరణకు సంబంధించిన కోర్టు కేసులను వివరంగా అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ రోడ్డు విస్తరణకు ఎదురవుతున్న సమస్యలను పరిశీలించి ప్రతి కేసు పూర్వపరాలు తెలుసుకొని, తీసుకోవలసిన చర్యల పై అధికారులకు అవసరమైన సలహాలు సూచనలు చేసారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, కీసర ఆర్డిఓ ఉపేందర్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# గౌడ్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ " గోపా "



పెద్దపల్లి జిల్లా : ఆదివారం 07 డిసెంబర్ 2025 ఉదయం 10 గంటలకు " గోపా" నూతన కమిటీ నిర్మాణం కోసం గోదావరిఖనిలోని విశ్వ భారతి పాఠశాల లోని సెమినార్ హాల్లో నిపెద్దపల్లి జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించడం జరిగినది . ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా కరీంనగర్ జిల్లా అధ్యక్షులు అమరగాని నరసయ్య గౌడ్ గారు వ్యవహరించి మాట్లాడుతూ గోప యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ 1975 నుంచి ఇప్పటివరకు " గోపా " అన్ని జిల్లాలలో విస్తరించి గౌడుల కోసం ఎంతగానో కృషి చేస్తుందని, కార్తీక వనభోజనాలు, ప్రతిభా పురస్కారం అవార్డులు, విద్యార్థులకు అందిస్తూ ప్రోత్సాహక కార్యక్రమాలు చేస్తూ గౌడ్ ల అభివృద్ధికి సహాయసహకారాలు అందిస్తుందని వివరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు బత్తిని సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ, మన గౌడ జాతికి సంబంధించిన గౌడ్ హాస్టల్ హైదరాబాదులో చాలా పెద్ద మొత్తంలో గౌడ విద్యార్థిని విద్యార్థులను చేర్చుకొని అందులో కొంత మందిని కడు బీద వారిని ఉచితంగా వసతి మరియు ఆహారము అందిస్తూ ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న వారికి కోచింగ్ కూడా ఇప్పిస్తూ, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నటువంటి హాస్టల్ వసతులు కూడా మన పిల్లలు ఉపయోగించుకుని బాగా చదివి ఉన్నత స్థితికి చేరుకోవాలని సూచించారు. ఉపాధ్యక్షులు ముద్దగౌని రాం మోహన్ గౌడ్ మాట్లాడుతూ " గోపా " అనే గొప్ప వేదిక ద్వారా మన జాతి మొత్తం ఒకే గొడుగు కిందకు వస్తుందని, ప్రతీ ఒక్కరూ అర్హత ఉన్న వారు తప్పకుండా సభ్యత్వం తీసుకుని జాతి బలోపేతానికి సహకరించాలని సూచించారు. మరొక రాష్ట్ర ఉపాధ్యక్షులు చెక్కిళ్ల మధుసూదన్ గౌడ్ మాట్లాడుతూ, గౌడ్ లందరు తమ పేరు చివర గౌడ్ అని నమోదు చేసుకొనవలెనని, ఆల కాని పక్షంలో పేరు చెప్పేటప్పుడైనా చివర గౌడ్ అని చెప్పాలని సూచించారు. " గోపా " లో సభ్యత్వం ప్రపంచంలో ఎక్కడి నుంచైనా తీసుకునే విధంగా వెబ్ సైట్ రూపొందించడం జరిందని వివరిస్తూనే,



ప్రస్తుతం జరుగుతున్న ఎలక్షన్లలో మన గౌడ్ లను ప్రోత్సహిస్తూ ఎక్కడెక్కడ గౌడ్ లు నిలబడ్డారో అక్కడికి మన వారు వెళ్లి మనవారిని గెలిపించుకొనవలెనని మన యొక్క బలాన్ని ఐక్యతను సమాజానికి తెలియజేయాలని, గౌడ్ లు పోటీ చేయని ప్రదేశాలలో బహుజనులను గెలిపించుకోవాలని చూపించారు. మన జాతి రత్నాలైన పి. సి. సి రాష్ట్ర అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ గారు, మరియు పొన్నం ప్రభాకర్ గౌడ్ గారు రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తూ ఇరువురు కూడా మన జాతి గౌరవాన్ని మరింతగా పెంపొందిస్తూ మనకు ఎంతో సహకారం అందిస్తున్నారు, కాబట్టి వారికి




యావత్ గౌడ జాతి తరపున అభినందనలు తెలియజేస్తూ వారికి ఎప్పుడు మనం అందరం అండగా ఉండాలని సూచించారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ కళ్యాణ్ చక్రవర్తి గౌడ్ మాట్లాడుతూ సభ్యులు గా చేరిన ప్రతీ ఒక్క సభ్యుని సభ్యత్వ గుర్తింపు కార్డు మరుక్షణం లోనే అందించే విధంగా ప్రతీ సభ్యుని వివరాలు కంప్యూటరైజ్ చేసి అందించడం జరుగుతుంది అని వివరించారు. రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మాదు సైదులు గౌడ్ మాట్లాడుతూ ఈ వేదిక ద్వారా రాష్ట్ర నలుమూలలలో ఉన్న గౌడ్ లు సులభంగా పరిచయాలు పెంచుకుంటూ సమస్యలను సులభంగా పరిష్కారానికి మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది, కమిటీ సభ్యులలో జిల్లా అధ్యక్షులుగా మండ రమేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా బందారపు యాదగిరి గౌడ్ కోశాధికారిగా కొక్కిన దేవేందర్ గౌడ్ లు ఎన్నిక కాబడినారు.



# బాల్య వివాహాల రహిత భారతదేశం సాధ్యం అవుతోంది

**సంగారెడ్డి, జనగాం ,యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ప్రభుత్వ 100 రోజుల ప్రచారానికి స్కోప్ సంస్థ మద్దతు: డాక్టర్ బండి సాయన్న**




భారతదేశాన్ని 2030 నాటికి బాల్య వివాహరహిత దేశంగా మార్చాలనే కేంద్ర ప్రభుత్వం అత్యంత దృఢ నిశ్చయంతో, సంగారెడ్డి, జనగాం, యాదాద్రి భువనగిరి జిల్లాలు "బాల వివాహ ముక్త భారత్" తొలి వార్షికోత్సవాన్ని విశేష ఉత్సాహంతో నిర్వహించాయి. ఈ జిల్లాల్లో బాల్య వివాహాల నిర్మూలన కోసం కృషి చేస్తున్న స్పందన కల్చరల్ ఆర్గనైజేషన్ ఫర్ ప్రోగ్రెసివ్ ఎడ్యుకేషన్ (స్కోప్) ప్రభుత్వ "100 రోజుల విశాల అవగాహన కార్యక్రమం"ను విజయవంతం చేయేందుకు అన్ని శాఖలతో సమన్వయంగా పని చేయనున్నట్లు ప్రతిజ్ఞ చేసింది. న్యూఢిల్లీలో కేంద్ర మహిళా మరియు శిశు అభివృద్ధి మంత్రి అన్నపూర్ణా దేవి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. బాల్య వివాహాలకు కారణమయ్యే సామాజిక వాతావరణాన్ని సున్నితంగా మార్చేందుకు ఈ 100 రోజుల ప్రణాళిక రూపొందించబడింది. స్పష్టమైన విధానాలు, స్థిరమైన చర్యలు, గ్రామీణ స్థాయి కృషితో శిశు వివాహాల నిర్మూలన దిశగా భారత్ వేగంగా ముందుకు సాగుతోందని ప్రధానమంత్రి




నరేంద్ర మోదీ ఇటీవల వ్యాఖ్యానించారు. కేంద్ర నోటిఫికేషన్కు స్పందిస్తూ, తెలంగాణ ప్రభుత్వం ఆరోగ్య & కుటుంబ సంక్షేమం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పాఠశాల విద్య, ఉన్నత విద్య శాఖలకు చెందిన అన్ని అధికారులకు ఈ ప్రచారంలో సక్రియంగా పాల్గొనాలని ఆదేశించింది. జిల్లా సంస్థలు చేపడుతున్న ఉత్తమ చర్యలను అభినందించిన స్కోప్ సంస్థ అధ్యక్షుడు డా. బండి సాయన్న అన్నారు: "మా జిల్లాల్లో ప్రభుత్వ యంత్రాంగం బాల్య వివాహాలపై నిరంతరం పోరాటం చేస్తోంది. వారి సమన్వయంతో మేము చాలా కార్య క్రమాలు చేశాం. దేశం మొత్తం ఏకమై, అత్యున్నత నాయకత్వం మార్గనిర్దేశం చేస్తున్న ఈ సమయంలో, 2030 కన్నా ముందే బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించగలమని నమ్మకం వచ్చింది . ఒకప్పుడు అసాధ్యమని భావించిన కూడా ఈరోజు భారతదేశం సాధ్యం చేయగలుగుతుంది. ఈ చారిత్రక క్షణంలో భాగస్వామ్యం కావడం మాకు గర్వకారణం."

250 కంటే ఎక్కువ ఎన్జీవోలతో పనిచేస్తున్న దేశంలోని అతిపెద్ద పిల్లల రక్షణ నెట్వర్క్లో ఒకటైన జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్తో స్కోప్ సంస్థ భాగస్వామ్యంలో పనిచేస్తోంది. గత ఏడాదిలోనే ఈ నెట్వర్క్ భారత దేశంలో ఒక లక్షకు పైగా బాల్య వివాహాలను అడ్డుకుంది. 100 రోజుల విశాల అవగాహన కార్యక్రమం ప్రధానంగా ఈ విభాగాల్లో అమలు చేయబడుతుంది: పాఠశాలలు మరియు శిక్షణ సంస్థలు. వివాహాలు జరిగే ఆధ్యాత్మిక సంస్థలు. వివాహ సేవలందించే సంస్థలు (దేవాలయాలు, మసీదులు, చర్చిలు, గురుద్వారాలు, కళ్యాణ మండపాలు, బ్యాండ్ పార్టీలు).

పంచాయతీలు, మున్సిపల్ వార్డులు. ఈ కార్యక్రమం అంతర్జాతీయ మహిళా దినోత్సవం – 8 మార్చి 2026న ముగుస్తుంది. ఇది రాష్ట్ర, జిల్లా, గ్రామ స్థాయిల్లో మూడు దశల్లో అమలు అవుతుంది:

పాఠశాలలు, కళాశాలలు, విద్యాసంస్థల్లో అవగాహన.

ఆధ్యాత్మిక సంస్థలు, వివాహ సేవలందించే వర్గాలతో ప్రత్యేక కార్యక్రమాలు.

గ్రామ పంచాయతీలు మరియు వార్డుల ద్వారా సముదాయ భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం.

దీనికి సంబంధించి జిల్లా పరిపాలనలకు ఇప్పటికే విపులమైన మార్గదర్శకాలు జారీ చేయబడ్డాయి.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.